గురువారం 27-6-2019

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 96



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'




**మొండి బండ.. మరింత భారం**

బ్యాంక్ లాభాలపై మొండి భారం.. దివాలా చట్టం ఊరట అంతంతే - బిజినెస్‌లో




**జైత్రయాత్ర కొనసాగాలని..**

ప్రపంచకప్‌లో నేడు వెస్టిండీస్‌తో భారత్ మ్యాచ్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## ఐబీ చీఫ్‌గా అర్వింద్.. 'రా' చీఫ్‌గా గోయల్

ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన కేబినెట్ నియామకాల కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ ఐబీ నూతన అధిపతిగా ఐపీఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను, రా చీఫ్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సామనత్ కుమార్ గోయల్‌ను నియమించింది.

- వివరాలు 5లో



సామనత్ కుమార్ గోయల్, అర్వింద్



భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో

5 లో

## 1 నుంచి ఎంసెట్ వెబ్ ఆప్షన్లు

- నేటి నుంచి నిర్వహించాల్సిన ప్రక్రియ వాయిదా
- రివైజ్డ్ షెడ్యూల్ జారీచేసిన ప్రవేశాల కమిటీ
- యాజమాన్య ప్రతిపాదిత ఫీజుపై నేడు అప్పీల్‌కు విద్యాశాఖ
- కొత్త ఫీజులు ఖరారుచేసే వరకు పాత ఫీజుల అమలుకు వినతి

2 లో



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో స్వరూపానంద స్వామికి పుష్పాభిషేకం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో స్వాత్మానందేంద్ర స్వామి, తదితరులు

2 లో

## ఎన్‌ఆర్‌సీ నుంచి మరో లక్ష తీసివేత

అస్సాంలో ఎన్‌ఆర్‌సీ ముసాయిదా నుంచి మరో లక్ష మంది పేర్లను బుధవారం తొలగించారు. వివిధ కారణాలతో వారందరూ భారత పౌరసత్వం పొందేందుకు అనర్హులని వారి వివరాల తనిఖీల సమయంలో గుర్తించామని ఎన్‌ఆర్‌సీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ తెలిపారు.

- వివరాలు 5లో



# ప్రక్షాళన షురూ!

## రెవెన్యూలో బదిలీలకు రంగం సిద్ధం

- ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలొచ్చే అవకాశం
- కంప్యూటర్ ఆపరేటర్ నుంచి ఆర్డీఓ వరకు..
- మూకుమ్మడి స్థానచలనాలకు సర్కారు మౌఖిక ఆదేశాలు
- ఉద్యోగ సంఘాల ఒత్తిడికి తలొగ్గవద్దంటూ సంకేతాలు!
- ఇప్పటికే రంగారెడ్డిలో బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తి
- ఇతర జిల్లాల్లోనూ అమలు చేయాలని నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూశాఖను సంస్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా.. దీర్ఘకాలికంగా ఒకే చోట తిష్టవేసిన ఉద్యోగులను ఆయా స్థానాలనుంచి బదిలీ చేయాలని నిర్ణయించింది. రెవెన్యూశాఖను అవినీతిరహితంగా మార్చేందుకు సంకల్పించిన నేపథ్యంలో మూకుమ్మడి బదిలీలతో కొంతమేర మార్పు తీసుకురావొచ్చని సర్కారు భావిస్తోంది. ఈ క్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ నుంచి మొదలుపెట్టి.. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) స్థాయి వరకు అందరికీ స్థానచలనం చేయాల్సిందేనని యోచిస్తోంది. రెవెన్యూ శాఖలో పైసలివ్వందే ఫైలు ముందుకు కదలడంలేదని



మిగతా 2వ పేజీలో ▶

# దొందూ.. దొందే

## పీవీ, ప్రణబ్‌పై చిన్నారెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

- మాజీ ప్రధాని పీవీ తిన్నింటివాసాలు లెక్కపెట్టారని విమర్శ
- ఆరెస్సెస్ సభకెళ్లి భారతరత్న తెచ్చుకున్నారని ప్రణబ్‌పై మండిపాటు



బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** మాజీ ప్రధాని, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత పీవీ నరసింహారావు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీలపై ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన వ్యక్తి పీవీ అని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలు మానుకొని హైదరాబాద్‌లో కూర్చున్న పీవీని సోనియాగాంధీ పిలిచి ప్రధానిని చేశారన్న చిన్నారెడ్డి.. ఇంత గౌరవం ఇచ్చినప్పటికీ పీవీ పార్టీని భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ పీవీకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. కానీ ఆయన మాత్రం గద్దెనెక్కిన తర్వాత సోనియా సహా సీనియర్లను అణగదొక్కే ప్రయత్నం చేశారు. ప్రధాని పదవికి మరోనేత పోటీగా తయారవుతారనే ఆయన అలా వ్యవహరించారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు సహకరించి పీవీ మరో ఘోరతప్పిదం చేశారు. దీంతో అప్పటివరకు కాంగ్రెస్‌ను లౌకిక పార్టీగా విశ్వసించిన మైనారిటీలు

మిగతా 2వ పేజీలో ▶




## 1,036 'వైద్య' పోస్టుల భర్తీకి ఓకే

- 132 అసిస్టెంట్ ప్రొఫెసర్, 904 పారా మెడికల్ పోస్టుల నియామకానికి రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు
- నల్లగొండ, సూర్యాపేట వైద్య కళాశాలల్లో నియామకాలకు అనుమతి

4 లో

## నేడు సెక్రటేరియెట్‌కు శంకుస్థాపన

- అసెంబ్లీకి కూడా... శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్
- నిర్మాణాలపై నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ - 2లో










కొత్త సచివాలయ భవనం శంకుస్థాపన కోసం తీసిన గొయ్యి

# నేడు సచివాలయం, 'అసెంబ్లీ'కి శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయం, అసెంబ్లీ భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. తొలుత ఉదయం 11 గంటలకు సచివాలయంలోని డీ-బ్లాక్ వెనుక భాగంలోని పోర్టికో ఎదురుగా ఉన్న పార్కులో కొత్త భవన నిర్మాణానికి కేసీఆర్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఉదయం 12 గం.కు ఎర్రమంజిల్ ప్యాలెస్, ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవన సముదాయం మధ్య ఖాళీ స్థలంలో కొత్త అసెంబ్లీ భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తారు. చరిత్రాత్మక ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చి కొత్త అసెంబ్లీ భవన సముదాయం, సచివాలయం ప్రాంగణంలోని భవనాలన్నింటినీ కూల్చి అక్కడే కొత్త సచివాలయ భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జెడ్పీ చైర్‌పర్సన్లను ఆహ్వానించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ వీరికి విందు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ భవన్‌లో జరిగే పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఇదిలా ఉండగా, కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణంపై అధ్యయనం కోసం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వి.శ్రీనివాస్ గౌడ్‌తో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై చర్చించనుందని అధికారవర్గాలు తెలిపాయి.

## నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరానికి దగ్గర్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొంది. అలాగే ఈ నెల 29, 30వ తేదీల్లో ఉత్తర బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది.

**24 గంటల్లో వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం**

నిజామాబాద్ జిల్లాలోని మక్లూర్‌లో 5 సెం.మీ., మోర్తాడ్‌లో 3సెం.మీ., భీంగల్‌లో 2 సెం.మీ., డిచ్‌పల్లిలో 2 సెం.మీ., హకీంపేట్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి) 3 సెం.మీ., మర్రిగూడ (నల్గొండ) 2 సెం.మీ.,ల వర్షపాతం నమోదైంది.

## కళ్యాణ'లబ్ధి' ఒక్కసారే...!

సాక్షి, హైదరాబాద్: అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఒక్కసారే వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక వ్యక్తి జీవిత కాలంలో ఒకసారి మాత్రమే ఈ పథకాల కింద అర్హులవుతారని పేర్కొంది. ఇందులో మొదటి పెళ్లి, రెండో పెళ్లి అనే అంశాలు అప్రస్తుతమని తేల్చి చెప్పింది. ఈమేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఒక వ్యక్తి తన సోదరి రెండో వివాహం నేపథ్యంలో కళ్యాణలక్ష్మి పథకం కింద లబ్ధి పొందవచ్చా అని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం లోతుగా పరిశీలించి ఈ ఆదేశాలు జారీ చేసింది.

## నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయండి

**కేంద్రానికి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ వినతి**



సాక్షి, న్యూఢిల్లీ: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో జవహర్ నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం లోక్‌సభలో జీరో అవర్ సందర్భంగా బోరకుంట్ల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం ప్రతి జిల్లాలో ఒక నవోదయ పాఠశాల ఉండాలని, దీనికి అనుగుణంగా ఈ రెండు జిల్లాల్లో నవోదయ పాఠశాలల్ని సత్వరమే ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఈ స్కూళ్ల కోసం స్థలం, భవనం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని బోర్లకుంట వెంకటేశ్ వివరించారు.

## చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

**హెచ్‌ఆర్సీని కలిసిన నేతన్నల జేఏసీ**

సాక్షి, న్యూఢిల్లీ: నేతన్నల ఆత్మహత్యలను నివారించి రాష్ట్రంలో చనిపోయిన నేతన్నల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని నేతన్నల జేఏసీ నాయకులు జాతీయ మానవ హక్కుల కమిషన్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేతన్నలకు అందించే ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. జేఏసీ చైర్మన్ దాసు సురేష్ మాట్లాడుతూ నేతన్నల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి సూచించాలన్నారు. 300 మందికి పైగా చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు అత్యంత బాధాకరమైనవని ప్రధాన సలహాదారు తాటికొండ వెంకటరాజయ్య కమిషన్‌కు వివరించారు. మానవ హక్కుల కమిషన్‌ను కలిసిన సభ్యుల్లో కో-కన్వీనర్‌లు గంజి మురళి, చిప్ప వెంకటేశ్వర్లు, జోగా బుచ్చన్న, పంథగాని భాగ్యలక్ష్మి, గంజి రాజేందర్ నేత, సర్వేశ్, బండి అశోక్ తదితరులున్నారు.

## అంతర్రాష్ట్ర సలహాదారుడిగా టంకశాల

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్, సాహిత్యకారుడు టంకశాల అశోక్‌ను అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారుడిగా నియమిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు టంకశాల అశోక్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## శివాజీ పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: టీవీ9 కొత్త యాజమాన్యం ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ పోలీసులు తనపై నమోదు చేసిన కేసుల్ని కొట్టివేయాలని కోరుతూ సినీనటుడు శివాజీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ జూలై 9కి వాయిదా పడింది. శివాజీపై కఠిన చర్యలు తీసుకోరాదని గత విచారణలో జారీ చేసిన ఉత్తర్వులు కొనసాగుతాయని బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. శ్రీదేవి తెలిపారు. టీవీ9లో రవిప్రకాశ్‌కు చెందిన 40 వేల షేర్లను కొనుగోలు చేసేందుకు గత ఏడాది ఫిబ్రవరి 19న రూ. 20 లక్షలు చెల్లించినట్లుగా శివాజీ కట్టుకథ చెబుతున్నారని టీవీ9 కొత్త యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు శివాజీపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.



స్వాత్మానందేంద్ర స్వామిని తులసిమాలతో సన్మానిస్తున్న సీఎం కేసీఆర్. పక్కన స్వరూపానంద స్వామి



కోకాపేటలో కేటాయించిన రెండెకరాల భూమి పత్రాలను స్వరూపానంద స్వామికి అందజేస్తున్న కేసీఆర్

# ఘనంగా స్వాత్మానందేంద్ర పరిచయ సభ

- హాజరైన సీఎం, స్పీకర్ పోచారం, మంత్రులు
- చాతుర్మాస దీక్ష తర్వాత తెలంగాణకే: స్వాత్మానందేంద్ర
- సామాజిక సేవలో ముందుంటామన్న స్వరూపానంద
- హైదరాబాద్‌లో శారదాపీఠానికి భూమిపూజ

సాక్షి, హైదరాబాద్: శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి పరిచయ సభ బుధవారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి 5 నిమిషాల ముందే సభాస్థలికి వచ్చిన సీఎం కేసీఆర్.. స్వాత్మానందేంద్ర, స్వరూపానంద స్వాములకు స్వాగతం పలికి వారిని వేదికపైకి తీసుకొచ్చారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూజ నిర్వహించారు. అనంతరం కేసీఆర్ నూతన వస్త్రాలు, తులసిమాల, పుష్పమాలతో స్వాములిద్దరినీ సన్మానించారు. అనంతరం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులకు పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం విశాఖ శారద పీఠానికి నగర శివారులోని కోకాపేటలో రెండెకరాల స్థలం కేటాయింపునకు సం బంధించిన ఉత్తర్వులను సీఎం కేసీఆర్ స్వరూపానంద స్వామికి అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రధాన దేవాలయాలకు చెందిన దేవతా శేషవస్త్రాలు, ప్రసాదాలను స్వాములకు అందించారు. కార్యక్రమం చివర్లో స్వాములిద్దరికీ కేసీఆర్ పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వరూపానంద స్వామి కేసీఆర్‌కు శేషవస్త్రాలు అందించి సన్మానించారు.

**తెలంగాణ నుంచే ధర్మప్రచారం..**

తెలంగాణ నుంచే ధర్మప్రచారాన్ని ప్రారంభిస్తానని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారిగా నియమితులైన స్వాత్మానందేంద్ర స్వామి ప్రకటించారు. చాతుర్మాస దీక్షలో భాగంగా తెలంగాణ నుంచే హృషికేష్‌కు పయనమవుతున్నానని, కొంతకాలం తపస్సు తర్వాత మళ్లీ తెలంగాణకే వస్తానని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తన పరిచయ సభ ఉన్నందున, ఇందులో పాల్గొన్న తర్వాతే హృషికేశ్‌కు వెళ్లాలన్న శారదపీఠాధిపతి ఆదేశంతోనే తానిక్కడికి వచ్చానన్నారు. ఈ కార్యక్రమం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. స్వరూపానంద స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక, ధర్మ ప్రచారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో శారదాపీఠం ముందుంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నగరంలో రెండెకరాల భూమి కేటాయించడం సంతోషమన్నారు. తమ పీఠం విశాఖలో ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌తో సుదీర్ఘ అనుబంధముందన్నారు. ఇక్కడే రెండు పర్యాయాలు చాతుర్మాస దీక్ష నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఇటీవలే ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్ సమక్షంలో పీఠం ఉత్తరాధికారిగా స్వాత్మానందేంద్రను నియమించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**నన్ను పొగడొద్దు: కేసీఆర్**

విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి పరిచయ సభ అయినందున వ్యాఖ్యానంలో తనపై ప్రశంసలు కురిపించ వద్దని, ప్రస్తావన తేవొద్దని సీఎం కేసీఆర్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాత మడిపల్లి దక్షిణమూర్తి.. కేసీఆర్‌ను ప్రశంసించబోగా, ఇదే విషయాన్ని సీఎం చిట్టీరాసి ఆయనకు పంపించారు. అదే విధంగా జలవిహార్ ఎండీ రామరాజు దంపతులు సన్మానించబోగా, కేసీఆర్ సున్నితంగా తిరస్కరించారు.

**శారదాపీఠానికి భూమిపూజ**

విశాఖ శారదాపీఠానికి హైదరాబాద్ శివారులోని గండిపేట మండలం కోకాపేటలో కేటాయించిన రెండెకరాల భూమిలో బుధవారం భూమిపూజ నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన భూమిని అధికారులు పీఠానికి అప్పగించడంతో బుధవారం పీఠాధిపతి శ్రీస్వరూపానందస్వామి భూమి పూజ చేశారు. పీఠం అర్చకులతో కలసి ఉదయం 10.30 గంటలకు వచ్చిన ఆయన హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండెకరాల భూమిలో ఆలయం, వేదభాషాగోష్ఠి మఠం, సంస్కృతి విద్యా సంస్థ, విద్యార్థుల వసతిగృహం, భోజనశాల, సమావేశమందిరం నిర్మించనున్నట్లు సమాచారం. బుధవారం జరిగిన పూజాకార్యక్రమాలకు మీడియాను అనుమతించలేదు. అక్కడకు వెళ్లిన విలేకరులను ఫొటోలు తీయవద్దని మఠం స్వామీజీలు, పోలీసులు కోరారు. ఇదిలా ఉండగా, టీవీ నటుడు రచ్చరవి స్వామీజీని కలసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

# 1 నుంచి ఎంసెట్ వెబ్ ఆప్షన్లు

- నేటి నుంచి నిర్వహించాల్సిన ప్రక్రియ వాయిదా
- రివైజ్డ్ షెడ్యూల్ జారీచేసిన ప్రవేశాల కమిటీ
- యాజమాన్య ప్రతిపాదిత ఫీజుపై నేడు అప్పీల్‌కు విద్యాశాఖ
- కొత్త ఫీజులు ఖరారు చేసేవరకు పాత ఫీజుల అమలుకు వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం గురువారం నుంచి చేపట్టాల్సిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ వాయిదా పడింది. ఫీజుల వ్యవహారంలో తలెత్తిన గందరగోళం కారణంగా ప్రవేశాల కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మాత్రం గురువారం నుంచి జూలై 3వ తేదీ వరకు యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. జూలై 1వ తేదీ నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లు నిర్వహించేలా రివైజ్డ్ షెడ్యూల్ జారీ చేసింది.

**ఫీజుల ఖరారులో గందరగోళంతో...**

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యా కాలేజీల్లో వచ్చే మూడేళ్లకు వార్షిక ఫీజు ఖరారు చేయాల్సిన టీఏఎఫ్‌ఆర్‌సీకి చైర్మన్‌ను నియమించడంలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో టీఏఎఫ్‌ఆర్‌సీ సభ్య కార్యదర్శి ఫీజుల ఖరారు కోసం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించారు. అయితే కొన్ని కాలేజీలు ఫీజులు ఖరారు చేయాలని కోర్టును ఆశ్రయించడంతో.. టీఏఎఫ్‌ఆర్‌సీ చైర్మన్‌ను నియమించి ఫీజులు ఖరారు చేసే వరకు యాజమాన్యాలు ప్రతిపాదించిన ఫీజును అమలు చేయాలని కోర్టు తీర్పు వెలువరించింది. అనంతరం ఆయా ఫీజుల్లో ఏమైనా హెచ్చుతగ్గులు ఉంటే తర్వాత సర్దుబాటు చేసుకోవాలని సూచించింది. అయితే, కోర్టును ఆశ్రయించిన 81 కాలేజీలు ప్రతిపాదించిన ఫీజును అమలు చేస్తే తల్లిదండ్రులపై భారం పడుతుందని, తర్వాత సర్దుబాటు చేసే అవకాశం ఉన్నా ముందుగా ఆ భారం భరించాల్సిన పరిస్థితి వస్తుందని భావించిన విద్యాశాఖ.. ఆ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించింది. టీఏఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ నియామకం జరిగి ఫీజులు ఖరారు చేసేవరకు పాత ఫీజులను అమలు చేయాలని కోరుతూ అప్పీలుకు వెళ్లనుంది. కాగా, తీర్పు కాపీ బుధవారం రాత్రి అందిందని, దీనిపై గురువారం అప్పీల్‌కు వెళ్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ వాయిదా వేసి, జూలై 1వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అలాగే టీఏఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ నియామకానికి ముగ్గురు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేయాలంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి గురువారం ప్రతిపాదన పంపించనున్నట్టు తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపాదించే ముగ్గురిలో ఒకరిని ప్రభుత్వం ఎంపిక చేస్తుంది.

**యథావిధిగా సర్టిఫికెట్ వెరిఫికేషన్**

ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం బుధవారం వరకు 45,156 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్లు బుక్ చేసుకున్నారు. నిర్ణీత తేదీల్లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు గురువారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను యథావిధిగా నిర్వహించనున్నారు. విద్యార్థులు జూలై ఒకటో తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు.

# అవినీతి నిగ్గు తేల్చండి

- టీడీపీ సర్కారు అవినీతిపై విచారణకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు
- దాదాపు 30 అంశాలపై విచారణకు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశం

సాక్షి, అమరావతి: ఏపీలో ఐదేళ్లుగా గత టీడీపీ ప్రభుత్వం ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోచుకున్న తీరుపై నిగ్గు తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి సాగించిన దోపిడీని బట్టబయలు చేయాలని సంకల్పించింది. ఇష్టారాజ్యంగా ప్రాజెక్టుల అంచనాలు పెంచేసి, కమీషన్లే లక్ష్యంగా పని చేసి ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేలా చేసిన వైనాన్ని ఎత్తిచూపాలని కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా ఐదేళ్లుగా గత ప్రభుత్వం సాగించిన అవినీతి బాగోతాలపై విచారణకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 30 అంశాలపై మంత్రి వర్గ ఉపసంఘం విచారణ చేస్తుందని చెప్పారు. ఏసీబీ, విజిలెన్స్, సీఐడీ విభాగాల్లోని సీనియర్ అధికారుల బృందం విచారణకు సహకారం అందజేస్తుందన్నారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యుత్ రంగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత టీడీపీ సర్కారు పాల్పడిన అక్రమాలపై సమగ్రంగా విచారణ చేసి ఆరు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఐదుగురు సభ్యుల మంత్రివర్గ ఉప సంఘానికి సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి.. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి.. భారీఎత్తున దోచేసిన తీరును ప్రజల ముందు పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వ హయాంలో సాగిన అవినీతిని వెలికి తీయడం కోసం మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు.

**ఇవీ మార్గదర్శకాలు**

- గత ప్రభుత్వం తీసుకున్న విధాన పరమైన భారీ నిర్ణయాలు, కార్యక్రమాలు, కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సంస్థలను అడ్డం పెట్టుకుని భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడంపై విచారణ.
- రాష్ట్రంలో టెండర్ల విధానం, ఆ విధానంలో టీడీపీ సర్కారు చేసిన సవరణలు, కాంట్రాక్టర్లకు అప్పగించిన భారీ ప్రాజెక్టుల పనులు, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టులు, స్విస్ ఛాలెంజ్ విధానం, సహజ వనరుల కేటాయింపు (ప్రధానంగా భూములు, నీళ్లు, గనులు, విద్యుత్)లో నిబంధనలను ఉల్లంఘించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి దోచుకున్న తీరుపై సమీక్ష.
- బిజినెస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సంస్థలు, ప్రజాభ్యుదయం ముసుగులో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రభుత్వ సంస్థలపై చూపిన దుష్ప్రభావాన్నీ సమీక్ష
- గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు, మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్స్, లెటర్స్ ఆఫ్ ఇంటెంట్, స్పెషల్ పర్పస్ వెహికల్స్, జాయింట్ వెంచర్స్‌లో అవినీతికి పాల్పడటం, ఆశ్రిత పక్షపాతం చూపడంపై విచారణ.
- వివిధ కార్పొరేషన్లు, పరిశ్రమలు, అథారిటీలు, సొసైటీల పనితీరుపై సమీక్ష.
- గత ప్రభుత్వం భారీఎత్తున కన్సల్టెన్సీలను ఏర్పాటు చేయడంపై విచారణ. ఈ వ్యవహారంలో అవినీతికి పాల్పడిన తీరుపై సమీక్ష
- ప్రభుత్వ భూముల కేటాయింపుపై విచారణ. భూముల కేటాయింపులో క్విడ్ ప్రో కోకు పాల్పడిన వ్యవహారాలపై సమీక్ష
- గత ప్రభుత్వం మైనింగ్ లీజులు మంజూరు చేయడంపై సమగ్ర విచారణ.
- విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో నిబంధనలను ఉల్లంఘించడం, అక్రమాలకు పాల్పడి కమీషన్లు తీసుకోవడంపై విచారణ. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సొసైటీల్లో అక్రమాలకు పాల్పడిన తీరుపైన దర్యాప్తు.
- వైద్య, విద్య, పౌష్టికాహార కార్యక్రమాల్లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టులపై సమగ్ర విచారణ.
- ఐటీ రంగంపై సమగ్రంగా సమీక్ష.
- సీఆర్‌డీఏ, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, విమానాశ్రయాలు, హైవే ప్రాజెక్టుల్లో గత ప్రభుత్వ పెద్దలు పాల్పడిన అక్రమాలపై సమగ్ర సమీక్ష. సీఆర్‌డీఏ పరిధిలో భూముల కేటాయింపు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ విధానంలో భూముల కొనుగోలు ద్వారా అక్రమంగా లబ్ధిపొందడంపై విచారణ.
- ఈ అక్రమాల్లో రాజకీయ నేతలు, కీలక అధికారుల పాత్రపై విచారణ.

# దొందూ.. దొందే

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీకి దూరమయ్యారు. దీంతో పార్టీకి ఇబ్బందులు తలెత్తడంతోనే గాంధీ కుటుంబం ఆయన్ను పక్కనబెట్టింది. కేవలం బాబ్రీని కూల్చినందుకే బీజేపీ నేతలు పీవీని పొడుగుతున్నారు' అని చిన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రణబ్‌ను రాష్ట్రపతి చేసిన ఘనత కూడా కాంగ్రెస్‌దే అన్నారు. నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ సభకు వెళ్లి, సంఘ్ భావజాలాన్ని ప్రశంసించినందుకే ప్రణబ్‌కు బీజేపీ భారతరత్నతో సత్కరించిందన్నారు. అది కూడా ఆరెస్సెస్ నేత నానాజీ దేశ్‌ముఖ్‌తో కలిపి ఇచ్చారని చిన్నారెడ్డి గుర్తుచేశారు. ఆరెస్సెస్ భావజాలం ఉన్న వాళ్లనే బీజేపీ దగ్గరకి తీస్తోందని, దేశమంతా ఆ భావజాలాన్ని నింపాలనే లక్ష్యంతోనే ఎన్డీయే ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆరెస్సెస్‌కు అనుకూలంగా లేనందుకే బీజేపీ ఆయన్ను పొగడదని చిన్నారెడ్డి అన్నారు. మన్మోహన్‌కు కాంగ్రెస్ ఎంతో గౌరవం ఇస్తోందని, పార్టీ కార్యక్రమాలన్నింటిలో తగిన గౌరవం ఇస్తున్నామని పేర్కొన్నారు.

**తెలంగాణ అప్పులకుప్ప**

మిగులు బడ్జెట్‌తో ఉన్నామని చెబుతున్నప్పటికీ.. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని చిన్నారెడ్డి విమర్శించారు. తెలంగాణకు 1.8లక్షల కోట్ల రూపాయల అప్పున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా చెప్పిందన్నారు. ఈ నిధులను ఎక్కడ ఖర్చు పెట్టారో కేసీఆర్ వెల్లడించాలని చిన్నారెడ్డి డిమాండ్ చేశారు.

## మోసాలపై ఫిర్యాదు చేయండి

**వినియోగదారులకు అకున్ సబర్వాల్ సూచన**

సాక్షి, హైదరాబాద్: వినియోగదారులు నష్టపోయినప్పుడు వినియోగదారుల రీడ్రెస్సెల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 180042500333కు తెలుపవచ్చని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ సూచించారు. ఫేస్‌బుక్ అయితే **'consumerinformationredressalcenter'** లేదా **'ww.consumer advice.in'** వెబ్‌సైట్‌లలో ఫిర్యాదులు పంపవచ్చని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ప్రముఖుల పేర్లు ప్రచారానికి వాడుకుంటున్నారని సుల్తాన్ బజార్‌లోని హేమంత్ సారీ స్టోర్ చీరల షాపుపై వినియోగదారుల సలహా కేంద్రానికి ఫిర్యాదు రావడంతో సదరు షాపు యజమానులకు నోటీసులు జారీ చేసింది.

# ప్రక్షాళన షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. ఈ శాఖను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒకవైపు కొత్త రెవెన్యూ చట్టానికి పదును పెడుతూనే.. మరోవైపు ఉద్యోగులను సమూల మార్పులు చేసేలా విధానాన్ని రూపొందించాలని మాజీ సీఎస్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సూచించారు. ఈ మేరకు నిపుణుల కమిటీ నూతన రెవెన్యూ చట్టం, ఉద్యోగుల విలీనం తదితర అంశాలను లోతుగా అధ్యయనం చేస్తోంది. అయితే, చట్టం మనుగడలోకి రావడం ఆలస్యమవుతున్నందున.. ఆ లోపు ఉద్యోగుల బదిలీల ద్వారా కాస్తయినా మార్పు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

**దిగువ నుంచి ఎగువ వరకు**

ఈ విషయంలో ఎలాంటి తారతమ్యాల్లేకుండా.. దిగువస్థాయి నుంచి ఎగువస్థాయి వరకు తేడాల్లేకుండా బదిలీలు వర్తింపజేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, వీఆర్‌ఓ, ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, నయాబ్ (ఉప) తహసీల్దార్లను ఆ జిల్లా యంత్రాంగం బదిలీ చేసింది. ఇదే విధానాన్ని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయడం ద్వారా కుర్చీలకు అతుక్కుపోయిన సిబ్బందిని తప్పించవచ్చని, తద్వారా అవినీతిని కొంతమేరనైనా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీచేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నందున.. స్థానచలనం చేయాల్సిన అధికారుల జాబితాను రెవెన్యూశాఖ తయారు చేస్తోంది. కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడంలో జాప్యం జరుగుతుండడంతో ఆలోపే ఉద్యోగుల బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని యోచిస్తోంది.

**సమాచార సేకరణ!**

దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల డేటాబేస్‌ను ఇటీవల సీసీఎల్‌ఏ కార్యాలయం సేకరించింది. ఈ మేరకు నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలను రాబట్టింది. సర్వీసులో చేరిన తర్వాత ఏయే చోట్ల, ఏయే పోస్టుల్లో ఎన్నాళ్లు పనిచేశారు? సొంత జిల్లా ఏదీ? తదితర సమాచారాన్ని సేకరించింది. దిగువస్థాయి సిబ్బంది మొదలు.. తహసీల్దార్ వరకు ఈ వివరాలను పంపాలని కోరింది. జూనియర్ అసిస్టెంట్/టైపిస్ట్, సీనియర్ అసిస్టెంట్, డీటీ/పీడీటీ, తహసీల్దార్ల సమాచారాన్ని సేకరించింది. ఈ వివరాలకు అనుగుణంగా బదిలీల క్రతువును పూర్తి చేయాలనే యోచనలో ఉంది. ఒకే జిల్లాలో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నారనే లెక్క ఆధారంగా బదిలీలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ డేటాను ముఖ్యమంత్రి కార్యాలయానికి రెవెన్యూ శాఖ నివేదించినట్లు తెలిసింది. అయితే, ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో తహసీల్దార్లు మినహా మిగతా స్టాఫ్‌ను జిల్లా యంత్రాంగం బదిలీ చేసింది. దీంతో ఇదే విధానాన్ని ఇతర జిల్లాల్లో అమలు చేయాలని రెవెన్యూశాఖకు సీఎంవో మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్నతస్థాయి అధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

**తహసీల్దార్లను కూడా..**

తహసీల్దార్ల బదిలీకి కూడా రంగం సిద్ధమైంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సొంత జిల్లాలో పనిచేస్తున్న, మూడేళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని ఈసీ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం స్థానచలనం కలిగించింది. తాజాగా ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాత జిల్లాలకు పంపాలని తహసీల్దార్లు సచివాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. 466 మంది తహసీల్దార్ల బదిలీలకు ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. అదే క్రమంలో పూర్వపు జిల్లాలకు కేటాయించిన అనంతరం.. పాత పోస్టింగ్‌లు ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం సూచనలు జారీ చేయనుందని సమాచారం. అలాగే ఇతర తహసీల్దార్లను జోనల్ పరిధిలో ఏ జిల్లాకైనా పంపడంలో ఉద్యోగ సంఘాల ఒత్తిడికి తలొగ్గవద్దని సీఎం పేషీ సంకేతాలిచ్చినట్లు సమాచారం. కాగా, వచ్చే నెలలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్న నేపథ్యంలో సత్వరమే బదిలీలు జరగాల్సివుంది. ఎన్నికల ప్రక్రియను పరిగణనలోకి తీసుకుంటే మాత్రం రెవెన్యూ అధికారుల బదిలీల్లో మరికొంత ఆలస్యం జరిగే అవకాశముంది.

**ఇదండీ సంగతి**



మన కట్టడాలు కూల్చడం
ఇక ఎవరివల్ల కాద్సార్!
అన్నీ గ్రాఫిక్సేగా!!

## కొత్త జిల్లాల వారీగా టీచర్ల పదోన్నతులు

### కోర్టు అనుమతిస్తేనే పాత 10 జిల్లాల ప్రకారం..

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో కొత్త జిల్లాల వారీగా ముందుకుసాగాలని విద్యాశాఖ నిర్ణయించింది. పాత పది జిల్లాల ప్రకారం గతంలో బదిలీలు చేపట్టగా, పదోన్నతులు మాత్రం కొత్త జిల్లాల వారీగా చేపట్టాలని కోర్టు తీర్పునిచ్చింది. ప్రస్తుతం దాని ప్రకారమే ముందుకు సాగాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఉపాధ్యాయులు పాత పది జిల్లాల ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరుతున్న నేపథ్యంలో మరోసారి కోర్టు దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని విద్యాశాఖ యోచిస్తోంది. కోర్టు అనుమతిస్తే పాత పది జిల్లాల ప్రకారం.. లేకుంటే పాత తీర్పు మేరకు కొత్త జిల్లాల ప్రకారం బదిలీలు జరగనున్నాయి. మరోవైపు 33 జిల్లాలకు కేంద్రం ఆమోదం లభించాల్సి ఉంది. అది వచ్చే నాటికి కొత్త జిల్లాల ప్రకారం, వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా పోస్టులను విభజించేలా మార్గదర్శకాలు సిద్ధం చేసుకొని ఉండాలని విద్యాశాఖ నిర్ణయించింది. కేంద్ర అనుమతి రాగానే పదోన్నతులను చేపట్టనుంది.

## బీసీ బిల్లును ఆమోదించాలి: ఆర్.కృష్ణయ్య



**సాక్షి, న్యూఢిల్లీ:** బీసీలకు చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబర్ బిల్లును అన్ని పార్టీలు ఆమోదించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, ఉద్యోగులకు ప్రమోషన్లలో, ప్రైవేటు రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన బీసీ బిల్లును ఆమోదించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీసీల గురించి మాట్లాడే పార్టీలు ఈ బిల్లుకు మద్దతిచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. ధర్నాలో సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, బి. సురేశ్, నీరడి భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 13, 14 తేదీల్లో దీక్ష: రవీంద్ర నాయక్

**హైదరాబాద్:** తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అనుకుంటే కులాలు, తెగల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి, తెలంగాణ లంబాడీ గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి ధరావత్ రవీంద్ర నాయక్ ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వార్థపరుల కుట్రలకు బలవుతోన్న లంబాడీ జాతిని కాపాడుకునేందుకు జూలై 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తన దీక్షకు మద్దతుగా ప్రతి తండా, గ్రామపంచాయతీల్లో రెండు రోజులపాటు దీక్ష నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూలై 27 నుంచి 15 రోజుల పాటు తెలంగాణ లంబాడీ గిరిజన 'చైతన్య రథయాత్ర'నిర్వహించనున్నట్లు తెలిపారు. చైతన్య రథయాత్ర జూలై 27న మధ్యాహ్నం 2 గంటలకు హుజూర్‌నగర్ జాన్‌పాడ్ దర్గా నుంచి జగదాంబ దుర్గా తండ, పరిమండల్, మామిడ మండలం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా వరకు కొనసాగుతుందని చెప్పారు.

## న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడిగా జస్టిస్ సంజయ్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీవో (29) జారీ చేసింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి తర్వాత రెండో స్థానంలో ఉండే సీనియర్‌ను ఈ పదవిలో నియమిస్తారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న జస్టిస్ వి.రామసుబ్రమణియన్ పదోన్నతిపై హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది.

## తానా ఉత్తమ నవలగా 'కొండపొలం'

**సాక్షి, హైదరాబాద్:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నిర్వహించిన 2019 నవలల పోటీలో ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రచించిన 'కొండపొలం'నవల రూ.2 లక్షల నగదు బహుమతికి ఎంపికైంది. ఈ మేరకు తానా అధ్యక్షుడు సతీశ్ వేమన, పోటీ కార్యనిర్వాహకుడు డాక్టర్ జంపాల చౌదరి, తానా ప్రచురణల కమిటీ అధ్యక్షుడు చంద్ర కన్నెగంటి ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 4 నుంచి 6 వరకు వాషింగ్టన్ డి.సి.లో నిర్వహించనున్న తానా 22వ మహాసభల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీకి మొత్తం 58 నవలలు వచ్చాయి. ప్రముఖ రచయితలు అంపశయ్య నవీన్, కాత్యాయనీ విద్మహే న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శశాంక్ గోయల్

## పేలుడు పదార్థాల పరిశ్రమల్లోని కార్మికుల భద్రతపై వర్క్‌షాప్

**సాక్షి, హైదరాబాద్:** పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమల్లో అనుసరించాల్సిన భద్రత విధానాలపై జాతీయ భద్రతా మండలి, తెలంగాణ ఫ్యాక్టరీల విభాగం సంయుక్తంగా ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించింది. హైదరాబాద్‌లోని (ఎఫ్‌టీసీసీఐ) సురానా ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పేలుడు పదార్థాలను తయారు చేసే కంపెనీలకు చెందిన 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల విభాగం ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్ మాట్లాడుతూ.. పేలుడు పదార్థాలు తయారు చేసే పరిశ్రమల్లో ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యమన్నారు. ఇందుకు అన్ని కంపెనీల యంత్రాంగాలు కొత్త సాంకేతికతతో కూడిన పద్ధతులు, భద్రతా విధానాలు అనుసరించాలని సూచించారు. పేలుడు పదార్థాలు తయారు చేసే కంపెనీల్లో ప్రమాదాలు ఎప్పుడైనా జరిగే అవకాశముందని.. ఇవి జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ రాజగోపాలరావు సూచించారు. కార్యక్రమంలో భద్రతా నిపుణుడు విద్యాసాగర్, ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్లు మోహన్‌బాబు, వీవీ శశికుమార్, గంగాధర్‌రెడ్డి, జాతీయ భద్రతా మండలి సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొత్త భవనాల అవసరం లేదు: కోదండరాం



**సాక్షి, హైదరాబాద్:** కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొత్త భవనాలు కట్టాల్సిన అవసరం లేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. అనువైన భవనాలున్నప్పటికీ వాటిని కూల్చివేసి కొత్తగా భవనాలు కట్టాల్సిన పనిలేదన్నారు. ఆ డబ్బును సంక్షేమ వసతి గృహాలు, వైద్యశాలల ఏర్పాటుకు వినియోగిస్తే బాగుంటుందని అన్నారు. బుధవారం నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాల కోసం రూ.1,800 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్పిన ప్రభుత్వం.. కనీసం రూ.400 కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఎద్దేవా చేశారు. కానీ నాణ్యతతో ఉన్న సచివాలయం భవనాన్ని మాత్రం అనవసరంగా కూల్చి వేస్తున్నారని అన్నారు. కృష్ణా నది మీద భారం తగ్గించేలా ప్రాజెక్టులు కట్టాల్సిన అవసరం ఉందని, దీంతో హడావుడిగా నదుల అనుసంధానం చేయొద్దన్నారు. నదుల అనుసంధానం పేరుతో విభజన సమస్యలు పక్కన పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తికాకపోవడంతో పలువురు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూలై 13న పార్టీ ప్లీనరీని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిరాయింపులతో రాజకీయాలు భ్రష్టు పట్టాయని, ఎవరి అవసరాల కోసం వారు పార్టీ మారుతున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రైవేటు వైద్యవిద్యలోనూ ఈడబ్ల్యూఎస్

- 10% కోటా అమలు చేయాల్సిందేనంటూ ఎంసీఐ ఉత్తర్వులు
- ప్రైవేటు కాలేజీలు 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశం
- ఆలిండియా కోటా కోసం 15% సీట్లు కేటాయించాలని షరతు
- కన్వీనర్ కోటా రిజర్వేషన్లతో యాజమాన్యాలకు లాభం నామమాత్రమే
- దీంతో ఎన్ని కాలేజీలు ముందుకొస్తాయోనని అనుమానాలు
- అయితే.. ఇది యాజమాన్యాలకు లాభమేనంటున్న వైద్య ఆరోగ్యశాఖ
- పెరిగే మెడికల్ పీజీ సీట్లతో కాలేజీలకు ప్రయోజనమని వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** అగ్రవర్ణ పేద (ఈడబ్ల్యూఎస్) విద్యార్థులకు శుభవార్త. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ కోటా ప్రకారం 10% రిజర్వేషన్లు అమలు చేయాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు బుధవారం లేఖ రాసింది. దీనికోసం ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పంపించాలని ఆదేశించింది. అయితే నీట్ ర్యాంకుల ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 15% సీట్లను ఆలిండియా కోటాలో కేంద్రం భర్తీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రైవేటు మెడికల్ కాలేజీలు కూడా తమ కన్వీనర్ కోటాలోని ఎంబీబీఎస్ సీట్లలో 15% ఆలిండియా కోటాకు ఇవ్వాలని, అప్పుడే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. ఇదిలావుండగా తెలంగాణలోని కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈడబ్ల్యూఎస్ కోటా ప్రకారం 10% రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించుకుని ఈ మేరకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గతంలోనే ఎంసీఐకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే అప్పట్లో దీనిపై ఎంసీఐ నిర్ణయం తీసుకోలేదు. దీంతో తాజాగా మరోసారి ఆయా ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు ఇతర ప్రైవేటు మెడికల్ కాలేజీలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



**ఈ కోటాలో పెరగనున్న 281 సీట్లు**

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2019–20 విద్యాసంవత్సరానికి మొత్తంగా 4,600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈఎస్ఐ మెడికల్ కాలేజీతో కలిపి 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,500 ఎంబీబీఎస్ సీట్లు, 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3,100 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అందులో 6 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఇటీవల ఎంసీఐ అదనంగా 190 ఎంబీబీఎస్ సీట్లను పెంచింది. ఇక 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4 మైనారిటీ కాలేజీలకు, 2 కొత్త మెడికల్ కాలేజీలకు ఈ కోటా వర్తించదని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. అంటే అవి పోగా 15 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మొత్తం 2,250 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అందులో సగం అంటే 1125 కన్వీనర్ కోటా సీట్లున్నాయి. వాటిని ఆధారం చేసుకొని 25% సీట్లను ఈడబ్ల్యూఎస్ కోటా కింద పెంచాల్సి ఉంటుంది. అంటే 281 ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశముంది. అయితే వీటికోసం ఎన్ని కాలేజీలు దరఖాస్తు చేసుకుంటాయో వేచి చూడాల్సిందే. అయితే ఇప్పటికే కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కన్వీనర్ కోటా సీట్లకు నోటిఫికేషన్ జారీచేసింది. ఆ సీట్లకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 28వ తేదీన ముగుస్తుంది. కాబట్టి ఈడబ్ల్యూఎస్ కోటా అమలు ఎలాగన్నదానిపై చర్చ జరుగుతోంది. అయితే ఇప్పటికే 11 వేల మంది విద్యార్థులు కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఉన్న వారు సహజంగానే ప్రైవేటులో వచ్చే ఈ కోటా సీట్లకు అర్హులేనని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి స్పష్టంచేశారు. నోటిఫికేషన్లలోనూ ఆ మేరకు వెసులుబాటుందన్నారు.

### ముందుకొచ్చే కాలేజీలెన్ని?

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకోసం అసలు ఎన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలు ముందుకు వస్తాయన్నదే అసలైన ప్రశ్న. ఒక వైపు ఆలిండియా కోటాకు 15% సీట్లు ఇవ్వాలన్న షరతు, పైపెచ్చు కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లకు ప్రైవేటు మెడికల్ కాలేజీలో ఫీజు ఏడాదికి రూ.60వేలు మాత్రమే కావడంతో తమకేంలాభమన్న వాదన ప్రైవేటు యాజమాన్యాల్లో వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఒక కాలేజీకి ఈడబ్ల్యూఎస్ కోటా కింద 25 సీట్లు పెరిగితే వచ్చే ఫీజు ఏడాదికి రూ.15 లక్షలు మాత్రమే. అందుకోసం సీట్లు పెంచుకుని లాభమేంటని వారంటున్నారు. అయితే అదనంగా సీట్లు పెరగడం వల్ల అదే స్థాయిలో పీజీ మెడికల్ సీట్లు కూడా పెరుగుతాయని, కాబట్టి అది ఆయా యాజమాన్యాలకు ప్రయోజనకరంగా ఉంటుందని వైద్యాధికారులంటున్నారు. ఈ రెండు అంశాలను బేరీజు వేసుకొని ప్రైవేటు మెడికల్ కాలేజీలు ముందుకు వెళ్లే అవకాశముందని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

## 1,036 'వైద్య' పోస్టుల భర్తీకి ఓకే

- 132 అసిస్టెంట్ ప్రొఫెసర్, 904 పారా మెడికల్ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు
- నల్లగొండ, సూర్యాపేట వైద్య కళాశాలల్లో నియామకాలకు అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో 1,036 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. 132 అసిస్టెంట్ ప్రొఫెసర్, 904 పారా మెడికల్ పోస్టుల భర్తీకి అనుమతిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 656 స్టాఫ్ నర్సు పోస్టులున్నాయి. డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ ద్వారా ఈ నియామకాలు జరపాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు.. వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖకు సూచించారు. ఈ పోస్టుల భర్తీ కోసం డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లగొండ, సూర్యాపేట వైద్య కళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి.

### వైద్య కళాశాలలకు మంజూరైన పోస్టులు

| కేటగిరీ | సూర్యాపేట కళాశాల | నల్లగొండ కళాశాల |
|---|---|---|
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 66 | 66 |
| ల్యాబ్ టెక్నీషియన్ | 37 | 37 |
| స్టోర్ కీపర్ కమ్ క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ | 22 | 22 |
| ఈసీజీ టెక్నీషియన్ | 1 | 1 |
| చైల్డ్ సైకాలజిస్ట్ | 1 | 1 |
| ఫిజియోథెరపిస్ట్(జోనల్) | 1 | 1 |
| ఆడియోమెట్రీ టెక్నీషియన్ | 1 | 1 |
| స్పీచ్ థెరపిస్ట్ | 1 | 1 |
| రెఫ్రాక్షనిస్టు/ఆప్టిషియన్ | 1 | 1 |
| రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ | 8 | 8 |
| అనస్థీషియా టెక్నీషియన్ | 6 | 6 |
| డెంటల్ టెక్నీషియన్ | 4 | 4 |
| లైబ్రేరియన్ | 1 | 1 |
| ఆడియో విజువల్ టెక్నీషియన్ | 3 | 3 |
| ఫొటోగ్రాఫర్ | 1 | 1 |
| స్టాఫ్‌నర్స్(జోనల్) | 328 | 328 |
| బయో మెడికల్ ఇంజనీర్ | 1 | 1 |
| బయో మెడికల్ టెక్నీషియన్ | 1 | 1 |
| ఫార్మాసిస్ట్ | 12 | 12 |
| జూనియర్ అసిస్టెంట్ | 21 | 21 |
| మొత్తం | 518 | 518 |

## 'మందమర్రి–చెన్నూరు రహదారి పనులు చేపట్టండి'

**సాక్షి, న్యూఢిల్లీ:** చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి 363 వద్ద మందమర్రి నుంచి చెన్నూరు (ఎన్‌హెచ్–63) వరకు కొత్త రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేత కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు రహదారి నిర్మాణం వల్ల చెన్నూరు, మందమర్రికి మధ్య 35 కి.మీ దూరాన్ని తగ్గించవచ్చని వివరించారు. దీంతో ఎన్‌హెచ్–363 నుంచి ఎన్‌హెచ్–63 మధ్య వాహనాల రద్దీ తగ్గి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సులభతరం అవుతుందన్నారు. డీపీఆర్ ప్రకారం రూ. 209 కోట్లు అవసరమైన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభించాల్సిందిగా కేంద్రమంత్రిని కోరారు. అనంతరం బాల్క మీడియాతో మాట్లాడుతూ.. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీలు నామా నాగేశ్వర రావు, బండ ప్రకాశ్ కూడా కేంద్ర మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

## టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో బదిలీలకు పచ్చజెండా

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) లో పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 30వ తేదీ వరకు ఒకే చోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఈ బదిలీ అవకాశం కల్పించింది. అన్ని కేడర్లలో 40 శాతం బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. బదిలీలకు అర్హత ఉన్న ఉద్యోగుల జాబితాను ఈనెల 29న డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## 17 వేల మంది పారిశుధ్య కార్మికులు..

- పంచాయతీల్లో నియామకానికి ప్రభుత్వం చర్యలు
- 'బహుళ ప్రయోజన పనివారు'గా పరిగణన

**సాక్షి, హైదరాబాద్:** పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రత చర్యలు చేపట్టడంలో భాగంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేయనుంది. గ్రామసీమల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోజువారీ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా త్వరలోనే 17 వేల పారిశుధ్య కార్మికుల నియామకానికి వీలుగా చర్యలు చేపట్టనుంది. పారిశుధ్య పనులతో పాటు గ్రామాల్లో పన్నుల వసూళ్లు, ఇతర విధులు కూడా అప్పగించనున్న నేపథ్యంలో వీరిని 'బహుళ ప్రయోజన పనివారు'గా పేరు మార్చనున్నారు. ఇప్పటికే పనిచేస్తున్న వారితో పాటు కొత్త వారికి నెలకు రూ.8,500 చొప్పున వేతనం ఇవ్వనున్నట్టు సమాచారం.

**విధివిధానాలను పరిశీలిస్తున్న ప్రభుత్వం..**

కొత్తవారి ఎంపికకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆయా అంశాలు సూచిస్తూ ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి చేరినట్టు సమాచారం. గ్రామాల్లో ప్రస్తుత అవసరాలను బట్టి 17 వేల మంది వరకు కార్మికులు అదనంగా అవసరమవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని మినహాయించి, ప్రతీ 500 మందికి ఒకరు చొప్పున పారిశుధ్య కార్మికులను నియమించాల్సి వస్తే ఈ మేరకు అవసరమవుతారని భావిస్తున్నారు.

# సాగు సగమే..!

### 20 లక్షలకుగాను 11 లక్షల ఎకరాల్లోనే ఖరీఫ్ సాగు

**సాక్షి, హైదరాబాద్:** దుక్కి దున్నిన రైతన్న ముఖంలో దుఃఖం ఆవరించింది.. వాన రాక కోసం ఆకాశంకేసి ఆశగా చూస్తున్నాడు... విత్తిన కొద్దిపాటి విత్తనాలు మొలకెత్తుతాయా లేదా అని దిగులు చెందుతున్నాడు... నైరుతి ఆలస్యమైంది... లోటు వర్షపాతం నమోదైంది... సాగుపై కష్టాల మబ్బులు కమ్ముకున్నాయి... సాధారణ సాగులో దాదాపు సగమే సాగైంది. వెరసి ఖరీఫ్ ఆరంభం రైతన్నకు రిలీఫ్ ఇవ్వడంలేదు... వర్షాలు సరైనంతగా కురవకపోవడంతో ఖరీఫ్ సాగు పెద్దగా ఊపందుకోలేదు. సాధారణంగా ఇప్పటికే 20 లక్షల ఎకరాలు దాటాల్సిన వివిధ పంటల సాగు, కేవలం 11 లక్షల ఎకరాలకే పరిమితమైంది. 9 లక్షల ఎకరాల వ్యత్యాసం ఉంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ బుధవారం ఖరీఫ్ సాగుపై తాజా నివేదిక విడుదల చేసింది. రాష్ట్రంలో ఈసారి సాధారణ సాగు అంచనా 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 11 లక్షల ఎకరాల్లో అంటే 10 శాతం సాగు నమోదైనట్లు పేర్కొంది. ఇందులో అత్యధికంగా పత్తి పంట 8.50 లక్షల ఎకరాల్లో సాగైంది. ఆ తరువాత మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.38 లక్షల ఎకరాలకుగాను 38,209 ఎకరా ల్లో, జొన్నలు 1.15 లక్షల ఎకరాలకుగాను 26,300 ఎకరాల్లో, వరి 23.83 లక్షలకుగాను 36,500 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ నివేదికలో పేర్కొంది.

**5 జిల్లాల్లో ఒక్క శాతమే సాగు**

కంది సాధారణ సాగు విస్తీర్ణం 7.21 లక్షల ఎకరాలు కాగా, 53 వేల ఎకరాల్లో వేశారు. మొత్తంగా ఆహార ధాన్యాల సాధారణ సాగు 47.70 లక్షల ఎకరాలుండగా, ఇప్పటివరకు కేవలం 1.67 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు నివేదికలో పేర్కొంది. నూనె గింజలసాగు 42 వేల ఎకరాలుగా ఉంది. ఇందులో సోయాబీన్ పరిస్థితి దారుణంగా ఉంది. వాస్తవానికి లక్ష ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా కేవలం 23 వేల ఎకరాల్లో మాత్రమే వేశారు. వర్షాలు ముఖం చాటేస్తుండటంతో మొలకెత్తుతాయా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 5%లోపే సాగు నమోదైంది. ఇందులో నిజామాబాద్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లో ఒక్క శాతమే సాగు కావడం గమనార్హం. జగిత్యాల జిల్లాలో సాగు ఇప్పటివరకు నమోదు కా లేదు. మెదక్, సంగారెడ్డి, వరంగల్ రూరల్, అర్బన్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జనగామ, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సాగు విస్తీర్ణం 10 శాతం దాటింది.

**20 జిల్లాల్లో లోటు వర్షపాతం...**

రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇందులో ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, అర్బన్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్ది పేట, జనగామ, యాదాద్రి, నల్లగొండ, సూ ర్యాపేట, ఖమ్మం జిల్లాలున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో తీవ్రలోటు వర్షపాతం ఉన్నట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది.

## గోదావరి, కృష్ణా అనుసంధానంపై కసరత్తు

### ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ అంశాలపై నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**సాక్షి, హైదరాబాద్:** గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు తరలించాలని భావిస్తున్న తెలుగు రాష్ట్రాల సీఎంల ఆలోచనల మేరకు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు కసరత్తును ముమ్మరం చేశారు. గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి నదుల్లో లభ్యతగా ఉండి వినియోగించుకోలేకపోతున్న నీటిని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తరలించే అంశంపై అధ్యయనం చేస్తున్నారు. ఈనెల 28న రాష్ట్ర సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల భేటీలో ప్రధానంగా గోదావరిలో లభ్యంగా ఉన్న జలాలను ఈ రెండు ప్రాజెక్టులకు తరలించే అంశంపైనే చర్చ జరగనున్న నేపథ్యంలో నీటి పారుదలశాఖ ఇంజనీర్లు అన్ని అంశాలతో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్, అంతర్‌రాష్ట్ర విభాగం సీఈ నరసింహారావు, ఇతర ఇంజనీర్లు బుధవారం ఈ అంశంపై చర్చలు జరిపారు. గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి నదుల్లో గత 40 ఏళ్లుగా ఉన్న నీటి లభ్యత, వాటిని ఇరు రాష్ట్రాలు వాడుకున్న తీరు, చేపట్టిన కొత్త, పాత ప్రాజెక్టులు వంటి అంశాలపై పరిశీలన చేశారు. ఇచ్చంపల్లి నుంచి సాగర్, అకినేపల్లి నుంచి సాగర్ నీటిని తరలించే ప్రతిపాదనతో పాటు ఇంద్రావతి దిగువన ఉన్న తుపాకులగూడెం నుంచి సాగర్‌కు నీటిని తరలించే అంశాలపై చర్చించారు. ఇటు పోలవరం వద్ద లభ్యతగా ఉండే గోదావరి నీటిని శ్రీశైలానికి ఎలా తరలించవచ్చుననే దానిపై పరిశీలించారు. ఇక ఉమ్మడి రాష్ట్ర హయాంలో చేపట్టిన దుమ్ముగూడెం–సాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టు డీపీఆర్‌ను సైతం అధ్యయనం చేసినట్లుగా సమాచారం.

# ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు..

- కేసీఆర్‌పై మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆరోపణలు
- సచివాలయానికి రారు.. ప్రజాసమస్యలను పట్టించుకోరు..
- తెలంగాణలో కుటుంబపాలనకు ఇక స్వస్తి
- 2023లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం
- ఆ దిశగా అన్ని చర్యలు చేపడుతున్నాం
- సభ్యత్వ నమోదులో తెలంగాణ, పశ్చిమబెంగాల్‌పై ప్రత్యేక దృష్టి

**సాక్షి, హైదరాబాద్:** 'నేను 15 ఏళ్లు సీఎంగా ఉన్నాను. సచివాలయానికి వెళ్లని ఇలాంటి ముఖ్యమంత్రిని ఇంతవరకూ చూడలేదు. ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదు'అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ సభ్యత్వ ప్రముఖ్ శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. వచ్చే నెల 6 నుంచి ప్రారంభం కానున్న ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేసేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. బుధవారం ఇక్కడి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పదాధికారుల సమావేశంలో మాట్లాడారు. అంతకంటే ముందు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సెక్రటేరియట్‌కే వెళ్లని సీఎంకు కొత్త సెక్రటేరియట్, కొత్త అసెంబ్లీ కావాలట అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ప్రజల సంక్షేమంపై దృష్టి ఉంటే ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. అంతా టీంగా పనిచేద్దామని ప్రధాని నరేంద్రమోదీ నీతి ఆయోగ్ సమావేశం పెడితే, ఎంతో ముఖ్యమైన ఆ భేటీకి సీఎం కేసీఆర్ హాజరుకాలేదన్నారు. తెలంగాణలో కుటుంబపాలనకు ప్రజలు స్వస్తి పలుకుతున్నారని, అందులో భాగంగానే నలుగురు బీజేపీ ఎంపీలను గెలిపించారన్నారు. తెలంగాణలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 7 శాతం ఓట్లు, ఒక సీటు వస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో 20 శాతం ఓట్లతో నాలుగుసీట్లు వచ్చాయన్నారు. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్'అనే మూలమంత్రంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

**అందరినీ కలిసి, అంతటా వ్యాపిస్తాం..**

'సభ్యత్వ నమోదులో అందరినీ కలవడం, అంతటా వ్యాపించడం'అనే నినాదంతో ముందుకు వెళతామని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రైతులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, అన్ని వర్గాల ప్రజల వద్దకు వెళతామన్నారు. పార్టీ సభ్యత్వం విషయంలో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌పై జాతీయ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. తెలంగాణలోని 32 వేల పోలింగ్ బూత్‌లలో ఏ ఒక్కదానిని వదలకుండా సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. జూలై 6వ తేదీన జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జన్మదినాన్ని పురస్కరించుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 11వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 8 వేల శక్తి కేంద్రాల్లో 8 వేల మంది విస్తారక్‌కులు వారం రోజులపాటు పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. సామాన్యుల నుంచి ఉన్నత స్థాయి వ్యక్తుల వరకు అందరినీ కలుస్తామని, పార్టీలో చేర్చుకుంటామని చెప్పారు. కులవాదం, కుటుంబవాదం, మతవాదం, అవినీతిపరులను ప్రజలు దేశవ్యాప్తంగా ఓడిస్తున్నారని, అభివృద్ధి వాదాన్నే గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు ఉత్తరప్రదేశ్ ఒక ఉదాహరణ అని, కుల సమీకరణవాదులైన ఎస్పీ, బీఎస్పీలను, అవినీతిపరులను ప్రజలు ఓడించారని, తెలంగాణలోనూ ఇదే జరిగి తీరుతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఆ పార్టీకి అధ్యక్షులు ఎవరో తెలియని పరిస్థితి వచ్చిందన్నారు. పడవ మునిగిపోతున్నపుడు కెప్టెన్ ధైర్యంగా ముందుకు తీసుకెళతారని, కాని కాంగ్రెస్ పడవ మునిగిపోతుందని తెలిసి కెప్టెన్ ముందే దూకేశారని ఎద్దేవా చేశారు.



శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్ష్మణ్, రాజాసింగ్, దత్తాత్రేయ

### ప్రభుత్వాలను పడగొట్టం

మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో తాము ఎక్కడా ప్రభుత్వాలను పడగొట్టబోమని శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వానికి మెజారిటీ లేదని, ఇండిపెండెంట్లు, ఇతరులను కలుపుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తెచ్చిన పథకాలను మధ్యప్రదేశ్‌లో ఎప్పుడో అమలు చేశారన్నారు. 2007లోనే లాడ్లీ లక్ష్మి యోజన, కన్యాదాన్ యోజన, జననీ సురక్ష, మేధావి ఛాత్ర్ యోజన వంటి పథకాలను చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఆయన గతంలో మధ్యప్రదేశ్ బీజేపీ ప్రధాన కార్య దర్శిగా, అధ్యక్షునిగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. జాతీయ పార్టీ జాతీయ సభ్యత్వ నమోదు ప్రముఖ్‌గా చౌహాన్ నియమితులైన తరువాత మొదట తెలంగాణకే వచ్చారంటే రాష్ట్రంపై జాతీయ పార్టీ ఎంత దృష్టి సారించిందో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ ధర్మారావు, సహ ప్రముఖ్ కాసం వెంకటేశ్వర్లు, పేరాల శేఖర్‌రావు, సుధాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మూక హత్య బాధాకరం

- జార్ఖండ్ ఘటనపై రాజ్యసభలో మోదీ
- ధన్యవాద తీర్మానంపై చర్చకు బదులిచ్చిన ప్రధాని



**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో ఇటీవల ఒక ముస్లిం యువకుడు మూక హత్యకు గురి కావడం తననెంతో బాధించిందని, దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రధాని మోదీ అన్నారు. జార్ఖండ్ అయినా, బెంగాల్ అయినా, కేరళ అయినా దేశంలో ఎక్కడ హింసాత్మక ఘటనలు జరిగినా అన్నింటినీ ఒకేలా చూడాలని, చట్టం తన పని తాను చేయాలని ఉద్ఘాటించారు. బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బదులిస్తూ జార్ఖండ్ ఘటనపై స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన జార్ఖండ్‌లో జరిగిన మూక హత్యపై మోదీ స్పందించడం లేదంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలకు ఆయన బదులిస్తూ దేశంలో ప్రతి పౌరుడికీ భద్రత కల్పించడం తమ రాజ్యాంగ విధి అన్నారు.రాజ్యసభ సభ్యులు కొందరు జార్ఖండ్ మూక హత్యల కేంద్రమని అనడాన్ని ప్రస్తావిస్తూ 'అలా ఒక రాష్ట్రాన్ని అవమానించడం సరైనదేనా అని ప్రధాని ప్రశ్నించారు. మోటారు సైకిలు దొంగిలించాడన్న ఆరోపణతో జార్ఖండ్‌లో ఇటీవల 24 ఏళ్ల ముస్లిం యువకుడిని కొందరు చావబాదడం, అతనిచేత బలవంతంగా జైశ్రీరాం నినాదాలు చేయించడం తెలిసిందే. బిహార్‌లో మెదడువాపు వ్యాధి లక్షణాలతో ఒకే నెలలో 130 మంది పిల్లలు చనిపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. స్వాతంత్య్రం వచ్చి ఎన్నో సంవత్సరాలయిన తర్వాత కూడా అలాంటి వ్యాధి ఇప్పటికీ ప్రజల్ని చంపుతుండటం ఏడు దశాబ్దాల పాలనలో ఘోర వైఫల్యమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ఓటమిని అంగీకరించలేకపోవడం, ఈవీఎంలను సందేహించడం ద్వారా ప్రజా తీర్పును కించపరచడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమన్నారు. 16వ లోక్‌సభ కాలం ముగియడానికి ముందు రాజ్యసభ ఆమోదం పొందని కారణంగా 22 బిల్లులు చెల్లకుండా పోయాయని మోదీ గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకుడు సర్దార్‌వల్లభ్‌భాయ్ పటేల్ మొదటి ప్రధాని అయి ఉంటే కశ్మీర్ సమస్య తలెత్తేదేకాదని తమ పార్టీ నమ్మకమన్నారు.

### ధన్యవాద తీర్మానం ఆమోదం

ప్రధాని ప్రసంగం తర్వాత సభ ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని లోక్‌సభ మంగళవారం ఆమోదించిన సంగతి తెలిసిందే.ఈ తీర్మానంపై ఉభయ సభల్లోనూ 13 గంటల పాటు చర్చ జరిగింది. వివిధ పార్టీలకు చెందిన 50 మంది చర్చలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఈ తీర్మానానికి 200 సవరణలు ప్రతిపాదించింది. అయితే, తర్వాత వాటిని ఉపసంహరించుకుంది.

# దేశ ప్రయోజనాలే ముఖ్యం

**అమెరికాకు స్పష్టం చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్**

- రష్యాతో చారిత్రక సంబంధాలను గుర్తించాలని సూచన
- ప్రధాని మోదీ, జైశంకర్‌తో సమావేశమైన అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో
- భారత రక్షణావసరాలు తీర్చేందుకు సిద్ధమని ప్రకటన

**న్యూఢిల్లీ:** రక్షణ, ఇంధనం, వాణిజ్యం, ఉగ్రవాదంపై పోరు సహా వేర్వేరు రంగాల్లో భారత్‌తో బలమైన ద్వైపాక్షిక సంబంధాలను కోరుకుంటున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత సమర్థతను ఆయన కొనియాడారు. ఇరాన్ మధ్యప్రాచ్యంలో ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందనీ, దీనిపై అమెరికా ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి భారత్‌కు చేరుకున్న పాంపియో ప్రధాని మోదీతో బుధవారం భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం భారత విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యారు.

### మాకోసం భారత్ చాలా చేసింది

పాంపియోతో భేటీ సందర్భంగా జైశంకర్ స్పందిస్తూ.. ఇతర దేశాలతో వ్యవహరించే విషయంలో తమకు భారత ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రష్యా నుంచి ఎస్‌–400 క్షిపణి వ్యవస్థల కొనుగోలు విషయంలో అమెరికా ఆందోళనలను కొట్టిపడేశారు. 'రష్యా నుంచి ఆయుధాలు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసే దేశాలపై అమెరికా కాంగ్రెస్ కాట్సా చట్టం (కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్ యాక్ట్) తెచ్చింది. దీని కారణంగా భారత్‌పై కూడా ప్రభావం పడుతోంది. భారత్‌కు రష్యా సహా పలుదేశాలతో చారిత్రక సంబంధాలు ఉన్నాయి. అమెరికా వీటిని గౌరవించాలి' అని సూచించారు. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలపై మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు స్థిరంగా ఉండాలన్నది తమ అభిప్రాయమని స్పష్టం చేశారు. వెంటనే పాంపియో స్పందిస్తూ..'మా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్, వెనిజులా నుంచి చమురు దిగుమతుల విషయంలో భారత్ వెనక్కుతగ్గింది. ఇది మామూలు విషయం కాదు. ఈ నేపథ్యంలో ఇండియాకు ఇంధన కొరత రాకుండా ఏమేం చేయాలో అన్నీ చేస్తున్నాం. ఇరాన్ మధ్యప్రాచ్యంలో ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకలపై ఇరానే దాడిచేసింది. ఈ విషయంలో అమెరికా తీవ్రంగా ఆందోళన చెందుతోంది. నిఘా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంలో, ఉగ్రవాద వ్యతిరేకపోరులో సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్‌–అమెరికాలు నిర్ణయించాయి' అని పేర్కొన్నారు.

### వాణిజ్యంపై ఏకాభిప్రాయం అవసరం

అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న సుంకాల యుద్ధంపై పాంపియో మాట్లాడారు. 'పరస్పర సుంకాలను విధించుకోవడంపై భారత్‌–అమెరికాలు ఓ అంగీకారానికి రాగలవు. కానీ మనం కూడా అవతలివారి కోణం నుంచి ఆలోచించినప్పుడు బంధాలు బలపడతాయి. భారత్ తన సమగ్రతను కాపాడుకునేందుకు అవసరమైన అత్యాధునిక ఆయుధాలను అందించేందుకు, రక్షణ అవసరాలను తీర్చేందుకు అమెరికా సిద్ధంగా ఉంది' అని తెలిపారు. వాణిజ్యం విషయంలో భారత్‌–అమెరికాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్న విషయాన్ని జైశంకర్ కూడా అంగీకరించారు. వాణిజ్య భాగస్వాములు అన్నాక పరిష్కరించుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయన్నారు.



భేటీ సందర్భంగా పాంపియోతో జైశంకర్ కరచాలనం

## మతస్వేచ్ఛ లేకుంటే వినాశనమే..

మతస్వేచ్ఛను కాలరాస్తే ప్రపంచం దారుణంగా తయారవుతుందని మైక్ పాంపియో హెచ్చరించారు. భారత్‌లో ఇటీవలికాలంలో మైనారిటీలపై హిందుత్వ మూకల దాడులు పెరిగిపోయిన విషయాన్ని పాంపియో పరోక్షంగా ప్రస్తావించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..'ప్రపంచంలోని నాలుగు ప్రధాన మతాలకు భారత్ పుట్టినిల్లు. కాబట్టి మతస్వేచ్ఛకు అందరం మరోసారి కంకణబద్ధులం అవుదాం. జైషే అధినేత మసూద్ అజర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ఐక్యరాజ్య సమితి గుర్తించడం పట్ల అమెరికా హర్షం వ్యక్తం చేస్తోంది. అమెరికా తీసుకుంటున్న కీలక నిర్ణయాలకు అంతర్జాతీయ వేదికలపై భారత్ మద్దతు పలుకుతోంది. దీన్ని మేం స్వాగతిస్తున్నాం. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత నౌకాయానానికి అమెరికా కట్టుబడి ఉంది' అని స్పష్టం చేశారు. మరోవైపు జపాన్‌లోని ఒసాకాలో జూన్28–29 తేదీల్లో జరిగే జీ–20 శిఖరాగ్ర సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ సమావేశమవుతారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు.

# ఐబీ చీఫ్‌గా అర్వింద్.. 'రా' చీఫ్‌గా గోయల్

**కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం**



సామంత్ గోయల్



అర్వింద్

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాడిక్కడ సమావేశమైన కేబినెట్ నియామకాల కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో నిఘా సమాచారాన్ని సేకరించే ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) నూతన అధిపతిగా ఐపీఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను నియమించింది. అలాగే విదేశాల నుంచి నిఘా సమాచారాన్ని సేకరించే రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) చీఫ్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సామంత్ కుమార్ గోయల్‌ను నియమించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అర్వింద్ కుమార్, గోయల్‌లు రాబోయే రెండేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఐబీ ప్రస్తుత చీఫ్ రాజీవ్ జైన్ పదవీకాలం జూన్ 30తో, 'రా' చీఫ్ అనిల్ కె.ధస్మానా పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది. వీరిద్దరి పదవీకాలం 2018, డిసెంబర్‌లోనే ముగిసినప్పటికీ సర్వీసును 6 నెలలు పొడిగించారు.

### కశ్మీర్ నిపుణుడు అర్వింద్..

ఇంటెలిజెన్స్ బ్యూరోలో రెండో అత్యంత సీనియర్ అధికారి అయిన అర్వింద్ కుమార్(59) 1984 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అస్సాం–మేఘాలయ కేడర్ అధికారి. 1991, ఆగస్టులో ఐబీలో చేరిన కుమార్, ప్రస్తుతం స్పెషల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రష్యా రాజధాని మాస్కోలోని భారత ఎంబసీలో ఆయన పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో వ్యవహారాలు, మావోయిస్టుల విషయంలో నిపుణుడిగా పేరు గడించారు. ఆయన అందించిన సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం 'ప్రెసిడెంట్ పోలీస్ మెడల్'ను బహూకరించింది.

### 'బాలాకోట్' సూత్రధారి గోయల్..

1984 బ్యాచ్, పంజాబ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సామంత్ కుమార్ గోయల్ ప్రస్తుతం 'రా'లో ప్రత్యేక కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. పుల్వామా ఉగ్రదాడి తర్వాత భారత్ బాలాకోట్‌లోని జైషే ఉగ్రస్థావరంపై చేసిన వైమానిక దాడుల వ్యూహ రచనలో గోయల్ కీలకంగా వ్యవహరించారు. అలాగే 2016, సెప్టెంబర్ 29న చేపట్టిన సర్జికల్ దాడుల పథకరచనలో ముఖ్యభూమిక పోషించారు. నిఘా విషయంలో విశేషానుభవం ఉన్న గోయల్ తన కెరీర్‌లో ఎక్కువగా పంజాబ్‌లోనే పనిచేశారు. 1990ల్లో పంజాబ్‌లో తీవ్రవాదాన్ని నియంత్రించడంతో గోయల్ కీలకంగా వ్యవహరించారు. 2001లో ఆయన 'రా'లో చేరారు. ఆయన అందించిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం పోలీస్ మెడల్(గ్యాలెంట్రీ), పోలీస్ మెడల్(మెరిటోరియస్)లను ప్రకటించింది. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాల ముడుపుల వ్యవహారం కేసులో సుప్రీంకోర్టుకు సీబీఐ సమర్పించిన అఫిడవిట్‌లో గోయల్ పేరు కనిపించింది.

# ఏపీ ప్రజలకు మోదీ ద్రోహం

**ప్రత్యేకహోదాపై వైఎస్సార్‌సీపీ కృతనిశ్చయంతో పోరాడుతుంది: కాంగ్రెస్**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్(ఏపీ)కి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం ద్వారా ప్రధాని మోదీ ఏపీ ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఏపీలో కొత్తగా ఏర్పడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకహోదాపై కృతనిశ్చయంతో పోరాడుతుందన్న నమ్మకం తనకు ఉందని కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా అన్నారు. ఉమ్మడి ఏపీకి చెందిన మాజీ ప్రధాని పీవీ దేశానికి చేసిన సేవలకు గుర్తుగా ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనీ, ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అదేనని సుర్జేవాలా అన్నారు. గత ప్రధాని మన్మోహన్ రాజ్యసభలో ఇచ్చిన ఆ హామీని అమలు చేయకపోవడం ద్వారా రాజ్యాంగ విధానాలను మోదీ తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటన చేసే ముందు జైట్లీసహా ఇతర బీజేపీ సీనియర్ నేతలతో చర్చిస్తే వారు సమ్మతించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చే విషయం అసలు పరిశీలనలోనే లేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులోనే చెప్పడాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఇది కోట్లాదిమంది ఏపీ ప్రజలకు బీజేపీ చేసిన సిగ్గుమాలిన నమ్మక ద్రోహమేనని సుర్జేవాలా అన్నారు. మోదీ తమ మాట నిలబెట్టుకుంటారని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు వేచిచూస్తున్నారనీ, మాట నిలుపుకోవాల్సిన సమయం ఇప్పుడు వచ్చిందని సుర్జేవాలా పేర్కొన్నారు.

# అధికారిని బ్యాట్‌తో కొట్టిన ఎమ్మెల్యే

**మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యే అరెస్ట్**



**ఇండోర్:** ఓ ఇంటిని కూల్చడానికి వచ్చిన ప్రభుత్వోద్యోగిపై బీజేపీ సీనియర్ నాయకుడు కైలాశ్ వర్గియా కుమారుడు, ఎమ్మెల్యే విజయ్‌వర్గియా క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశాడు. ఓ ఇంటిని కూల్చడానికి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులను వెనక్కు వెళ్లిపోవాలంటూ స్థానిక ప్రజలు నిరసన చేపట్టారు. ఈ నిరసనలో భాగస్తుడైన విజయ్ బ్యాట్‌తో ప్రభుత్వోద్యోగిపై దాడి చేశాడు. బీజేపీ తమకు మొదట అభ్యర్థించాలని, తర్వాత దాడి చేయాలన్న సిద్ధాంతాన్ని నేర్పిందని విజయ్ తన చర్యను సమర్థించుకున్నారు. ఈ స్థలంపై అధికార పార్టీ నేతల కన్ను పడినందునే ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి నీలభ్ శుక్లా మాట్లాడుతూ చట్టాలు చేయాల్సిన వ్యక్తే చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డారని అన్నారు. ఈ సంఘటన బీజేపీ నిజ స్వరూపాన్ని చూపిస్తుందని అన్నారు. కాగా, అధికారిపై దాడిచేయడంతో పోలీసులు విజయ్‌ను బుధవారం అరెస్ట్‌చేశారు. ఆ తర్వాత తనకు బెయిల్ కావాలంటూ విజయ్ పెట్టుకున్న దరఖాస్తును స్థానిక కోర్టు బుధవారం తిరస్కరించింది. దీంతో సాయంత్రం సమయంలో అతన్ని జైలుకు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఉద్యోగులపై కుమార స్వామి ఫైర్



సీఎంతో నిరసనకారుల వాగ్వాదం

**బెంగళూరు/రాయచూరు రూరల్:** తమ ఫిర్యాదులను ఇచ్చేందుకు రాయ్‌చూర్ జిల్లా యెర్మారస్ థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ఉద్యోగులు సీఎం హెచ్‌డీ కుమారస్వామి వెళ్తున్న కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగుల తీరుపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'గ్రామ వాస్తవ్య'కార్యక్రమంలో భాగంగా కుమారస్వామి రాయ్‌చూర్‌కి వెళ్లారు. 'మీరు నరేంద్ర మోదీకి ఓటు వేశారు. కానీ మీ పనులను నేను చేయాలనుకుంటున్నారు. నేను మీకు గౌరవం ఇవ్వాలని కోరుకుంటున్నారు. మీపై లాఠీ చార్జ్ చేయాలా? ఇక్కడి నుంచి వెళ్లిపోండి'అని వైటీపీఎస్ ఉద్యోగులపై కుమార స్వామి గట్టిగా అరిచారు. దీంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అనంతరం కుమార స్వామి ఓ టీవీ చానల్‌లో మాట్లాడుతూ 'ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి 15 రోజుల సమయం కావాలని కోరాను. అయినప్పటికీ వారు నేను వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో నేను సహనం కోల్పోయాను'అని తెలిపారు. ఒక వేళ ప్రధాన మంత్రి కాన్వాయ్‌ను ఎవరైనా అడ్డుకుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. 'మా ప్రభుత్వం సహనంతో ఉంది. కానీ అసమర్థమైంది మాత్రం కాదు. పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు'అని పేర్కొన్నారు. గ్రామ వాస్తవ్య కార్యక్రమంలో భాగంగా సీఎం రాయ్‌చూర్ జిల్లా కరేగుడ్డలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రాత్రి గడపనున్నారు.



చెన్నైలో తీవ్రమైన నీటికొరతతో ఇబ్బందిపడుతున్న ఓ మహిళ బుధవారం ప్లాస్టిక్ బిందెలతో వాటర్‌ట్యాంకర్ దగ్గరకు పరుగెడుతున్న దృశ్యం

## వర్షమే చెన్నైని కాపాడాలి: డికాప్రియో

**లాస్ ఏంజెలిస్:** తమిళనాడు రాజధాని చెన్నైలో నీటి సంక్షోభం గురించి హాలీవుడ్ ప్రముఖ నటుడు లియోనార్డో డికాప్రియో ఆవేదన వ్యక్తం చేశారు. 'చెన్నై సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. చెన్నైకునీరందించే రిజర్వాయర్లలో నీళ్లు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వ ట్యాంకుల నుంచి నీటిని పట్టుకునేందుకు నగరవాసులు గంటల తరబడి వరుసల్లో నిలబడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి చెన్నైను వర్షమే కాపాడగలదు' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌పెట్టారు.

# ఎన్‌ఆర్‌సీ నుంచి మరో లక్ష తీసివేత



**గువాహటి:** అస్సాంలో జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) ముసాయిదా నుంచి మరో లక్ష మంది పేర్లను బుధవారం తొలగించారు. వివిధ కారణాల చేత వారందరూ భారత పౌరసత్వం పొందేందుకు అనర్హులని వారి వివరాల తనిఖీల సమయంలో గుర్తించామని ఎన్‌ఆర్‌సీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఆర్‌సీలో తమ పేర్లను చేర్చాలంటూ అస్సాంలో మొత్తం 3.29 కోట్ల మంది దరఖాస్తు చేసుకోగా, గతంలోనే 40 లక్షల మందిని అనర్హులుగా గుర్తించి వారి పేర్లను ఎన్‌ఆర్‌సీ ముసాయిదా నుంచి తొలగించారు. తాజాగా మరో లక్ష మంది పేర్లను కూడా తీసేయడంతో ఎన్‌ఆర్‌సీ ముసాయిదా నుంచి తొలగింపునకు గురైన వారి సంఖ్య 41 లక్షలకు చేరింది. జూలై 21న ఎన్‌ఆర్‌సీ తుది జాబితా విడుదల కానుంది. తాజాగా మొత్తం 1,02,462 మందిని ఎన్‌ఆర్‌సీ నుంచి తొలగించామనీ, వారి పేర్లు తదితర వివరాలను ఎన్‌ఆర్‌సీ వెబ్‌సైట్‌లో ఉంచామని కో–ఆర్డినేటర్ చెప్పారు. ఉత్తరాల ద్వారా కూడా వారం దరికీ ఈ వివరాలు తెలియజేస్తామనీ, అలాగే ఎన్‌ఆర్‌సీ సేవా కేంద్రాలు, ఉప కమిషనర్లు, సబ్–డివిజనల్ అధికారులు, సర్కిల్ అధికారుల కార్యాలయాల వద్ద కూడా తొలగింపునకు గురైన వారి జాబితాను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. వీరంతా తమ అభ్యంతరాలను తెలియజేస్తే జూలై 5 నుంచి వాటిపై విచారణ జరగనుంది.

# భారత 'తాత్కాలిక' అభ్యర్థిత్వానికి మద్దతు

- ఐరాస భద్రతామండలిలో సభ్యత్వం కోసం వచ్చే ఏడాది ఎన్నికలు
- పోటీ చేయనున్న ఇండియా.. ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన 55 దేశాలు

**ఐక్యరాజ్యసమితి:** ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతామండలిలో తాత్కాలిక సభ్యదేశాలను ఎంపిక చేసేందుకు నిర్వహించే ఎన్నికల్లో ఇండియా అభ్యర్థిత్వానికి 55 దేశాలతో కూడిన ఆసియా–పసిఫిక్ బృందం ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. చైనా, పాకిస్తాన్‌లు కూడా ఈ ఆసియా–పసిఫిక్ దేశాల బృందంలో ఉండటం గమనార్హం. భద్రతా మండలిలో ఐదు దేశాలకు శాశ్వత సభ్యత్వం ఉండగా, మరో పది దేశాలకు తాత్కాలిక సభ్యత్వం కల్పిస్తారు. ఎన్నికలను నిర్వహించడం ద్వారా ఆ పది తాత్కాలిక సభ్య దేశాలను ఎన్నుకుంటారు. ప్రతి ఏడాదీ ఎన్నిక నిర్వహించి ఐదు దేశాలను ఎంపిక చేస్తారు. ఒకసారి ఎన్నికైతే ఆ దేశాలకు రెండేళ్లపాటు భద్రతామండలిలో తాత్కాలిక సభ్యత్వం లభిస్తుంది. 2021–22 సంవత్సరాలకుగాను తాత్కాలిక సభ్యత్వం పొందే దేశాలను ఎంపిక చేసేందుకు వచ్చే ఏడాది జూన్‌లో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లోనే ఇండియా పోటీ చేయనుండగా, భారత అభ్యర్థిత్వాన్ని ఆసియా–పసిఫిక్ బృందంలోని మొత్తం దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి.



ఈ విషయాన్ని ఐరాసలో భారత శాశ్వత రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ మంగళవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. భారత అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన దేశాల్లో చైనా, పాకిస్తాన్, నేపాల్, జపాన్, ఇరాన్, టర్కీ, మలేసియా, ఇండోనేసియా, శ్రీలంక, సిరియా, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, యూఏఈ, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, వియత్నాం, మాల్దీవులు, మయన్మార్, కిర్గిజ్‌స్తాన్ తదితర దేశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇక ఇప్పటికే భారత్ ఏడుసార్లు ఐరాస భద్రతామండలిలో తాత్కాలిక సభ్యదేశంగా ఉంది. చివరిసారిగా 2011–12 సంవత్సరాల్లో భద్రతామండలిలో ఇండియా తాత్కాలిక సభ్యదేశ హోదాను పొందింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో విజయం సాధిస్తే పదేళ్ల తర్వాత మళ్లీ ఆ హోదా దక్కనుంది. భద్రతామండలిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యాలకు శాశ్వత సభ్యత్వం ఉండటం తెలిసిందే. 21వ శతాబ్దపు రాజకీయ, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఇండియాకు కూడా శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది.

## నా నిర్ణయం మార్చుకునే ప్రసక్తే లేదు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుణ్ని తానుకాననీ, ఈ నిర్ణయాన్ని తాను మార్చుకునే ప్రసక్తే లేదని రాహుల్ గాంధీ బుధవారం పునరుద్ఘాటించారు. లోక్‌సభలో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు రాహుల్ సహా ఆ పార్టీ లోక్‌సభ ఎంపీలు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. అయితే భేటీ ప్రారంభంలోనే తమిళనాడు నుంచి వచ్చిన ఎంపీలు రాహుల్‌ను నిర్ణయం మార్చుకోవాల్సిందిగా కోరారు.తాను కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉండబోయేది లేదని రాహుల్ వారికి స్పష్టం చేశారు.

## పాత ఫోన్లకు వాట్సాప్ నిలిపివేత

**శాన్‌ఫ్రాన్సిస్కో:** మెసేజింగ్ దిగ్గజం వాట్సాప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆండ్రాయిడ్ 2.3.7 ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్)తో పాటు ఐఓఎస్ 7 వాడే ఐఫోన్లకు 2020, ఫిబ్రవరి 1 నుంచి వాట్సాప్ సేవలు నిలిచిపోతాయని కంపెనీ తెలిపింది. దీనివల్ల పాత ఓఎస్‌లు ఉన్న మొబైల్ ఫోన్లలో కొత్త అకౌంట్లను తెరవలేరనీ, పాత అకౌంట్లను యాక్సెస్ చేయలేరని వెల్లడించింది. '2019, డిసెంబర్ 31 తర్వాత విండోస్ ఓఎస్ ఉన్న యూజర్లు వాట్సాప్‌ను వాడలేరు. ఈ ఏడాది జూలై 1 నుంచి మైక్రోసాఫ్ట్ స్టోర్‌లో వాట్సాప్ అందుబాటులో ఉండదు' అని పేర్కొంది.

## టీమిండియా కాషాయ జెర్సీ వెనుక బీజేపీ?

**న్యూఢిల్లీ/ముంబై:** వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్‌తో జరగనున్న మ్యాచ్‌లో టీమిండియా ఆరెంజ్ (కాషాయ) రంగు జెర్సీలను ధరించనుంది. అయితే టీమిండియా ఆరెంజ్ జెర్సీ ధరించడం వెనుక మోదీ ప్రభుత్వ ఒత్తిడి ఉందని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆరోపించాయి. ఆదివారం టీమిండియా ఇంగ్లాండ్‌తో తలపడనున్న మ్యాచ్‌లో ఆరెంజ్ జెర్సీలను ధరించనుంది. కనీసం రెండు రంగుల జెర్సీలను తమ వెంట తెచ్చుకోవాలని ఐసీసీ అన్ని దేశాలను కోరింది. అందులో భాగంగానే టీమిండియా రెండు జెర్సీలతో ఇంగ్లండ్ వెళ్లింది. మాత్రం ఆటలకు, రాజకీయాలకు ముడి పెట్టడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ అన్నారు.

## ఎంపీలకు విప్ జారీచేసిన బీజేపీ

**న్యూఢిల్లీ:** లోక్‌సభ సమావేశాల నేపథ్యంలో శుక్రవారం, సోమవారం సభకు తప్పనిసరిగా హాజరుకావాలని తమ ఎంపీలకు బీజేపీ మూడు లైన్ల విప్ జారీచేసింది. కేంద్ర ప్రభుత్వం పలు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలోనే ఈ విప్ జారీచేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పార్టీ నియమనిబంధనలు, ఆదేశాలకనుగుణంగా ఓటేయాలని కోరుతూ మూడు లైన్ల విప్‌ను జారీచేస్తారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 542 లోక్‌సభ స్థానాలకుగానూ బీజేపీ 303 సీట్లు గెలుచుకుంది.

# గజేంద్రుడి రైలు యాత్ర!



**కష్టం మనది కాకపోతే ముంబైదాకా దేక్కుంటూ వెళ్లమని సలహా ఇచ్చాడట వెనుకటికి ఎవరో! అహ్మదాబాద్‌లోని ఓ గుడి నిర్వాహకుల నిర్వాకం ఇదే తీరును తలపిస్తోంది. గుడిలో ఊరేగింపు కోసం వీళ్లు 4 ఏనుగులను తెప్పిస్తున్నారు! ఏనుగు అంబారీపై దేవుడి ఊరేగింపు! బాగానే ఉంది కదా అంటున్నారా? ఎక్కడి నుంచో తెలిస్తే మాత్రం ముక్కున వేలేసుకుంటారు! దేశానికి తూర్పు కొసన ఉండే అస్సాం నుంచి!!**

జూలై 4న అహ్మదాబాద్‌లో జగన్నాథ రథ యాత్ర జరగనుంది. కానీ.. ఈ గుడికి చెందిన 3 ఏనుగులు వయసు మీదపడటంతో గత ఏడాదే మరణించాయి. ఈ ఏడాదికి అంబారీల్లేకుండానే యాత్ర నిర్వహించినా బాగుండేది.. కానీ.. గుడి ధర్మకర్తలకు ఏం బుద్ధి పుట్టిందో ఏమో 4 ఏనుగులను అరువుకు తెచ్చుకుందామని నిర్ణయించారు. ఇంకేముంది అసోంలోని తీన్‌సుఖియా నుంచి గజరాజులను తెప్పించండని ఆర్డర్ వేసేశారు. అసోం ప్రభుత్వమూ అందుకు ఓకే చెప్పింది. ఇంకేముంది.. అంతా హ్యాపీ అనుకుంటున్నారా? అక్కడే ఉంది తిరకాసు. రెండు ప్రాంతాల మధ్య దూరం దాదాపు 3100 కిలోమీటర్లు! ఇంతదూరం ఏనుగులను రవాణా చేయడం ఎలా? ఆ.. ఏముంది. రైల్వే కోచ్‌లపై పంపేస్తే సరి అని అసోం ప్రభుత్వం చెప్పడంతో జంతు ప్రేమికులు మండిపోతున్నారు. కనీసం మూడు నాలుగు రోజుల సమయం పట్టే ఈ ప్రయాణాన్ని గజరాజులు తట్టుకోలేవని.. ఉత్తర భారతమంతా 40 డిగ్రీలకు పైబడ్డ వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతూంటే.. నోరు లేని జీవాలను ఇంత కష్టపెడతారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. వేడికి, వడగాడ్పులకు తట్టుకోలేక మనుషులే చచ్చిపోతూంటే ఏనుగులు ఎలా తట్టుకోగలవు? అని జంతు సంరక్షణ ఉద్యమకారుడు కౌశిక్ బారువా నిలదీస్తున్నారు. గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళ్లే రైల్వే కోచ్‌పై రవాణా చేస్తే.. ఏనుగులు ఎంత ఆందోళన, ఒత్తిడికి గురవుతాయో అధికారులు కొంచెం కూడా ఆలోచించకపోవడం అమానవీయమని దుమ్మెత్తి పోస్తున్నారు కౌశిక్! ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఏనుగులకు వడదెబ్బ తగలొచ్చునని.. షాక్‌తో మరణించవచ్చు కూడా అని ఆయన హెచ్చరించారు. మన చట్టాల ప్రకారం సంరక్షిత జంతువుగా గుర్తింపబడ్డ ఏనుగులను ఎక్కడికైనా తరలించాలంటే ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఆరుగంటల కంటే ఎక్కువ కాలం వాహనాలపై రవాణా చేయకూడదు. ఏకబిగిన ముప్పై కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం నడిపించకూడదు కూడా. ఈ చట్టాలన్నింటినీ ఉల్లంఘిస్తూ వాటిని తరలించడం ఏమాత్రం సబబు కాదని జంతుశాస్త్రవేత్త బిభూతీ ప్రసాద్ లహకార్ స్పష్టం చేశారు. ఇంకోవైపు కాంగ్రెస్ ఎంపీ తరుణ్ గొగోయ్... ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ఏనుగుల కష్టాన్ని నివారించాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్‌కు ఓ లేఖ రాశారు. ''అయినా... గణపతిని పూజించే మనవాళ్లు.. ఆ దేవుడికి ప్రతిరూపంగా భావించే ఏనుగును ఒక్క ఊరేగింపు కోసం ఇంత హింసపెట్టాలా?'' అని కౌశిక్ ప్రశ్నిస్తున్నారు.

సాక్షి
గురువారం, జూన్, 27

# 'మూకదాడుల' బిల్లు జాడేది?

ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ మంగళ, బుధవారాల్లో చేసిన ప్రసంగాల్లో ప్రధానంగా కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ గత సార్వత్రిక ఎన్నికలకు మించి భారీ మెజారిటీ సాధించాక జరిగిన తొలి సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానంగా మోదీ మాట్లాడారు. ఇందులో సహజంగానే జార్ఖండ్‌లో ఇటీవల ఒక ఉన్మాద మూక ముస్లిం యువకుణ్ణి హతమార్చడం, ఉత్తరప్రదేశ్‌లో పసివాళ్ల ఉసురు తీస్తున్న మెదడువాపు వ్యాధి ప్రస్తావన తదితరాలున్నాయి. మూకదాడి ఉదంతంపై ప్రధాని మాట్లాడాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తోపాటు వివిధ పార్టీలు డిమాండ్ చేశాయి. మోదీ మాట్లాడటం అవసరమనడంలో సందేహం లేదు గానీ... అంతకన్నా ముఖ్యంగా దేశానికి అప్రదిష్ట తెస్తున్న ఈ తరహా దాడులకు పూర్తిగా అడ్డుకట్ట వేయడం ప్రధానం. ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భాల్లో మోదీ గతంలో మాట్లాడారు. కానీ ప్రభుత్వాల్లో కదలిక ఉన్న దాఖలా లేదు. నిందితులను సత్వరం అరెస్టు చేయడంలోనూ, కఠినంగా వ్యవహరించడంలోనూ అవి చొరవ చూపడం లేదు. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు కాస్త వెనకో, ముందో బెయిల్‌పై విడుదలవుతున్నారు. విచారణ పూర్తయిన కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాధారాలు లభించక నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారు.

మూకదాడుల విషయంలో పార్టీలు, పౌర సమాజ కార్యకర్తలు, వివిధ సంఘాలు మాత్రమే కాదు... సుప్రీంకోర్టు సైతం ఏడాదిక్రితం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో నిందితులను శిక్షించడానికి కఠినమైన చట్టం తీసుకురావాలని పార్లమెంటును కోరింది. అది వచ్చేలోగా ఆ మాదిరి దాడుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది. ముసాయిదా బిల్లు రూపకల్పనకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల కమిటీని, మంత్రుల బృందాన్నీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఆ పని ఎంతవరకూ వచ్చిందో ఎవరికీ తెలియదు. మూకదాడులు మాత్రం యధావిధిగా సాగుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒకే తీరుగా జరుగుతున్నాయి. పశువుల్ని తీసుకెళ్తున్న వాహనాలను గమనించి కొంతమంది వాటిని అడ్డగించడం, డ్రైవర్‌తోపాటు ఇతరుల్ని పట్టుకుని నెత్తురోడేలా కొట్టడం వీటన్నిటా కనిపిస్తుంది. ఈ ఉదంతాల్లోని బాధితుల్లో అత్యధికులు ముస్లింలే. తాజా ఉదంతంలో యువకుడు మోటార్ సైకిల్ అపహరించాడని మూక ఆరోపించింది. కానీ అతను అది నిజం కాదని ప్రాధేయపడుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన దృశ్యాలు చెబుతున్నాయి. చావుబతుకుల్లో ఉన్న అతనితో ఆ గుంపు బలవంతంగా 'జైశ్రీరాం', 'జై హనుమాన్' అనిపించింది. బుధవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన ఘటనా ఇటువంటిదే. బీజేపీ ప్రధాన కార్యదర్శి విజయ్‌వర్గియా కుమారుడు గుంపును వెంటేసుకుని అక్రమ నిర్మాణాలను కూలగొట్టిస్తున్న పనిలో ఉన్న మున్సిపల్ అధికారిపై గూండాగిరీకి దిగాడు. క్రికెట్ బ్యాట్‌తో చావబాదాడు. విజయ్‌వర్గియా అతగాణ్ణి సమర్థించడమే కాదు...'అడగడానికి నువ్వెవరు, నువ్వేమైనా జడ్జీవా' అంటూ ఒక పాత్రికేయుణ్ణి దబాయించారు.

పశువుల్ని తరలిస్తున్నారని లేదా గోమాంసం దగ్గరుంచుకున్నారని దాడులు చేయడంతో మొదలై, ఇప్పుడు ఇతర కారణాలతో దాడులు చేయడం వరకూ ఇవి పెరిగిపోయాయని, ఒక సంస్కృతిగా మారాయని అర్థమవుతోంది. వ్యక్తుల మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడు ఆవేశాలు పెరుగుతాయి. వాటి తీవ్రతనుబట్టి ఒక్కోసారి అవి హత్యలకు కూడా దారితీస్తాయి. కానీ మూక దాడులకు కారణమవుతున్న ఉదంతాలు అటువంటివి కాదు. పట్టుబడినవారు బతిమాలుతున్నారు. చేతులెత్తి మొక్కుతున్నారు. కానీ ఉన్మాద మూకలకు అవేమీ పట్టడంలేదు. అవతలినుంచి కనీస ప్రతిఘటన కూడా లేనప్పుడు తోటి మనిషిని అంతమంది ఏకమై చంపడానికి ఎలా సిద్ధపడతారో అనూహ్యం. ఈ అమానుషమైన ఉదంతాలు పునరావృతం కాకుండా నిరోధించడంలో విఫలమవుతున్నందుకు సహజంగానే జార్ఖండ్ ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తారు. దాన్ని ఆ రాష్ట్రాన్ని నిందించడంగా, అవమానించడంగా మోదీ భావించనవసరం లేదు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో జరుగుతున్న హత్యలనూ, వీటినీ ఒకేలా పరిగణించాలనడం కూడా సరికాదు. రెండు రకాల దాడుల్లోనూ హత్యలు చోటుచేసుకుంటున్నా స్వభావరీత్యా మూకదాడులకూ, రాజకీయ కారణాలతో పరస్పరం చేసుకునే దాడులకూ మధ్య వ్యత్యాసం ఉంది.

కాంగ్రెస్‌పై మోదీ చేసిన రాజకీయ విమర్శలకు ఆ పార్టీ జవాబు చెప్పుకునే స్థితిలో లేదు. ఆ పార్టీ ఏలుబడిలో దేశానికి సేవలందించిన పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌ల ఘనత గురించి ఏరోజైనా మాట్లాడారా అని ఆయన వేసిన ప్రశ్నకు కాంగ్రెస్ వద్ద సమాధానం లేదు. వారి వరకూ అవసరం లేదు... స్వతంత్రంగా ఆలోచించగలిగే కింది స్థాయి నాయకులను సైతం సంశయించడం, వారిని అవమానించడం, చివరకు వెళ్లగొట్టడం కాంగ్రెస్‌లో ఒక సంస్కృతిగా మారింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో దెబ్బతిన్నాక ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలు దీని పర్యవసానమే. కాంగ్రెస్ పార్టీ అటు విజయాన్నయినా, ఇటు అపజయాన్నయినా స్వీకరించే స్థితిలో లేదని మోదీ చేసిన విమర్శలోనూ వాస్తవం ఉంది. అపజయానికి కారణాలేమిటో సమీక్షించుకుని, అవసరమైన దిద్దుబాటు చర్యలకు దిగకపోగా రాహుల్‌గాంధీ పార్టీ అధ్యక్ష పదవినుంచి తప్పుకుంటానని భీష్మించుకుని కూర్చున్నారు. మరోపక్క ఈవీఎంల వల్లే బీజేపీ నెగ్గిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తు న్నారు. దేశం మరింతగా ఎదిగేందుకు పార్టీలకతీతంగా కలిసిరావాలని ప్రధాని అనడం స్వాగతించదగ్గదే. కానీ అందుకవసరమైన వాతావరణాన్ని కల్పించవలసిన ప్రధాన బాధ్యత అధికార పక్షానిదే. ఆ దిశగా మోదీ ప్రభుత్వం ఏమేరకు కృషి చేస్తుందో ముందుముందు చూడాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి బ.దశమి రా.3.15 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం అశ్వని పూర్తి (24 గంటలు), వర్జ్యం రా.2.36 నుంచి 4.18 వరకు, దుర్ముహూర్తం ఉ.9.50 నుంచి 10.44 వరకు తదుపరి ప.3.04 నుంచి 3.54 వరకు అమృతఘడియలు... రా.11.10 నుంచి 12.43 వరకు.

**సూర్యోదయం :** 5.31
**సూర్యాస్తమయం:** 6.32
**రాహుకాలం :** ప. 1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# జమిలి పోరాటాలు నేటి అవసరం

విశ్లేషణ


డాక్టర్ ఏపీ విఠల్

**ఇప్పుడు దేశాన్ని చుట్టుముడుతున్న నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, తగ్గిన తలసరి ఆదాయం, అవినీతి, పార్టీ ఫిరాయింపులు వంటి అన్ని కీలక సమస్యలను గాలికి వదిలేసి లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు పెట్టడం అనే అంశమే అతి ప్రధాన సమస్య అయినట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. కానీ, భారత్‌కి ఇప్పుడు కావలసింది మౌలిక సమస్యలపై జమిలి పోరాటాలే తప్ప జమిలి ఎన్నికలు కావని గ్రహించాలి. అలాగే ఏపీలో సాధారణ ప్రజానీకం తరపున పేదలకు అండగా సామాజిక న్యాయం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బలపర్చేందుకు ప్రగతిశీల శక్తులు సిద్ధంకావాలి.**

ఇటీవలనే జమిలి (లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు కలిపి ఒకేసారి) ఎన్నికల అంశాన్ని, అది మన దేశ ప్రజలముందున్న అతి తీవ్రమైన, తక్షణం పరిష్కరించవలసిన సమస్య అయినట్లూ.. దానిముందు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, తగ్గిన తలసరి ఆదాయం, అవినీతి, పార్టీ ఫిరాయింపులు వంటివి చాలా చిన్న సమస్యలైనట్లు, ముందుకు తెచ్చి దానిపై చర్చించేందుకు ఎన్డీయే ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. ఇక్కడో చిన్న మెలిక ఉంది. బీజేపీ ప్రభుత్వం 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అన్న అంశాన్ని ఎజెండాగా చేసింది. ఇది ఒకే దేశం ఒకే ఎన్నికలు అన్న అర్థంలో మన తెలుగు మీడియాలోకి వచ్చి చర్చలు జరిగాయి. నిజానికి దీని అసలు అనువాదం 'ఒకేజాతి, ఒకే ఎన్నికలు' అని చెప్పుకోవాలి. జాతి–దేశం సమానార్థకాలు కావు. భౌగోళికంగా సారూప్యత, ఒకే విధమైన వాతావరణం, ఆర్థిక నేపథ్యం, సంస్కృతి సంప్రదాయాలు అన్నింటినీ మించి ఒకే భాష కలిగిన ప్రజాసమూహాన్ని జాతి అంటాము. నిజానికి ఈ దేశంలో రాష్ట్రపతి గానీ, ప్రధాని గానీ, తమ మాతృభాషలో ప్రసంగిస్తే, మన దేశ జనాభాలో సగంమందికి అర్థం కాదు. అంటే ఒకే భాష 'జాతి'కి ఒక సామాన్య అంశం. ఉదాహరణకు, మనది తెలుగుజాతి, అలాగే ద్రవిడ, మరాఠా, పంజాబీ, గుజరాతీ ఇలా మనదేశంలో వివిధ జాతులున్నాయి. మన జాతీయ గీతం జనగణమనలో కూడా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా పంజాబ్, సింధు, గుజరాత్, మరాఠా, ద్రావిడ, ఉత్కళ, వంగా అని మన దేశం వివిధ జాతుల సముదాయం అనే రాశారు. నా భారత దేశం జిందాబాద్, మా తెలుగుతల్లికి మల్లెపూదండ అని సగర్వంగా నేను నినదిస్తాను. ఇలా ఒక దేశంలో ఎన్నో జాతులున్నట్లే, ఒకేజాతి ఎన్నో దేశాలలో ఉండవచ్చు.

మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో, వివిధ జాతుల ప్రజానీకమూ, పరాయి, వలస బ్రిటిష్ దుర్మార్గ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా, తమ తమ పోరాటాలు సాగించారు. మన అల్లూరి, కొమరం భీం ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి, తమిళులకు వీరపాండ్య కట్టబొమ్మన, మరాఠాలకు శివాజీ, కన్నడిగులకు టిప్పుసుల్తాన్, ఇలా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వివిధ జాతుల వీరులెందరో ఉన్నారు. అయినా రాజకీయంగా, కాంగ్రెస్ పార్టీ గాంధీజీ నాయకత్వాన దేశవ్యాపితంగా ప్రధానమైన పాత్ర పోషించిందనడం నిర్వివాదం! 1885లో కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పుడు, తొలి సమావేశాన్ని భారత జాతీయ కాంగ్రెస్ అనే పిలిచారు. నిజానికి భారత స్వాతంత్ర్యోద్యమం 'భారత జాతుల స్వాతంత్ర్యోద్యమం' అన్న మాట. ఈ వివిధ జాతులన్నీ బ్రిటిష్ వాడు ఏర్పర్చిన పాలనాపరమైన దేశంలాగా గాక, తమ జాతుల అస్తిత్వాన్ని నిలుపుకుంటూ, భారతదేశంగా ఏకశిలాసదృశ్యమైన, రాజ్యాంగంగానే.. వివిధ రాష్ట్రాలుగా ఉన్న ఒక సమాఖ్య స్వరూపంగానే మన రాజ్యాంగం ఏర్పడింది. ఇప్పటికీ తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండులో జాతులు, ఉపజాతులు మన దేశంలో కళ్లముందు ఉన్న దృశ్యమే.

ఇంత సువిశాల భారతదేశంలో వివిధ రాష్ట్రాలలో వివిధ సమయాలలో, ఎన్నికలు జరుగుతూ ఉండటం వలన, ఎన్నికల నియమావళి, పాలనాపరమైన ఇబ్బందులు, అధిక ధనవ్యయం, ఎప్పుడూ ఎన్నికల వాతావరణంతో అభివృద్ధి వెనకడుగు వేయడం, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఒకేసారి రాష్ట్రాల శాసనసభలకూ, దేశ లోక్‌సభకూ ఎన్నికలు నిర్వహించడం వలన మేలు జరుగుతుందన్న భావన ఉండవచ్చు. వాస్తవానికి మన రాష్ట్రంలో 20 ఏళ్లకు పైగా అలా జమిలి ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. కాబట్టే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జమిలి ఎన్నికలకు సూత్రప్రాయమైన అంగీకారం తెలిపారు. తనకు అత్యంత ప్రధానమైన ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను, ప్రత్యేక హోదాతో సహా విభజన చట్టంలో పొందుపర్చవలసిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్న ఆకాంక్షను, అక్కడి అఖిలపక్ష సమావేశంలో మరోసారి వక్కాణించారు. అదీ ఆయన నిబద్ధత. వైవిధ్యభరితమైన వివిధ జాతుల ప్రత్యేకతలను బీజేపీ తృణీకరించి ప్రతిపాదించిన అఖండ భారత జాతి అన్న అవగాహనకు భిన్నంగా 'ఒకే జాతి–ఒకే ఎన్నిక' అంశం మరింతగా అధ్యయనం చేయాల్సి ఉంది. అందుకే ఒక కమిటీ ఏర్పాటుకు అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. అంతేకాదు. జమిలి ఎన్నికల్లో రాష్ట్ర, కేంద్ర ప్రాధాన్యతలు ఒకటి కాకపోవచ్చు.

ఉదాహరణకు, మొన్నటి మన శాసనసభ ఎన్నికలలో గత వెన్నుపోట్ల పార్టీ పాలనలోని అవినీతి, అసమర్థత, కులతత్వం, నయవంచన వంటి వాటిని అంతం చేయడం.. మన రాష్ట్రానికి, ప్రత్యేక హోదాతో సహా విభజన లాభాలను సాధించడం.. ఒక నిబద్ధత గల, ప్రజానురంజక, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం ప్రధాన ఎజెండాగా వైఎస్ జగన్ నాయకత్వాన వైఎస్సార్‌సీపీ ఎన్నికల రంగంలోకి దిగి అద్భుత విజయాన్ని సాధించింది. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వారికి ఈ అంశాలు పట్టలేదు. భారత జాతీయత, అఖండ భారతం అంటూ సామాజిక న్యాయసాధనను వ్యతిరేకిస్తూ మనుస్మృతి ఆధారిత, మతతత్వ నిచ్చెనమెట్ల వర్ణ(కుల) వ్యవస్థను నిలబెట్టడం ఎజెండా. అందుకే ప్రజలు, వెన్నుపోటు పార్టీ ఉనికినే ప్రశ్నార్థకం చేసే విధంగా తిరస్కరించడమే కాక, బీజేపీ పార్టీకీ దాని భావజాలానికి రాష్ట్ర శాసనసభలో స్థానం లేకుండా చేశారు.

కేవలం మాటలతోనూ, ప్రచారంతోనే కాదు.. ఆచరణలో మన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా, పదహారు రోజుల పండుగ కూడా ముగియకుండానే, జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో అడుగులు వేశారు. ఆయన పాలన ఆరంభించి అవినీతి రహిత పాలన దిశగా, నవరత్న పథకాల ఆచరణకు రూపు దిద్దుకునే రీతిలో రాష్ట్రం ముందడుగు వేయడం చూస్తున్నాం! వైఎస్ జగన్ రాజకీయ ప్రత్యర్థుల సంగతి ఎలా ఉండినా, దాదాపు యావదాంధ్ర ప్రజలు ఆశావహ రీతిలో అభినందించడమూ చూస్తున్నాం. ఒక్క సామాజిక న్యాయ అంశాన్నే తీసుకుందాం. ఎన్నడైనా, ఏ పార్టీ అయినా తన మంత్రివర్గ కూర్పులో అయిదుగురు దళిత, గిరిజన, మైనార్టీ, మహిళా, వెనుకబడిన కులాలవారికి ఉపముఖ్యమంత్రి పదవులనిచ్చి గౌరవించిందా? తన మంత్రివర్గంలో 60 శాతం సామాజిక న్యాయం అవసరమైన వారికే స్థానం కల్పించి చరిత్ర సృష్టించిన వారు ఇంతకు ముందెవరు? ఇటీవల ఒక మార్క్సిస్టు మిత్రుడు నాకు ఫోన్ చేసి, 'మీరు జగన్‌ను సమర్థిస్తున్నట్లు వ్యాసాలు రాస్తుంటే, జగన్ ఏమైనా సోషలిజం తీసుకువస్తాడా అని అడిగాడు. కానీ సాధారణ ప్రజానుకూల పాలనదిశగా, ఇంత త్వరగా ఇంత నిబద్ధతతో జగన్ తన ప్రస్థానం ఆరంభించగలడని అనుకోలేదండీ! ఎండకన్నెరుగని జగన్‌మోహన్ రెడ్డి ఇలా దళితులకు, గిరిజనులకు, మహిళలకు, మైనారిటీలకు, వెనుకబడిన కులాలవారికి, ఇంత పెద్ద పీట వేస్తారని అనుకోలేదండీ' అంటూ ఎంతో స్పందనతో మాట్లాడాడు.

నిజానికి ఈ వర్ణ(కుల) వ్యవస్థను అంతం చేయడం.. ఈ దేశ ప్రజల శ్రేయస్సును కోరేవారందరి ప్రథమ కర్తవ్యం. ఆర్థిక దోపిడీకి గురవుతున్న సాధారణ శ్రామికులలో కూడా ఈ అణగారిని ప్రజానీకమే ఎక్కువ. వర్గదోపిడీని అరికట్టాలన్నా, ఈ కులవ్యవస్థను బద్దలు కొట్టకుండా మన దేశంలో అసాధ్యం. విభిన్న జాతుల సమాహారం మన భారతదేశం అని చెప్పుకున్నాం కదా! ఈ దేశంలో, ఏ రాష్ట్రంలో, ఏ జాతిలో అయినా ఈ కులవివక్ష ఉంది. అదే మన సామాన్య అంశంగా ఉందన్నదీ నిర్వివాదాంశమే. ఆంధ్రప్రదేశ్‌లో అయినా, బెంగాల్‌లో అయినా, ఉత్తరాది రాష్ట్రాల్లో అయినా కులవ్యవస్థ అమానవీయత మన దేశంలో సర్వేసర్వత్రా వ్యాపించింది. అత్యంత పేదరికం అనుభవిస్తున్న శ్రమజీవులూ ఈ అణగారిన కులాల్లోనే ఉన్నారు. అంతేకాదు మన జనాభాలో ఆధిపత్య కులాలవారు 20 శాతం ఉంటే మిగిలిన వారిలో అత్యధికులు సామాజిక న్యాయం పొందవలసిన అణగారిన ప్రజానీకమే. ఎక్కువమంది పేద మధ్యతరగతి ప్రజానీకం ఉండగా, కోటీశ్వరుల సంఖ్య చట్టసభల్లో పెరుగుతుండటం నిజం. ప్రజాస్వామ్యం పెంపొందే క్రమంలో అది పేద, మధ్యతరగతి ప్రజానీకానికి అనుగుణంగా మారాలి. అలాగే సామాజిక అణచివేతకు గురవుతున్న వారిలో దళితులకు, గిరిజనులకు రిజర్వేషన్ ఉన్నది. ఇతర వెనుకబడిన కులాల వారికి, మహిళలకు, మైనారిటీలకు, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అవసరం. అప్పుడే ఈ ప్రజాస్వామ్యం ఆధిపత్య కుల ధనస్వామ్యంగా మారకుండా ఉంటుంది. పార్లమెంటులో వైఎస్సార్ సీపీ తరపున విజయసాయిరెడ్డి.. ఇతర వెనుకబడిన కులాలవారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని, ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టి, ఆ ప్రజాసమూహాల అభినందనలు అందుకున్నారు.

నిజానికి ఇలాంటి బిల్లును కమ్యూనిస్టులే ఎప్పుడో పెట్టాల్సి ఉండింది. కానీ సృజనాత్మకత, సాధారణ వివేకం కనుమరుగైనట్లుగా.. ఈ కుల వ్యవస్థ నిర్మూలనకు నడుం కడితే, వర్గపోరాటం వెనకపట్టు పడుతుందని వాదిస్తున్న కమ్యూనిస్టు నేతల ఆలోచనా ధోరణి సరి కాదు. కులతత్వం మన భారతదేశంలో ఘనీభవించింది అని ఇఎంఎస్ నంబూద్రిపాద్ అన్నారు. పైగా మార్క్సిజం ప్రవచించిన నాటి 'ప్రొలిటేరియట్స్' నేడు బాగా తగ్గిపోతున్నారు. నేడు ట్రేడ్ యూనియన్‌లలో ప్రధానంగా ఆర్గనైజ్డ్ ట్రేడ్ యూనియన్‌లలో (రెక్కల కష్టం తప్ప మరేమీ లేనివారు), బ్యాంకింగ్ రంగంలో, తదితర పరిశ్రమల్లో ఉన్న వారిలో అత్యధికులు మధ్యతరగతివారు. వారు ఆర్థిక సమస్యలతో పాటు నిజానికి, అంతకంటే కొంచెం ఎక్కువగానే సామాజిక న్యాయం అవసరమని అర్రులు చూస్తున్నారు. కనుక వర్గపోరాటాన్ని, వర్ణపోరాటాల్ని పరస్పర విరుద్ధంగా ఆలోచించడం మన దేశ పరిస్థితుల్లో మార్క్సిజం అనిపించుకోదు. తెలంగాణ రాష్ట్ర సీపీఎం, నాడు తెలంగాణ పోరాటంలో దిశానిర్దేశం చేసి నేడు ఈ కులనిర్మూలన పోరాటంలో ముందున్నందుకు వారికి అభినందనలు! ఆ తెలంగాణ గడ్డమీదే లాల్–నీల్ నినాదమిచ్చాడు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం! కానీ, ఇప్పుడెందుకో పార్టీ కేంద్రనాయకత్వం తెలంగాణ సీపీఎం విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు లేదు. ప్రజలు ఎక్కడ ఏరకమైన దోపిడీకి, అణచివేతకు గురవుతున్నారో వారికి అండగా ఉంటేనే మనదేశంలో కమ్యూనిస్టు పార్టీలకు ఏమాత్రమైన పురోగమనం ఉంటుంది. లేకుంటే ఆ పార్టీల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది.

జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఈ విషయంలో.. మన మార్క్సిస్టు పరిభాషలో, బూర్జువా పార్టీనే అయినా, బహుజన వామపక్ష సంఘటన వంటి వాటి నిర్మాణంతో, ప్రస్తుత దేశ, కాల, రాష్ట్ర, సామాజిక న్యాయ పరిస్థితులకు అనుగుణంగా, సాధారణ ప్రజానీకం తరపున పేదలకు అండగా సామాజిక న్యాయదిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రజల అభ్యున్నతి – ప్రస్తుత దశలో, ఎలా ఆచరణలోకి వస్తే, దానిని బలపర్చి, మొత్తం సమాజం మార్క్స్ చెప్పిన పరిణామ దిశగా పురోగమించడానికి కమ్యూనిస్టులు ప్రయత్నించాలని మనసారా కోరుకుంటున్నాను.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు | మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### వాస్తవం



"రెండు కోట్ల ఉద్యోగాలు, రెండంకెల అభివృద్ధి అంటూ హామీలు ఇచ్చి, రెండోసారి అధికారంలోకి వచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ. తరువాత ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పనపై బలవంతంగా రెండు కమిటీలు ఏర్పాటు చేయక తప్పలేదు. తన ప్రభుత్వ లోపాలను వివరించాల్సిన ప్రధాని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంలో హడావుడిగా ఉన్నారు. దీన్నిబట్టి వాస్తవం నుంచి తప్పించుకుంటున్నది ఎవరో అర్థం అవుతుంది"
– గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ ఎంపీ

### హీరో



"జైలు శిక్షకు గురైన ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ కేవలం ఆరు కోట్ల గుజరాతీల గురించి కాదు, కోట్లాదిమంది దేశ ప్రజల తరఫున మాట్లాడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన రాసిన బహిరంగ లేఖలోని ప్రతి పదాన్ని జాగ్రత్తగా గమనిస్తే మీకే అర్థమవుతుంది. నిజాన్ని అణచివేయకూడదు. భట్ ఒక హీరో"
– శోభా డే, రచయిత్రి

### అప్పుడో?



"మన ప్రధాని నరేంద్ర మోదీ కేరళను సోమాలియాతో పోల్చినప్పుడు ఎవరికీ అభ్యంతరకరం అనిపించలేదా? దేశ రాజధాని ఢిల్లీని రేప్ కేపిటల్ అని ఆయన వ్యాఖ్యానించినప్పుడు మొత్తం ఢిల్లీ అంతటినీ అవమానించినట్టు కాదా? జార్ఖండ్‌లో జరిగిన మూకదాడి బాధ కలిగిస్తోందిగానీ, మొత్తం రాష్ట్రాన్ని అవమానించొద్దని అనడం కపటత్వం"
– షమా మహమ్మద్, కాంగ్రెస్ నేత

### గాలిబ్



"ప్రధాని నరేంద్ర మోదీ తన రాజ్యసభ ప్రసంగంలో పేర్కొన్న కవితను సామాజిక మాధ్యమాల్లో గాలిబ్‌కు తప్పుగా అన్వయిస్తున్నారు. వాస్తవానికి ఆ కవితా పాదాలు చందస్సుకు అనుగుణంగా లేనేలేవు"
– జావేద్ అక్తర్, గీత రచయిత

### జోక్



"ఒక హంతకుడు, రేపిస్ట్ పెరోల్‌ను వినియోగించుకోడానికి అర్హుడు అవుతాడు. కానీ, ప్రజల కోసం పోరాడుతున్న హక్కుల నేతలు వరవరరావు, సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరీరా, వెర్నన్ గోన్‌సాల్వేస్‌లు మాత్రం జైలులోనే కృంగిపోవాలి. అనారోగ్యంతో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబకు మాత్రం బెయిల్ రాదు. దేశం ఎంతగానో దిగజారిపోతోంది. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. బాబా రామ్ రహీమ్ ప్రవర్తన చాలా బావుందని, జైల్లో అతడు ఎటువంటి నేరానికి పాల్పడలేదని రోహతక్ జైలు సూపరింటెండెంట్ జిల్లా కమిషనర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారట"
– పార్థ్ ఎంఎన్, జర్నలిస్ట్

# కవిత్వం రాజకీయాల్లోకి ప్రవహించదు: మహాస్వప్న

దిగంబరులారా, అజ్ఞానం మీ కవచం, అహంకారం మీ ఆయుధం, ఆత్మవంచన, పరవంచన మీకు కొత్తగా మొలిగచిన కొమ్ములు. దౌర్జన్యం మీ పంథా. మీకు ఎదురు లేదు. దిగ్విజయం మీదే. ఎందుకంటే చరిత్ర నిండా కనిపించే విజేతలంతా మీలాంటి వాళ్లే. మీకు ఎక్కడా, ఎప్పుడూ సందేహాలు లేవు. సమస్యలు లేవు. మీకు ప్రశ్నలు లేవు. ఉన్నా వాటికి సమాధానాలక్కరలేదు. మీరు ప్రపంచ ఏకైక సత్యాన్ని దర్శించిన ద్రష్టలు. కేవలం జ్ఞాన స్వరూపులు. మీ జ్ఞానాధిక్యత పట్ల మీకున్న ప్రగాఢ విశ్వాసం ప్రశస్తం.

నిజంగా మీరు గొప్పవారు. మీ 'ప్రజలు' గొప్పవారు. మీ జెండాలు గొప్పవి. మీ నినాదాలు గొప్పవి.మీ విశ్వాసాలు గొప్పవి. మీరు కనుక్కున్న సత్యం గొప్పది. మీరు తొడుక్కున్న పందొమ్మిదో శతాబ్దపు ఐరోపా కోటు (చిరిగి, మాసి, అంతులేని గబ్బు కొడుతున్నా సరే) గొప్పది. ఎదుటి వాడిని చిత్తు చేయడం కోసం వేసిన ఎత్తుగడలు గొప్పవి. పన్నిన వ్యూహాలు గొప్పవి. అందుకే మీరు నిజంగా గొప్ప వారు.

నేను జీవితంలోకీ, సాహిత్యంలోకీ దిగంబరంగానే వచ్చాను. ఆయుధాలు సిద్ధం చేసుకోలేదు. యుద్ధానికి రాలేదు కాబట్టి. నేను చిన్నవాణ్ణి, కొద్దివాణ్ణి. నాకు అన్నీ సమస్యలే. అన్నీ సందేహాలే. నాకెదురుగా అన్నీ చౌరస్తాలే. అన్నీ క్రాస్ రోడ్లే.

ముఖ్యంగా ఈ దేశంలో ఎవరు ఎవరో తెలుసుకోవడం కష్టం. ఎవరు ఏ పనిచెయ్యాలో ఆ పని చేయరు. ఎవరు ఏ పని చెయ్య కూడదో ఆ పని చేస్తారు. ఇక్కడ కుక్కలు ఓండ్ర పెడతాయి. గాడిదలు మొరుగుతాయి. గొర్రెలు గర్జిస్తాయి. సింహాలు ఇకిలిస్తాయి. అందుకే ఒక క్యాపిటలిస్టు మార్క్సిజాన్ని గురించి మహోపన్యాసం ఇచ్చినా, ఒక నపుంసకుడు బండ్ల కొద్దీ సెక్స్ సాహిత్యాన్ని సృష్టించినా, ఒక పరమ దుర్మార్గుడు పరమ శివుడి ఫోజు పెట్టినా ఆశ్చర్యపడనక్కరలేదు.

'వర్గపోరాటం–వర్గ సంఘర్షణ' అంటున్న మీరూ, మీ ప్రజలూ ఏ వర్గానికి చెందుతారో మీకు తెలీదు. మావో మ్యాజిక్కుకి వొళ్లు మరిచి కదం తొక్కుతూ కదనకుతూహలంతో సాయుధ విప్లవం పదం పాడుతున్న మీకు, అర్జెంటుగా శత్రువులు కావలసిన మాట నిజమే. ఉన్న పిడికెడు మంది శత్రువులు మీ పిడికెళ్ల కెట్లాగూ అందరు. ఈ చీకటి తిర్నాళ్ల సంతలో మిగతా నిజమైన శత్రువుల అడ్రసేదో మీకు అంతుపట్టదు.

అజ్ఞానంతో, ఆవేశంతో 'సాయుధ విప్లవం జిందాబాద్' అని మీరంటే లక్ష దోపిడీ కంఠాలు మీ వెనుక నుంచి 'జిందాబాద్' అని ప్రతిధ్వనిస్తున్నాయి. 'నక్సలైట్ తత్వం వర్ధిల్లాలి'అని మీరంటే 'వర్ధిల్లాలి' అని లక్ష దోపిడీ హస్తాలు పైకి లేస్తున్నాయి. మీ అజ్ఞానాన్ని మీ ప్రజలూ, మీ ప్రజల అజ్ఞానాన్ని మీరూ దోపిడీ చేసుకుంటున్నారు.



నిజం తెలుసుకోవాలనుకుంటే నిశ్శబ్దంగా సమాజ జీవనాడుల్లోకి ప్రవహించండి. కవిత్వం కావాలనుకుంటే సిద్ధాంతాల్ని, సూత్రాల్ని తెగదెంచి, ముందు మిమ్మల్ని మీరు బంధ విముక్తుల్ని చేసుకోండి.

కవిగా నేనెప్పుడూ సర్వస్వతంత్రుడినే. వ్యక్తి స్వేచ్ఛను అంటే భావస్వాతంత్ర్యాన్ని అరికట్టే ఏ వ్యవస్థనయినా, ఏ ఉద్యమాన్నయినా ద్వేషిస్తాను, దూషిస్తాను. శాసించే ప్రతి దౌర్జన్య హస్తాన్నీ నిలబెట్టి నరుకుతాను. 'కట్టుబడు' అంటే తంతాను. ఆత్మహననం కానంతవరకే సమష్టి బాధ్యతకు విలువ. మార్క్సిజం మీ సొంతమైనట్లు వాదిస్తున్న మీ అజ్ఞానానికి, ఇతర ఇజాలనూ, ఇతర కవులనూ సహృదయతతో, సానుభూతితో చూడలేని మీ బుద్ధి జాడ్యజనితోన్మాదానికీ విచారిస్తున్నాను. మీరు నటిస్తున్న మాట యథార్థం. మీ సిన్సియారిటీని నేను శంకిస్తున్నాను. నక్సల్‌బరిలో ఏనాడో మొదలైన రైతు పోరాటం ఆంధ్రప్రదేశ్‌కు వ్యాపించి శ్రీకాకుళంలో మంటలు మిన్ను ముట్టాకనే మీరు కళ్లు విప్పారు. ఉన్నట్టుండి అవసరవాదాన్నీ, నక్సలైట్ విధానాన్ని అమాంతం కావిలించుకుంటున్నారు. దోపిడీ వ్యవస్థకి కారణమైన ఏ అవినీతి ప్రభుత్వాన్ని మీరు దుయ్యబడుతున్నారో, అదే అవినీతి ప్రభుత్వానికీ, దాని ఆశ్రిత సంస్థలకీ కడుగుతూ నగరాల్లో విలాస జీవితాలు గడుపుతున్న మీకు, ఎండల్లో, వానల్లో, కొండల్లో, అడవుల్లో తుపాకీ గుండ్లకు రొమ్ములొడ్డి తాము నమ్మిన దాని కోసం ఆవేశంతో పోరాడుతున్న నక్సలైట్లను సమర్థించే అధికారమూ అర్హతా లేవు.

కృత్రిమమైన మోరల్ సపోర్ట్ ఎవరికీ అక్కరలేదు. మీ వందిమాగధ స్తోత్రాలూ, కైవారాలూ ఎవరికీ అక్కరలేదు. విప్లవాగ్ని జ్వాలలకు మీరేం కిరసనాయిల డబ్బాలు సరఫరా చెయ్యనక్కర్లేదు. దమ్ముంటే, నిజాయతీ ఉంటే దేశీయ సమస్యలకు నక్సలైట్ విధానం పరిష్కార మార్గమనే గట్టి నమ్మకం మీకుంటే పెళ్లాం బిడ్డల్ని వొదిలి ఉద్యోగాల్నీ విలాస జీవితాల్నీ వొదిలి కార్యరంగం మీదికి వెళ్లండి. వీరోచితంగా పోరాడండి.

ఎండిన తాటాకులకు మంట పెట్టడం, అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడటం, దూరంగా నిలబడి బావిలో నాలుగు రాళ్లు రువ్వి జలావర్తాలు సృష్టించడం, సమయం వస్తే తెరచాటుకు తప్పుకుని ప్రజలతో దోబూచులాడటం కాదు దిగంబర కవులు చేయవలసింది. సాయుధ పోరాటాన్ని నేను వొప్పుకున్న మాట నిజమే. సాయుధ పోరాటమంటే నక్సలైట్ విధానమని కాదు నా అర్థం. దేశ వ్యాప్తంగా ప్రజా సానుభూతితో రావలసిన ధర్మబద్ధమైన ప్రజా పోరాటం. నాలుగైదు కెరటాలు ఉవ్వెత్తున ఎగిరి పడ్డంత మాత్రాన సముద్రంలో తుపాను రాదు.

రాజకీయాలకు, మతతత్వాలకు, సంకుచితత్వాలకు అతీతంగా గిరుల్ని గీతల్ని, అవధుల్ని దాటి సర్వోన్నత స్థాయిలో స్వచ్ఛందంగా పలకవలసిన కవిత, సంకుచిత వలయాల్లోకి, రాజకీయాల బురద గుంటల్లోకి ఎందుకు ప్రవేశించవలసి వచ్చింది? సముద్రాన్ని నదిలోకి మళ్లించాలనుకుంటున్న మీరు సముద్రాన్ని ఎప్పుడూ చూసిన పాపాన పోలేదు. రాజకీయాలు కవిత్వంలోకి ప్రవహిస్తాయి. కానీ కవిత్వం రాజకీయాల్లోకి ప్రవహించదు.

దిగంబర కవితోద్యమ ప్రారంభ దశలో మీలో ఒక్కడైనా మార్క్స్, మావోల పేరెత్తలేదే. వారిని చదివాక ఇప్పుడే జ్ఞానోదయమైందా? మార్క్సిజం పుట్టిన ఒక శతాబ్దం తరువాత, ఆ సిద్ధాంతాల్ని అత్యధునాతనమైనవిగా ప్రచారం చేయడానికి కవులుగా మీకు సిగ్గెందుకు లేకుండా పోయింది? పోనీ మార్క్సిజాన్ని దృఢంగా విశ్వసించినప్పుడు, ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడమే మీ ధ్యేయమైనప్పుడు, స్పష్టంగా 'మేము మార్క్సిస్టు కవులమనో, మావోయిస్టు కవులమనో, సోషలిస్టు కవులమనో' చెప్పుకోవడానికి సంకోచమెందుకు? దిగంబర కవులు అనే ముసుగెందుకు?

శుద్ధ నాస్తికవాదులం అంటూనే పెళ్లాం సాకుతో తిరుపతి తీర్థయాత్రలు సేవించడం, శాస్త్ర సమ్మతంగా పెళ్లాడటం, ఆధునిక వివాహాలకు అత్యాధునిక పౌరోహిత్యాలు నెరపడం, పెళ్లిళ్లకు దిక్ పఠనాలు చెయ్యడం, రాజకీయోపన్యాసాలకు తయారు కావడం–ఇవన్నీ దిగంబర కవితా లక్షణాలని నేను ముందనుకోలేదు. నా దృష్టిలో దిగంబర కవిత్వ నిర్వచనమేదో కొత్తగా ఇవాళ చెప్పవలసిందేమీ లేదు.

ఏ ఇజానికో తాకట్టు పడివుంటే నేను దిగంబర కవిని కానక్కర్లేదు. ఏ చెప్పులూ నా కాళ్లకి పట్టలేదు. ఏ దుస్తులూ నా ఒంటికి అతక లేదు. ఏ ఫ్రేములోనూ నా ఫొటో ఇమడలేదు. అందుకే నేను దిగంబర కవినయ్యాను. ఒక ఇజానికీ, ఒక విశ్వాసానికీ కట్టుబడిపోయి, దిగంబర కవులుగా మిమ్మల్ని మీరు నరుక్కున్నారు. మీరు నమ్మినదాన్నే ప్రపంచమంతా విశ్వసించాలని దౌర్జన్యంగా శాసిస్తూ మీ అల్పబుద్ధిని బయటపెట్టుకున్నారు. కట్టుబడిపోయిన మీకూ, దేనికీ కట్టుబడని నాకూ సంధి కుదరదు. పరిణామాల్ని ఊహించి మొహం చాటు చేసుకోవల్సిన గతి మీకు పడుతుంది. నాకు కాదు. తాటాకు చప్పుళ్లతో, కాగితప్పులి గర్జనలతో భయపెట్టలేరు.

(1970లో దిగంబర కవులు ఇచ్చిన చార్జిషీట్‌కు మహాస్వప్న ఇచ్చిన సమాధానం సంక్షిప్త రూపం. మంగళవారం కన్నుమూసిన మహాస్వప్న స్మరణలో.)

# అధికారి

లౌకిక విద్యలో ప్రాథమిక స్థాయీ, మాధ్యమిక స్థాయీ, ఉన్నత స్థాయీ అని ఉన్నట్టు, ఆధ్యాత్మిక పరిజ్ఞానం విషయంలో కూడా మందాధికారులూ, మాధ్యమాధికారులూ, ఉత్తమాధికారులూ అని మూడు రకాల వారుంటారు. ఇక్కడ 'అధికారి' అనే మాట వారి ప్రస్తుత పరిజ్ఞానం స్థాయిని సూచిస్తుంది. 'మందాధికారులు' అంటే పరిమితమైన విషయ పరిజ్ఞానం కలవాళ్లు. ఆధ్యాత్మిక పరిజ్ఞానంలో ప్రాథమిక విద్యార్హత కలిగి ఉన్నవాళ్లు. మాధ్యమిక విద్యాబోధనకు అర్హులు. 'ఉత్తమాధికారులు' అంటే విషయాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసి అందులో పాండిత్యం, పరిజ్ఞానం సంపాదించినవాళ్లు. ఈ రెండింటికీ మధ్యలో మందాధికారులకంటే ఎక్కువ పరిజ్ఞానం కలిగి, ఉత్తమాధికారుల శ్రేణికి చేరకుండా ఉన్న 'మాధ్యమాధికారులు' ఉంటారు.

లౌకిక విషయాలలో లాగే ఆధ్యాత్మిక విషయాలలో కూడా జన బాహుళ్యంలో సాధారణంగా, నూటికి 90 మందికి పైగా మందాధికారులే ఉంటారు. ఒక మాదిరి పాండిత్యం సంపాదించినవాళ్లు కొద్దిమంది ఉంటారు. లోతులెరిగిన ఉత్తమాధికారులు మరీ మరీ అరుదు. ఒక జిజ్ఞాసువు విద్యార్థిగా గురువును ఆశ్రయించినప్పుడు, గురువుకు ఆ విద్యార్థి 'అధికార' స్థాయి తెలి యటం అవసరం. మందాధికారికి క్లిష్టమైన విషయాలు ముందే బోధిస్తే అవి అర్థం కావు. బోధన అతగాడి తలమీదుగా వెళ్లి పోతుంది. ఫలితంగా, ఆ విషయమంటేనే భయమూ, అయిష్టమూ, అనాసక్తీ ఏర్పడవచ్చు. ఐదో తరగతి విద్యార్థికి ఎం.ఏ. స్థాయి పాఠాలవల్ల ఏం లాభం? అలాగే మాధ్యమాధికారికి, మరీ ప్రాథమికమైన పాఠాలవల్ల ప్రయోజనం ఉండదు. ఇంటర్ విద్యార్థి ఎక్కాలు వల్లించాలా? ఏబీసీడీలు చూచిరాత రాయాలా?

ఆధ్యాత్మిక విషయ పరిజ్ఞానంలో మనలో చాలామందిమి మందాధికారులమే. ఎందుకంటే, ఆ స్థాయినుంచి ఎదిగేందుకు మనం ప్రత్యేకమైన ప్రయత్నం, అధ్యయనం, సాధనా చేయలేదు కనుక. అందుకే ఎక్కువ ప్రవచనాలూ, బోధనలూ, ఆధ్యాత్మిక గ్రంథాలూ మనకు కొరుకుడు పడవు. వేదాంత శాస్త్రంలో ఉత్తమాధికారులైనవారు కూడా, రసాయన శాస్త్రంలోనో, గణితంలోనో, చూస్తే మందాధికారులుగానే ఉండవచ్చు. మందాధికారులు తమకు సరిపడే బోధనలవల్ల ఎక్కువ ప్రయోజనం పొందుతారు. క్రమంగా జ్ఞానార్జనలో పైపై మెట్లెక్కుతూ వెళ్లొచ్చు.

ఆది శంకరుల లాంటి జగద్గురువులు మందాధికారుల కోసం 'భజ గోవిందం' లాంటి సరళమైన, సుబోధమైన పాఠాలు చెప్పారు. మాధ్యమాధికారుల కోసం 'ఆత్మబోధ' 'వివేక చూడామణి' లాంటి ప్రకరణ గ్రంథాలు ప్రసాదించారు. ఉత్తమాధికారుల కోసం ఉపనిషద్భాష్యాలూ, బ్రహ్మసూత్ర భాష్యమూ ఉపదేశించారు.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



మేఘా ఇన్..
అమలా అవుట్
సినిమా పేజీలో...

మంచి విషయం

## వండర్ ఉమన్



● వార్నర్ బ్రదర్స్ తొలి మహిళా సీఈవో యాన్ సర్నాఫ్



● వార్నర్ బ్రదర్స్ చిత్రం వండర్ ఉమన్' స్టిల్

ప్రపంచ ప్రఖ్యాత చిత్రనిర్మాణ సంస్థ 'వార్నర్ బ్రదర్స్' చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆ సంస్థ సీఈవోగా ఒక మహిళ ఎంపికయ్యారు. ప్రస్తుతం 'బీబీసీ స్టూడియోస్ అమెరికా' సంస్థకు చీఫ్‌గా ఉన్న యాన్ సర్నాఫ్‌ను వార్నర్ బ్రదర్స్ తన ఈసీవో (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) గా ఎంపిక చేసుకుంది. హాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టూడియోగా గుర్తింపు ఉన్న వార్నర్ బ్రదర్స్ 96 ఏళ్లుగా సినిమాలను నిర్మిస్తూ, పంపిణీ చేస్తోంది. 'వండర్ ఉమన్', 'ఫ్రెండ్స్' (టీవీ), 'హ్యారీపాటర్' ఈ సంస్థ నుంచి వచ్చినవే. యాన్ సర్నాఫ్‌కు ముందున్న సీఈవో కెవిన్ సుజిహరా ఒక నటికి ఉపాధి కల్పిస్తానని ఆశ చూపించి ఆమెను లోబరుచుకున్నారన్న ఆరోపణలు రావడంతో గత మార్చిలో పదవి నుంచి వైదొలగవలసి వచ్చింది.

## రండి.. కూర్చోండి



● ఎయిర్‌పోర్ట్ నుంచి నడుచుకుంటూ బయటికి వస్తున్న దీపికా పడుకోన్



ఫొటోగ్రాఫర్‌లు వెంట పడుతున్నప్పుడు సినీ సెలబ్రిటీలు వీలైనంతవరకు నవ్వుముఖంతో ఉండేందుకే ప్రయత్నిస్తారు. మరీ ఇబ్బందిగా అనిపించినప్పుడే కాస్త రుసరుసలాడతారు. దీపికా పడుకోన్ సోమవారం రాత్రి ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయి, తన కారు సిద్ధంగా ఉన్న చోటుకు నడుచుకుంటూ వెళుతున్నంతసేపూ ఫొటోజర్నలిస్టులు తమ కెమెరాలను క్లిక్.. క్లిక్ మనిపిస్తూనే ఉన్నారు. సిల్వర్ కలర్ ప్యాంట్, వైట్ టీ షర్ట్‌లో 'టక్' చేసుకుని, నల్ల కళ్లద్దాలు పెట్టుకుని స్టైయిల్‌గా అడుగులు వేస్తున్న దీపిక.. వాళ్ల వైపు చూసీ చూడనట్లు, నవ్వీ నవ్వనట్లు నడుస్తూ కారు దగ్గరికి రాగానే.. కారు వైపు చేతిని చూపిస్తూ.. నవ్వు ముఖంతో ''ఆజా.. బైఠ్ జా'' అని అనడంతో ఫొటో జర్నలిస్టుల ముఖాలు కూడా ఫ్లాష్ అయ్యాయి. ఈ వీడియో గత ఇరవై నాలుగు గంటలుగా వైరల్ అవుతోంది. ఎక్కువ శాతం మంది దీపిక గొప్పతనాన్ని ప్రశంసిస్తుంటే.. కొంతమంది మాత్రమే 'దీపిక.. ఫొటో జర్నలిస్టులను అవమానించారు. తన కోపాన్ని చిరునవ్వుతో వ్యక్తం చేశారని ఈజీగా తెలిసిపోతోంది. 'ఎంతసేపని నన్ను ఫాలో అవుతారు. వచ్చి కారులో కూడా కూర్చుంటారా ఏంటీ..!' అని అర్థంలో దీపిక అలా 'రండి.. వచ్చి కూర్చోండి' అన్నారు'' అని ఆమెను విమర్శిస్తున్నారు.

# పాపా..! చెప్పేది నీక్కాదూ?



**మళ్లీ గర్భం దాల్చినప్పుడు తల్లి మొదట ఆ వార్త చెప్పాల్సింది భర్తకు కాదు.**
**మొదటగా పుట్టిన సంతానానికి.**
**ఇంట్లోకి కొత్త సభ్యుడు వస్తున్నాడంటే ఉన్నవాళ్లను మైనస్ చేయడానికి కాదు.**
**ఉన్నవాళ్లతో ప్లస్ కావడానికి.**
**అందుకు ప్రిపేర్ కాని పిల్లలు, ప్రిపేర్ చేయని తల్లిదండ్రులు**
**ఇంట్లో అశాంతిని ఆహ్వానిస్తారు.**
**డెలివరీ డేట్ తెలియడానికంటే ముందు తెలియాల్సింది**
**పిల్లల మనసు ఎలా ఉందనే.**

ఊయలలో పాప కేరింతలు కొడుతోంది. మరి కాసేపటికి పాల కోసం ఏడ్వొచ్చు. పాలు పట్టి రెండు గంటలు అయ్యింది. మళ్లీ పట్టాలి. ఆ పనిలో ఉంది సునంద. కాని పెద్ద పాప వచ్చి ఒకటే డౌట్లు...

'అమ్మా... టీవీలో ఆ సినిమా పేరేమిటి?'

'అమ్మా.. పుస్తకంలో ఈ కథ చెప్పవా?'

'అమ్మా... నాన్న ఎప్పుడొస్తాడు'...

'అమ్మా... నాకు పాలు కావాలి'...

తల్లికి ఆ ఐదేళ్ల పెద్ద పాప సంగతి తర్వాత చూద్దాం ముందు చిన్న పాప సంగతి చూద్దాం అనే తొందర ఉంది.

'అబ్బా... అడ్డం పడకు పాపా. చిన్నికి పాలు పట్టనీ'

'అది తర్వాత. ముందు నాకు పాలు కావాలి'

'ఏయ్.. చెప్తే నీక్కాదూ'

పెద్ద పాప సైలెంట్ అయిపోయింది. బొమ్మ తీసుకెళ్లి మూల కూచుంది. పెద్ద పాప మనసులో ఏముందో ఎవరికి తెలుసు?

* * *

పెద్ద పాపకు ఇప్పుడు ఎనిమిదేళ్లు వచ్చాయి. చిన్న పాపకు మూడేళ్లు వచ్చాయి.

'అమ్మా... బాత్‌రూమ్‌లో నీళ్లు రావడం లేదు'

'వస్తాయి చూడు' చిన్న పాపను ఒళ్లో కూచోబెట్టుకున్న తల్లి అంది.

'లేదు రావడం లేదు'

'వస్తాయి చూడు'

'రాలేదంటున్నానా'

తల్లి చిన్నపాపను కింద కార్పెట్‌మీద బోర్లా వేసి వచ్చి బాత్‌రూమ్‌లో ట్యాప్ తిప్పింది. నీళ్లు వస్తున్నాయ్. తల్లికి చాలా కోపం వచ్చింది.

'కొట్టానంటే చూడు' చిన్నగా మొట్టి 'స్నానం చేసి త్వరగా రా' అని వచ్చేసింది.

ట్యాప్‌లో నుంచి నీళ్లు ధారగా కారుతున్నాయి. పాప కంట్లో నుంచి కూడా.

* * *

పక్కింటి వాళ్లు తల్లికి ఫోన్ చేశాడు.

'మీ అమ్మాయి మా కుక్క దగ్గరకు వెళ్లిపోయిందండీ. అది గీరేసింది' కంగారుగా చెప్పారు.

తల్లి పరిగెత్తింది.

పక్కింట్లో పెద్ద ఆల్సేషియన్ కుక్క ఉంది. దానిని ఎప్పుడూ కట్టేసే ఉంటారు. పెద్ద పాప అక్కడకు వెళ్లినా ఎప్పుడూ కుక్క దగ్గరకు పోదు. కాసేపు ఆడుకుని వచ్చేసేది. కాని ఆ రోజు ఎందుకు వెళ్లిందో వెళ్లింది. ఆల్సేషియన్ కుక్క కరవాలని లేదుకానీ ఆటగా పైన కాళ్లు వేసింది. ఒళ్లు గీరుకుపోయింది.

తల్లి కంగారుగా వచ్చి ఏడుస్తూ పాపను చుట్టేసింది. తల్లి అలా ఏడుస్తూ తనను చుట్టుకోవడాన్ని పాప చాలా సంతృప్తిగా చూస్తూ ఉంది.

* * *

'పెద్ద పాప బిహేవియర్‌లో చాలా మార్పు ఉందండీ. మనం ఒకసారి సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళదాం' అంది తల్లి.

తండ్రి కూడా ఆ మార్పు గమనించాడు.

'అదే చాలా చిత్రంగా ఉంది. తప్పకుండా తీసుకెళదాం' అన్నాడు.

ఆ మరుసటి రోజే వారు పాపను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లారు.

సైకియాట్రిస్ట్ పాప బిహేవియర్ కంటే ముందు ఇంటి నేపథ్యం తెలుసుకుంది.

* * *

ఇదీ నేపథ్యం:

సునంద, శ్రీరామ్‌లకు పెళ్లయ్యింది కాని పిల్లలు పుట్టలేదు. శ్రీరామ్ ఆ ఇంట్లో పెద్ద కొడుకు. సునంద తన ఇంట్లో ఒక్కతే కూతురు. కనుక వారిద్దరికీ పుట్టే సంతానం కోసం ఇరు కుటుంబాల వారూ ఎదురు చూస్తున్నారు. కాని వాళ్లకు పుట్టలేదు. దాదాపు ఎనిమిది తొమ్మిది సంవత్సరాలు దాటిపోయాయి. కాని పుట్టలేదు. అందరూ ఎంతో నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయారు. ఇక పుట్టరేమో అనుకున్నారు. చివరకు తొమ్మిదో ఏట చివరలో సునంద గర్భం దాల్చింది. ఆ తర్వాత పాపను కంది. ఇక ఇరు వర్గాల వారి సంతోషానికి అవధులు లేవు. పాపను కాలు కందకుండా పెంచారు. గారాబం చేశారు. అసలు ఆ అమ్మాయికి దక్కనిదంటూ లేదు. ప్రేమ.. ప్రేమ.. అందరి ప్రేమా ఆ అమ్మాయికే. ఇంకో బిడ్డ మరి పుట్టకపోవచ్చు అని పెద్ద పాపనే ప్రాణంగా చేసుకున్నారు. అయిదేళ్లు గడిచిపోయాయి. సునంద మళ్లీ గర్భం దాల్చింది. రెండోసారి కూడా ఆడపిల్లనే కంది. ఒక పాపే పెన్నిధి అనుకుంటే దైవం మరో పాపను ఇచ్చినందుకు సునంద, శ్రీరామ్‌లు ఎంతో సంతోషించారు. రెండోపాప ముద్దు మురిపాలలో మునిగారు. కాని వారు పెద్ద పాపను నిర్లక్ష్యం చేయలేదు. ఎప్పటిలానే చూశారు. కాని ఆమె సమయంలో సగం చిన్నపాపకు ఇచ్చారు. అంతవరకూ తాను చూసిన తల్లిదండ్రులకు, అమ్మమ్మ తాతయ్యలకు, నానమ్మ తాతయ్యలకు చిన్న పాప పుట్టిన తర్వాత చూస్తున్న అదే మనుషులకు ఎంతో తేడా ఉన్నట్టు పెద్ద పాప భావించింది. ఇక ఆ ఇంటికి తన అవసరం తీరిపోయిందేమో అని భయపడింది. అన్నింటి కంటే ముఖ్యం తనని ఎవరికైనా ఇచ్చేస్తారమో అని ఆందోళన చెందింది. తల్లిప్రేమ కోసం, అటెన్షన్ కోసం ప్రయత్నించింది. కాలికి చేతికి అడ్డం పడింది. పదే పదే పిలిచింది. తన వైపు చూడమని కోరింది. అవన్నీ జరగడం లేదని సందేహించి రిస్క్ చేయడానికి కూడా వెనుకాడక కుక్క దగ్గరకు పరిగెత్తింది. ఇవన్నీ చేస్తున్నది కేవలం ప్రేమ కోసం, భద్రత కోసం, తాను ఎక్స్‌క్లూడ్ కాలేదన్న భరోసా కోసం.

* * *

సైకియాట్రిస్ట్ సునందను, శ్రీరామ్‌ను కూచోబెట్టుకుని చెప్పింది.

'చూడండి... మళ్లీ ప్రెగ్నెన్సీ వచ్చిందని తెలియగానే డాక్టర్ చెకప్‌కు వెళ్లడం గురించి, తీసుకోవాల్సిన ఆహారం గురించి, వేసుకోవాల్సిన మందుల గురించి ఆలోచించే దాని కంటే ముందు అప్పటికే పుట్టి ఉన్న అబ్బాయికి అమ్మాయికి ఆ విషయం అర్థమయ్యేలా చెబుతున్నామా లేదా అనేది చూసుకోవాలి. ఇంటికి కొత్త సభ్యుడు వస్తున్నాడని బాబో పాపో వచ్చి నీతో ఆడుకోబోతున్నారని చెప్పాలి. గర్భంలో ఉన్న బిడ్డను ఆ పిల్లలు పై నుంచి తాకేలా చేసి అనుభూతి చెందనివ్వాలి. పుట్టబోయే చెల్లాయి/తమ్ముడి గురించి కబుర్లు చెప్తూ వారిని మానసికంగా సిద్ధం చేయాలి. 'పాప పుట్టినా బాబు పుట్టినా చూసుకోవాల్సింది నువ్వే' అని వారికి బాధ్యత అప్పజెప్తున్నట్టుగా చేయాలి. అంతే కాదు పుట్టాక వారితో ఎలా మాట్లాడాలి, ఎలా ఆడుకోవాలి ఇవన్నీ దగ్గరుండి నేర్పించాలి. ఇద్దరికీ ఒకరి మీద మరొకరి ప్రేమ పుట్టేలా మాట్లాడాలి. ఒకరికోసమే మరొకరు భూమ్మీదకు వచ్చారని చెప్పాలి. అవన్నీ చేయకుండా చిన్న వారి పెంపకంలో మునిగిపోతే పెద్దవారు నిస్పృహ చెందుతారు. ఇక మీదట మీ తప్పును సరిదిద్దుకోండి. పెద్ద పాపను చిన్న పాపను కలిపి ఉంచండి. వారిని అన్ని సమయాల్లో ఒకేలా ట్రీట్ చేయండి. చిన్నపాప నిద్రపోతున్న సందర్భాల్లో పెద్ద పాపతో మాట్లాడటం దగ్గర తీసుకోవడం, కోరింది తినిపించి ఇక ఆడుకో పాప పనులు చూసుకోవాలి అని అర్థమయ్యేలా చెప్పడం చేస్తే అన్నీ సర్దుకుంటాయి' అని చెప్పింది.



'పాప పుట్టినా బాబు పుట్టినా చూసుకోవాల్సింది నువ్వే' అని వారికి బాధ్యత అప్పజెప్తున్నట్టుగా చేయాలి. అంతేకాదు, పుట్టాక వారితో ఎలా మాట్లాడాలి, ఎలా ఆడుకోవాలి ఇవన్నీ దగ్గరుండి నేర్పించాలి. ఇద్దరికీ ఒకరి మీద మరొకరి ప్రేమ పుట్టేలా మాట్లాడాలి. ఒకరికోసమే మరొకరు భూమ్మీదకు వచ్చారని చెప్పాలి. అవన్నీ చేయకుండా చిన్నవారి పెంపకంలో మునిగిపోతే పెద్దవారు నిస్పృహ చెందుతారు. ఇక మీదట మీ తప్పును సరిదిద్దుకోండి.

సునంద, శ్రీరామ్‌లకు తమ బాధ్యత తెలిసి వచ్చింది.

అల్లారుముద్దుగా పెంచుకున్న పెద్ద పాప లోపల ఇంత ఆందోళన ఉందా అని బాధపడ్డారు.

కొన్నాళ్లకు ఆ ఇంట్లో నాలుగు పాదాల పట్టీలు చాలా ఉత్సాహవంతంగా సందడి చేయడం అందరూ విన్నారు.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **డా. పద్మ పాల్వాయి**, సైకియాట్రిస్ట్

సాహితీ శిక్షణ

# గోదావరీ తీరం రెండో ఆదివారం

## బులుసు మాస్టారి తెలుగు శిక్షణాతరగతులు

**తెలుగువారి సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో, ఒక నగరపాలక సంస్థ పాఠశాలలో అదోతరగతి గది... ఆ గదిలో ప్రతినెలా రెండో ఆదివారం జరిగే తరగతికి హాజరయ్యేవారిలో షష్టిపూర్తి అంటే 60 ఏళ్లు దాటినవారు, సప్తతి అంటే 70 ఏళ్లు పూర్తి చేసుకున్నవారు, సహస్ర పున్నమి దర్శనానికి అంటే దాదాపు 83 ఏళ్లు ఉన్నవారు విద్యార్థులు. అయితే, ఆ తరగతికి హాజరయ్యేవారందరూ వయోవృద్ధులేమీ కాదు... నూనూగు మీసాల యౌవన దశకు చేరున్న యువకులు, అప్పుడే కౌమారదశకు చేరుకున్న అమ్మాయిలు కూడా అక్కడ విద్యార్థులే. ఉద్యోగాలు చేసి, రిటైరయిన వారు, ఇంకా ఉద్యోగపర్వంలోనే ఉన్నవారు, ఉద్యోగార్థులు, విద్యార్థులు అందరూ అక్కడ ఎంతోఉత్సాహంగా హాజరవుతూంటారు. అయితే, ఎక్కువ మంది వయోవృద్ధులే! ఇక, ఈతరగతిలో వీరందరూ సేదతీరేది సాహితీ వ్యాసంగంతో.. నిర్వహించుకునేది సాహితీ సేద్యం.. ఎలాగంటారా?**



● తరగతి గదిలో రచయితల సమితి సమావేశం- స్వీయ రచనలు విని పించడానికి వచ్చిన కవులు

● పార్కులలో పచ్చిక బయళ్ళపై సమావేశం-కవితలు వినిపించడానికి వచ్చిన కవులు



● సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.వి.యస్. మూర్తి

గోదావరీ తీరాన నెలకొని ఉన్న రాజమహేంద్రవరంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో, సంస్కృతాంధ్రాలు బోధించే గౌతమీ ఓరియంటల్ కళాశాల ఒకటి. ఎందరో మహా మహోపాధ్యాయులు ఇక్కడ పాఠాలు చెప్పేవారు. బులుసు మాస్టారు ఇక్కడ తెలుగు, ఆంధ్రుల చరిత్ర బోధించేవారు. (ప్రస్తుతం ఈ కళాశాల మూతబడింది). ఆ సమయంలో ఆయన విద్యార్థులలో అంతో ఇంతో సాహిత్యాభిమానం లేకపోలేదు, కానీ వారికి అందుబాటులో ఒక వేదిక లేదు, వారిని ప్రోత్సహించేవారు లేరని గమనించారు. 1992లో తెలుగు భాషాభివృద్ధికి కళాగౌతమి సంస్థను స్థాపించి, నిరంతరాయంగా సాహితీకార్యక్రమాలు నిర్వహిస్తున్నా, కేవలం యువతలో రచనాసక్తిని పెంపొందించడం కోసం 2004లో ప్రత్యేకంగా రచయితల సమితిని స్థాపించారు. తొలి సమావేశం యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం స్థాపించిన పురమందిరంలో జరిగింది.

### ఇంతింతై.. వటుడింతై...

తొలి సమావేశానికి కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ఛందస్సును కూడా ఇక్కడ మూర్తి బోధించేవారు. అలా హాజరైన వారిలో పాతికేళ్ళ ప్రాయం రాకుండానే పాతికపైగా అష్టావధానాలు చేసిన తాతా సందీప్ ఒకరు. ఇక్కడ ఛందో తరగతులకు హాజరై, శతక రచనలు చేసిన కవులు ఉన్నారు. అయితే, మౌఖిక ప్రచారం ద్వారా వచ్చే వారి సంఖ్య ప్రతినెలా పెరుగుతూ వచ్చింది. ఒక్క రాజమహేంద్రవరం నుంచి మాత్రమే కాకుండా, జిల్లాలోని అమలాపురం, అనపర్తి, కోటిపల్లి, మండపేట, సీతానగరం తదితర ప్రాంతాలనుంచి సైతం ఔత్సాహికకవులు రావడం ప్రారంభమైంది.. అంతేకాదు, కార్యక్రమాల ఒరవడి తెలుసుకుని, కొన్ని సందర్భాలలో విజయవాడ, శ్రీకాళం తదితర సుదూర ప్రాంతాలనుంచి ఔత్సాహికులు వచ్చి, స్వీయ కవితలను వినిపించేవారు. ప్రతినెలా ఒక అంశాన్ని రెండో ఆదివారానికి పదిరోజుల ముందుగానే రచయితలకు ఇచ్చేవారు. రెండో ఆదివారం ఆ అంశంపై కవులు స్వీయరచనలు వినిపించాలి. పద్య ప్రక్రియలోనే చెప్పాలి, కవితరూపంలోనే చెప్పాలి... వంటి ఆంక్షలు లేవు. రచయిత తనకు నచ్చిన సాహితీ ప్రక్రియను ఎంచుకోవచ్చును. అంతేకాదు, ఇచ్చిన అంశంపై రచనలతో రానివారు, తమకు నచ్చిన అంశాలపై కూడా రచనలు వినిపించ వచ్చును. స్వీయరచనలను కవులు వినిపిస్తున్న సమయంలో మూర్తి అవసరమనుకుంటేనే సూచనలు చేస్తారు.

ఔత్సాహిక రచయితలకు మరింత ప్రోత్సాహాన్ని అందించడానికి మూర్తి శ్రీకళాగౌతమి అనే పత్రికను ప్రారంభించి, ఇందులో రచయితల సమితి సమావేశాల్లో కవులు వినిపించిన కవితలను, పద్యాలను ముద్రిస్తున్నారు. తమ రచనలు ప్రజాబాహుళ్యంలోకి వెళ్ళడం రచయితలకు సహజంగా తృప్తిని కలగచేస్తోంది. ప్రతి నెలా రెండో ఆదివారం కోసం ఈ రోజున భాషాభిమానులు ఎదురు చూసే స్థాయికి రచయితల సమితి చేరుకుంది. యువతకోసం స్థాపించిన ఈ సంస్థలో నేడు అధికభాగం వయోవృద్ధులే హాజరవుతున్నారు. యువత ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో లేకపోయినా, అంతో ఇంతో లేకపోలేదు. యువత భాగస్వామ్యం పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ రంగసంస్థల విశ్రాంత ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, గృహిణులు, అధ్యాపకులు ఎక్కువగా ఈ సమావేశాలకు హాజరవుతున్నారు.

### నేటికీ గూడు కరువే...

ఈ కార్యక్రమాలు కేవలం సాహిత్యంమీద ఆసక్తితో చేసేవి, సహజంగా వేదిక ఉచితంగా లభ్యం కావాలి. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఎన్నో ఆడిటోరియమ్‌లు, మినీ ఆడిటోరియంలలో ఆక్యుపెన్సీ చాల తక్కువగా ఉన్నాయన్నది బహిరంగ సత్యం. మూర్తి అర్ధాంగి హేమలత కూడా ప్రభుత్వ అటానమస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేసి, పదవీ విరమణ చేసినవారే. ఇద్దరికీ నెలనెలా పెన్షన్ వస్తోంది. ఈ భరోసాతోనే ఆయన సాహితీకారులకు ఒక వేదికను కల్పించాలని, ఔత్సాహికులకు ప్రోత్సాహం కల్పించాలని ఆరాటపడ్డారు. ఈ ధ్యేయంతో మూర్తి వేదిక కోసం గత 15 సంవత్సరాలలో 12 గడపలు మారారు. కొన్ని సందర్భాలలో పార్కులలో పచ్చిక బయళ్ళ మీద కూర్చుని సాహితీ కార్యక్రమాలు నిర్వహించుకునేవారు. వయోవృద్ధులు అవస్థలు పడుతూనే స్వీయరచనలు వినిపించేవారు.

### ఒక కుటుంబంలా మారింది

రచయితల సమితికి ప్రతినెలా హాజరయ్యేవారి సంఖ్య పెరగడం చూస్తుంటే, వారిలో సాహిత్యాభిమానం వారిని ఒక కుటుంబంలా మారుస్తోందని అనుకుంటున్నాను. నాలుగు కవితలు వినిపించాలని సుదూరప్రాంతాలనుంచి వయోవృద్ధులు సైతం వస్తున్నారు. వారి కోరిక ఒకటే– నలుగురి ముందు తమ రచనలు వినిపించాలని, ఎదుటి వారి రచనలను తాము ఆస్వాదించాలని. సాహితీ సమావేశాలకు ప్రత్యేకంగా సొంతగూడు ఏర్పడే కాలం సమీపంలోనే ఉందని ఆశిస్తున్నాను.

– డాక్టర్ బులుసు వేంకట సత్యనారాయణ మూర్తి
వ్యవస్థాపకుడు, కళాగౌతమి, రచయితల సమితి

– **వారణాసి సుబ్రహ్మణ్యం,**
సాక్షి సాంస్కృతికం, రాజమహేంద్రవరం
ఫొటోలు: **గరగ ప్రసాద్**

చెట్టు నీడ

## గణ నాయకత్వం

దేవపుత్రుడు గురువుగారైన ఈశ్వరదత్తుతో.. ''గురువుగారూ! మీ బోధలు శ్రద్ధగా వింటున్నాను. పదేళ్లనుంచి మీ శుశ్రూష చేసుకుంటున్నాను. గురుమాత కూడా నన్ను ప్రేమగా చూసుకుంటున్నారు. మీ సేవలోనే ఈ దశాబ్దం ముగిసిపోయింది'' అన్నాడు.

గురువుగారు వింటున్నారు.''గురువుగారూ! నన్ను ఈ శిష్యగణానికి నాయకుణ్ణి చెయ్యండి. మీ నుంచి జ్ఞానాన్ని సంపాదించాను. ఆశ్రమంలో ఎక్కడేముందో తెలుసు. మీకు, గురుపత్నికీ ఎప్పుడు ఏ సేవలు చెయ్యాలో తెలుసు'' అన్నాడు. గురువుగారు మాట్లాడలేదు!

ఏడాది గడిచింది. శిష్యుని కోరిక తీరలేదు. మళ్లీ గురువుగారినడిగాడు. గురువుగారిది అదే మౌనం. పట్టు విడవకుండా.. గురుకులాన్ని విడవకుండా, గురుబోధలు వింటూనే మరో ఏడాది గడిచింది. అయినా గురువుగారు కరుణించలేదు. తన కోరిక తీరలేదు. 'గురువుగారెందుకు తన కోరిక తీర్చలేదు?' అని శిష్యుడు ఆలోచించడం మొదలు పెట్టాడు. తనలో ఉన్నది గణముఖ్యుడు కాలేదన్న అసంతృప్తి. ఆ అసంతృప్తికి మూలం కోరిక. కోరికలే లేకపోతే తీరలేదనే బాధ ఉండదు. అప్పుడు గణ ముఖ్యుడైనా, సభ్యుడైనా ఒక్కటే. తృప్తిగా, సంతోషంగా ఉండడం ముఖ్యం. కావాలనే కోరిక లేకపోవడాన్ని మించిన ఆనందమే ముంటుంది అనుకోగానే గురువుగారెందుకు కరుణించలేదో అర్థమైపోయింది. శిష్యునిలోని మార్పును గమనించాడు గురువు. ఒకరోజు శిష్యుని పిలిచి ''నాయనా! దేవపుత్రా! నువ్విప్పుడు శిష్యగణ నాయకత్వానికి అర్హుడవయ్యావు. రేపే నిన్ను శిష్యగణనాయకునిగా ప్రకటిస్తాను'' అన్నారు.

దేవపుత్రునిలో సంతోషమూ, దుఃఖమూ కాని మధ్యస్థానుభవం కలిగింది. గురువుగారికి సాష్టాంగపడ్డాడు.

– **విశ్వేశ్వర వర్మ భూపతిరాజు**




సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
27-6-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అమ్మాయిని ఐదేళ్లుగా లవ్ చేస్తున్నాను. కానీ ఆ అమ్మాయికి లవ్ అంటే నమ్మకం లేదట. నాకేమో ఆ అమ్మాయి అంటే ప్రాణం. తనని మర్చిపోలేక పోతున్నాను. రీసెంట్‌గా తనతో మాట్లాడి.. 'నా లవ్ నీకు అర్థం కావట్లేదా?' అని అడిగాను. 'నీదీ ఓ లవ్వేనా?' అంది. నిజానికి టూ ఇయర్స్ ముందు నేను ఓ ఘోరమైన తప్పు చేశాను. టూ మంత్స్ ఒక అమ్మాయితో ట్రావెల్ అయ్యాను. ఆ విషయాన్ని తప్పుగా అనుకుందో ఏమో..?' అనిపిస్తోంది. ఈ గిల్టీ ఫీలింగ్‌తో చచ్చిపోవాలనిపిస్తోంది. కానీ నా జీవితంలో సిన్సియర్‌గా లవ్ చేసింది ఈ అమ్మాయిని మాత్రమే. ఇప్పుడు ఈ అమ్మాయి నా మీద ఇష్టం లేక లవ్ చేయడం లేదో.. లేక వేరే అమ్మాయితో తిరిగినందుకు లవ్ చేయడం లేదో.. అర్థం కావడం లేదు. ఓ మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– మహేశ్వర్

ఏం లవ్ స్టోరీలన్నా మీవి? వింటుంటే నాకే కిర్రు–కిర్రుమంటుంది.

*'ఏంటి సార్ దెయ్యం సినిమా చూసినట్టు కిర్రు కిర్రుమంటుంది అంటున్నారు?'*

ఏం చేయమంటావు నీలూ? బుర్రలో ఆయిల్ అయిపోయినట్లు ఉంది.

*'తుప్పు పట్టిందా సార్ బ్రెయిన్‌కి?'*

అలాగే అనుకో నీలూ! లేకపోతే ఫైవ్ ఇయర్స్ ప్రేమించి టూ మంత్స్ కోసం.. ట్రాక్‌లో ఇంకో అమ్మాయిని దించడం ఎంత సిల్లీ నీలూ? పోనీ తప్పు ఒప్పుకున్నాడు కదా అని.. అమ్మాయి క్షమిస్తే కుక్క తోక స్ట్రెయిట్ అవ్వదని.. నమ్మకం ఉండదు కదా నీలూ?!

*'సార్! మీరు చాలా ఇంపార్టెంట్ విషయం మిస్ అవుతున్నారు సార్! కుక్క తోక వంకర కావచ్చు కానీ.. హార్ట్ చాలా లాయల్ సార్! ఆ అమ్మాయి హార్ట్ చూడకుండా టెయిల్ ఎందుకు చూస్తుంది సార్?'*

హార్ట్ కనపడదు నీలూ..! టెయిల్ కనబడుతుంది!!

*'అంటే ఫైవ్ ఇయర్స్ సిన్సియర్‌గా ప్రేమించింది కనపడదు కానీ టూ మంత్స్ వంకర బుద్ధి కనబడుతుందా సార్? అలా అయితే ఇప్పుడు మహేశ్వర్ క్యా కర్నా సార్? ఏం చేయవలెను?'*

క్షమించలేని అమ్మాయి ప్రేమించ లేదు..! ప్రేమించలేని అమ్మాయి క్షమించ లేదు..!!

*'అంటే.. అమ్మాయికి ప్రేమ లేదని తెలుసుకుని.. ఇంకో టూ మంత్స్ వేరే టెయిల్స్‌లో ఉండమని చెబుతున్నారు!'.*

lovedoctorram@sakshi.com



● చిరంజీవి

## ఉగాది కానుక

షూటింగ్ ఇంకా షురూ చేయలేదు. కానీ ప్రణాళిక మాత్రం పక్కాగా సిద్ధం చేస్తున్నారు దర్శకుడు కొరటాల శివ. 'సైరా' తర్వాత కొరటాల దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించనున్నాయి. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఉగాదికి (2020 మార్చి 25) రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో చిత్ర బృందం ఉందని తెలిసింది. సామాజిక అంశాలతో ఈ చిత్రం స్క్రిప్ట్‌ను రూపొందించారట కొరటాల శివ. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా అమిత్ త్రివేది పేరుని పరిశీలిస్తున్నారట. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ప్రకటించలేదు.

## నా నటనలో సగం క్రెడిట్ అతనిదే

– రామ్



● మన్యం విజయ్‌కుమార్, నివేదా థామస్, రామ్, వివేక్ ఆత్రేయ, నారా రోహిత్, శ్రీ విష్ణు

‘‘సినిమా రిలీజైన తర్వాత తెలుస్తుంది.. మనం చిన్న సినిమా చేశామా? పెద్ద సినిమా చేశామా? అని. 'మెంటల్ మదిలో' సినిమా చూశా. వివేక్ ఆత్రేయ చాలా బాగా తీశాడు. ఇలాంటి ప్రతిభ ఉన్న డైరెక్టర్‌కి 'బ్రోచేవారెవరురా' సినిమాకి మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులు కుదిరారు'' అన్నారు హీరో రామ్. శ్రీవిష్ణు, నివేదా థామస్ జంటగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. విజయ్ కుమార్ మన్యం నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో రామ్ మాట్లాడుతూ– ''నిన్నుకోరి'లో తొలి షాట్ చూసిన తర్వాత నివేదా మంచి నటి అని తెలిసింది. వివేక్ మ్యూజిక్ బావుంటుంది. నా ఫేవరేట్ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి. 'ఎందుకంటే ప్రేమంట' సినిమాలో 'తదుపరి జన్మకైనా...' పాట రాశారు. ఈ సినిమాకి కూడా మంచి పాటలు రాశారు. శ్రీవిష్ణుని ఫస్ట్ టైమ్ 'ఉన్నది ఒక్కటే జిందగీ' టైమ్‌లో కలిశా. ఆ సినిమాలో నా నటనలో సగం క్రెడిట్ శ్రీవిష్ణుదే. తను చాలా మంచి నటుడు. నాకు నటన నేర్పించిన అరుణ భిక్షుగారు ఈ చిత్రానికి చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''మంచి సినిమాలు తీయగానే సురేష్ బాబుగారిలాంటి వాళ్లు ఇన్వాల్వ్ అయి సపోర్ట్ చేస్తున్నారు.. ఇందుకు చాలా హ్యాపీ. నేను చిన్నప్పటి నుంచి వెంకటేష్‌గారికి వీరాభిమానిని. ఈ సినిమాలో నేను ఆయన ఫ్యాన్‌గా చేయడం ఆనందంగా ఉంది. 'బ్రోచేవారెవరురా' కథని వివేక్ ఆత్రేయ చెప్పినప్పుడు చాలా నచ్చింది. మిత్ర పాత్రలో నివేదా బాగా నటించారు. ఆ పాత్రకోసం, కేవలం మహిళల కోసం ఈ సినిమా చేశా'' అన్నారు. ''ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు సురేష్ బాబు. ''మహిళలు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు నివేదా థామస్. ''విజువల్‌గా సినిమా రిచ్‌గా ఉంటుంది'' అన్నారు విజయ్ కుమార్ మన్యం. ''ఈ చిత్రం గురించి నేను మాట్లాడటం కన్నా సినిమా చూస్తేనే మంచిది'' అన్నారు వివేక్ ఆత్రేయ. ''ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని అనుకుంటున్నా'' అన్నారు నారా రోహిత్.

## మనం మళ్లీ కలుద్దామా?



● నాగార్జున

'మనం'తో అక్కినేని కుటుంబ సభ్యులకు ఒక స్పెషల్ చిత్రాన్ని ఇచ్చారు దర్శకుడు విక్రమ్ కె. కుమార్. ఆ తర్వాత అఖిల్‌తో 'హలో' తీశారు. తాజాగా విక్రమ్ కె. కుమార్, నాగార్జున కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కబోతోందని టాక్. ప్రస్తుతం 'మన్మథుడు 2' సినిమాతో బిజీగా ఉన్నారు నాగ్. ఆ తర్వాత కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో 'బంగార్రాజు' చిత్రం లైన్‌లో ఉంది. ఈ సినిమా తర్వాత విక్రమ్ కె.కుమార్ సినిమాను ట్రాక్ మీదకు తీసుకెళ్తారట నాగార్జున. ప్రస్తుతం నాని హీరోగా చేస్తోన్న 'గ్యాంగ్‌లీడర్'తో బిజీగా ఉన్నారు విక్రమ్. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి నాగార్జున చిత్రానికి స్క్రిప్ట్ రెడీ చేసే పనిలో ఉంటారట విక్రమ్.



● మేఘా ఆకాష్

## మేఘా ఇన్.. అమలా అవుట్

అమలాపాల్ హీరోయిన్‌గా ఎంపికైన సినిమాలో ఆమెకు బదులుగా హీరోయిన్ మేఘా ఆకాష్‌ను చిత్రబృందం ఫైనలైజ్ చేశారన్నది కోలీవుడ్ తాజా ఖబర్. విజయ్ సేతుపతి హీరోగా వెంకట్ కృష్ణన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ప్రారంభోత్సవం ఇటీవల చెన్నైలో జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. తొలుత ఈ సినిమాకి కథానాయికగా అమలా పాల్‌ను తీసుకున్నారు. కానీ ఇప్పుడు ఆమె ప్లేస్‌లోకి మేఘా వచ్చారని సమాచారం. ఆల్రెడీ ఊటీలో ఈ సినిమా చిత్రీకరణ కూడా జరుగుతోంది. అయితే.. సడన్‌గా ఇప్పుడు అమలా ఎందుకు ఈ సినిమా చేయడం లేదు అంటే... ఏదో కొత్త సినిమాకు సైన్ చేశారని కొందరు, రెమ్యునరేషన్ ప్రాబ్లమ్ అని మరికొందరు అంటున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం స్పందించలేదు.

## ప్రజాస్వామ్యం ధనస్వామ్యమైంది



● ఆర్. నారాయణమూర్తి

''ఓటు అనేది ఒక బ్రహ్మాస్త్రం. పవిత్రమైన ఓటు విలువ ఏంటి? భ్రష్టుపట్టిపోతున్న నేటి సమకాలీన రాజకీయాలు, అస్తవ్యస్తమైపోతున్న ప్రజాస్వామ్యాన్ని ఎలా మనం పరిరక్షించుకోవాలి?'' అనే నేపథ్యంలో మా 'మార్కెట్లో ప్రజాస్వామ్యం' సినిమా రూపొందింది అని ఆర్. నారాయణమూర్తి అన్నారు. ఆయన లీడ్‌రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా జూలై 12న రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో ఈ చిత్రాన్ని ప్రముఖుల కోసం ప్రదర్శించారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ– ''ఎన్నికల కోసం రాజకీయ నాయకులు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడంతో ప్రజాస్వామ్యం ధనస్వామ్యమైంది. భవిష్యత్తు తరాల మనుగడకి ఓటు ప్రాముఖ్యతను తెలియజేసే మా సినిమా అన్ని వర్గాలవారికీ నచ్చుతుంది'' అన్నారు. రాజకీయ నాయకులు వి.హనుమంతరావు, మధుసూదనాచారి, లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, గాజుల శ్రీనివాస గౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య, విమలక్క, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ తదితరులు సినిమాని చూసి, అభినందించారు.

''స్క్రిప్ట్‌లో దమ్ముంటేనే లిప్‌లాక్ సీన్స్‌లో నటిస్తా. అయితే అలాంటి సీన్లు చేసేవారిని నేను తప్పు పట్టడం లేదు. నా సినిమాలు చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకూ అందరూ చూడాలనుకుంటా'' అన్నారు ఆది సాయికుమార్. రచయిత 'డైమండ్' రత్నబాబు దర్శకునిగా పరిచయం అవుతున్న సినిమా 'బుర్రకథ'. ఇందులో ఆది సాయికుమార్, మిస్తీ చక్రవర్తి, నైరాశా హీరో హీరోయిన్లు. శ్రీకాంత్ దీపాల, కిషోర్, కిరణ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆది సాయికుమార్ చెప్పిన విశేషాలు.

## నాలో ఆ ఇద్దరూ ఉన్నారు



● ఆది సాయికుమార్

● చాలెంజింగ్ పాత్రలు చేసినప్పుడే మనలోని బెస్ట్ బయటకు వస్తుంది. ఈ సినిమాలో రెండు బుర్రలు ఉన్న అభిరామ్ క్యారెక్టర్ చేశాను. నాకు సవాల్‌గా అనిపించింది. రెండు పాత్రల మధ్య వేరియేషన్స్ సరిగా చూపించానా? లేదా? అనే విషయంలో ఆడియన్స్ ఎలా డిసైడ్ చేస్తారో అని భయంగా ఉంది.

● ఒక మనిషిలో రెండు బుర్రలు ఉన్నట్లు నేనొక ఆర్టికల్ చదివాను. ఈ కాన్‌ఫ్లిక్ట్ సబ్జెక్ట్‌ని సింపుల్‌గా, ఎంటర్‌టైనింగ్ వేలో చూపించారు రత్నబాబు. అభి, రామ్ క్యారెక్టర్ల విషయంలో ఆడియన్స్‌కు మొదటి 15 మినిట్స్‌లోనే క్లారిటీ వస్తుంది. అభిది జోవియల్ క్యారెక్టర్. రామ్ లోకజ్ఞానం తెలిసినవాడు. నాలో అభి–రామ్ ఇద్దరూ ఉన్నారు. అభి–రామ్ క్యారెక్టర్స్ మధ్య రాజేంద్రప్రసాద్‌గారు నలిగిపోవడం ఈ సినిమాలో హైలైట్‌గా ఉంటుంది. మా సినిమాతో పాటు మరో మూడు సినిమాలు విడుదలవుతున్నాయి. కానీ సోలో రిలీజ్ అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టం.

● ప్రేక్షకుల ప్రశంసలతో పాటు పేరు, డబ్బు... ఒక సినిమాకు ఈ మూడు అంశాలు వస్తే ఆ చిత్రం హిట్‌గా భావిస్తాను. 'ప్రేమకావాలి, లవ్లీ' సినిమాల తర్వాత ఆ రేంజ్ హిట్‌ని అందుకోలేకపోయాను. ఇందుకోసం ఎప్పటికప్పుడు నన్ను నేను మెరుగుపరచుకుంటూ హిట్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను.

● నేను అంగీకరించని సినిమాలు కొన్ని సూపర్‌హిట్ సాధించాయి. మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. నేను వదులుకున్న సినిమా హిట్ సాధించిందన్న బాధ నాకు లేదు. ఎందుకంటే మన జడ్జిమెంట్ అన్ని వేళలా కరెక్ట్‌గా ఉండదు. ఈ విషయంలో 'నీకు టేస్ట్ లేదు' అని మా సిస్టర్ నన్ను ఆటపట్టిస్తుంది.

● మా నాన్నగారికి (సాయికుమార్) కన్నడలో నటుడిగా మంచి పేరు ఉంది కదా అని నేను అక్కడ సినిమాలు చేయలేను. ముందుగా తెలుగులో మంచి హిట్ సాధించి, ఆ తర్వాత కన్నడగురించి ఆలోచిస్తాను. తెలుగు సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మా పాప నా షూటింగ్‌లకు వస్తోంది.

● నా కెరీర్‌లోని గ్యాప్‌ను నేను ప్లాన్ చేయలేదు. ప్రస్తుతానికి విలన్ పాత్రలు చేయాలనే ఆలోచన లేదు. కథ నచ్చితే మల్టీస్టారర్ సినిమాలు చేయడానికి ఆసక్తిగా ఉన్నాను. 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్'లో అర్జున్ పండిట్ అనే పాత్ర చేశాను. 'జోడి' ఆల్మోస్ట్ పూర్తయింది. ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో ఓ సినిమా చేస్తున్నాను.













సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
27-6-2019

# సిట్ రైట్ స్టాండ్ రైట్



**చిన్నప్పుడు మనందరి స్కూళ్లలోనూ పుస్తకాల్లోని పాఠాలు చెప్పడంతో పాటు డ్రిల్ పీరియడ్‌లో 'సిట్ రైట్... స్టాండ్ రైట్' అంటూ నిలబడాల్సిన తీరు, కూర్చోవాల్సిన రీతి... చెప్పేవారు. అలా నిటారుగా నిలబడటం, హుందాగా కూర్చోవడమూ లాంటి అనేక విషయాలు నేర్పేవారు. కానీ... ఇప్పుడు కొన్ని తరాల నుంచి బట్టీలు వేయించడం తప్ప బతుకు పాఠాలు చెప్పడం లేదు. 'సిట్... స్టాండ్... సిట్... స్టాండ్' లు లేక అందరూ వంగిపోతున్నారూ, ఒరిగిపోతున్నారు, కుంగిపోతున్నారు. దాంతో మెడ, నడుము, కండరాలు, ఒళ్లు నొప్పులు! ఆర్థ్రరైటిస్‌లాంటి అనేకానేక సమస్యలు!! నిత్యజీవితంలోని అనేక సందర్భాల్లో మనం ఎలా ఉండాలో, మన దేహాన్ని ఎలా ఉంచాలో, ఎలా వంచాలో, ఎలా వంచకూడదో వివరించే సమగ్ర కథనం ఇది.**

మీకు సరిగా నిలబడటం వచ్చా? మరి కూర్చోవడం? ఇక నడవడం?... ఇవేం ప్రశ్నలు అనుకుంటున్నారా? నిజం... ఈ రోజుల్లో చాలామందికి సరిగా నిలబడటం, కూర్చోవడం రాదంటే అతిశయోక్తి కాదు. అందుకే ఇటీవల చాలా చిన్న వయసులో ఉన్నవారు కూడా ఒళ్లునొప్పులనీ, కండరాల నొప్పులని అంటూ ఉంటారు. మీరు సరిగా నిలబడటం, కూర్చోవడం, ఒంగడం వంటివి చేస్తూ ఉంటే... మీ ఎముకలూ, కండరాలపై అదనపు బరువు పడకుండా కాపాడుకోవచ్చు. ఫలితంగా చాలాకాలం ఒళ్లు నొప్పులు రాకుండా చూసుకోవచ్చు. అసలు సరిగా ఎలా నిలబడాలో, వెన్నుపై భారం పడకుండా ఎలా కూర్చోవాలో, మెడ కండరాలపైనా, మెడ ఎముకలపైనా ఒత్తిడి పడకుండా ఎలా ఫోన్ మాట్లాడాలో, కార్, బైక్‌లో ఎలా కూర్చుని నడిపితే మీ వెన్నుపై బరువు పడకుండా ఉంటుందో.. ఇలాంటి అనేక విషయాలను తెలుసుకునేందుకే ఈ కథనం.

నిలబడటం, నడవడం, కూర్చోవడం, జారగిలపడటం ఇలా అన్ని రకాల శారీరక భంగిమల్లో (పోశ్చర్స్‌లో) మన కండరాలు, ఎముకలపైన ఒత్తిడి పడుతుంటుంది. దాంతో ఎప్పుడో వృద్ధాప్యంలో రావాల్సిన అరుగుదల సమస్యలను మనంతట మనమే చేజేతులారా కొని తెచ్చుకుంటున్నామంటే నమ్ముతారా? ఆ ఒత్తిడిని వీలైనంత తగ్గించగలిగితే మన కండరాలనూ, లిగమెంట్లనూ, టెండన్లనూ పటిష్ఠంగా ఉంచుకోవచ్చు. కండరాల నొప్పులు రాకుండా కాపాడుకోవచ్చు. దీనికి కావల్సిందల్లా మనం సరిగ్గా నిలబడటం, సరిగా కూర్చోవడంలో పాటించాల్సిన జాగ్రత్తలే. అంటే... మనం చేసే అన్ని పనుల్లోనూ మన ఒంటి భంగిమను (పోశ్చర్‌ను) ఎంత బాగా ఉంచుకుంటే అరుగుదల సమస్యలను (డీజనరేటివ్ ప్రాబ్లమ్స్‌ను) అంతగా నివారించుకోచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు.

## సరైన పోశ్చర్ అంటే...

మనపై భూమ్యాకర్షణ శక్తి అనుక్షణం పనిచేస్తూ ఉంటుందన్న విషయం మీకు తెలిసిందే. మనం నిలబడి/కూర్చుని/పడుకొని ఉన్నప్పుడు కూడా అది మన మీద ప్రభావం చూపుతూనే ఉంటుంది. ఎల్లప్పుడూ పడే దాని ప్రభావం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. అయితే మనం సరిగా నిలబడటం, కూర్చోవడం, ఫోన్ మాట్లాడటం, వాహనం నడపడం వంటివి చేస్తే ఎలాంటి అరుగుదల సమస్యలు లేకుండా చూసుకోవచ్చు. నొప్పులూ, బాధలూ లేకుండా హాయిగా ఉండవచ్చు. అలా ఎలా ఉండాలో తెలుసుకుందాం.

## సరిగా నిలబడండి... అదెలాగో తెలుసుకోండి

ఈ ప్రపంచంలోకి వచ్చాక...రెండు కాళ్లపై నిలబడటం మొదలుపెట్టిన నాటినుంచి ఏదైనా సమస్య ఉంటే తప్ప చివరి వరకూ అందరూ నిలబడతారు. ఇక కొన్ని వృత్తుల్లో ఉన్నవారు నిలబడే ఉండటం అనివార్యం. ఉదాహరణకు... ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసులు, పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, బస్ కండక్టర్లు, వంట చేసే గృహిణులూ, వంటవారు, సేల్స్‌గాళ్స్/సేల్స్‌బాయిస్, మెషిన్ ఆపరేటర్స్... ఇలా చాలామంది చాలాసేపు నిలబడే ఉండాలి. ఇలాంటి వారిలో కాళ్లపైనా, పాదాలపైనా ఒంటిబరువు చాలాసేపు పడటం వల్ల కాళ్లల్లో నిస్సత్తువ, కాళ్లవాపులు, వేరికోస్ వెయిన్స్, మెడనొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు.



డా. సుధీంద్ర ఊటూరి
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్




వెన్నుపై భారం పడకుండా మన డెస్క్‌పై వస్తువులు అమర్చుకోవాల్సిన తీరు

## కాళ్లపై అతి తక్కువ భారం పడేలా నిలబడటం ఎలా?

మంచి పోశ్చర్‌లో నిలబడటం వల్ల కాళ్లు, కండరాలు, నడుము, మెడ వంటి అవయవాలపై భారం తక్కువగా పడుతుంది. ఆ భారాన్ని తగ్గించడానికి ఇలా చేయండి...

- మీరు నిలబడి చేసే పనులకు ఉపయోగించే ప్లాట్‌ఫారాన్ని (ఉదాహరణకు వంట చేసే వారు వంట టేబుల్, నిలబడి డ్రాయింగ్ వేసేవారు తమ ప్లాంక్ వంటి వాటిని) తమ ఎత్తుకు తగినట్లుగా అడ్జెస్ట్ చేసుకోవాలి.
- మడమలను పూర్తిగా ఫ్లాట్‌గా ఉంచకుండా వాటికింద కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. అయితే మడమల కింద ఉంచుకునే ఎత్తు మరీ ఎత్తుగా ఉండకూడదు.
- మీరు నిలబడి మీకు ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫారమ్ మీద ఉన్న రకరకాల వస్తువులను అందుకునే సమయంలో, మీరు పూర్తిగా ఒంగి తీసుకునేలా వాటిని మరీ దూరంగా ఉంచుకోవద్దు. మీరు తేలిగ్గా తీసుకునేంత దూరంలోనే అవి ఉండాలి.
- మీ ప్లాట్‌ఫారమ్‌కు సరిగ్గా ఎదురుగా ఉండే మీ పనులు చేయండి. ఉదాహరణకు వంట లేదా డ్రాయింగ్ వంటివి చేసేప్పుడు మీ ప్లాట్‌ఫారానికి పక్కగా ఉండి చేయవద్దు.
- మీరు చాలాసేపు నిలబడి వంట చేస్తున్న లేదా ఏదైనా పనిచేస్తున్న సమయంలో మీ ఒంటి బరువును కాళ్లపై మార్చి మార్చి వేస్తుండండి. అంతేతప్ప... మొత్తం బరువును చాలాసేపు ఒకే కాలిపైన మోపకండి.
- మనం నిలబడి చేసే పనులు అంటే నిలబడి ఫ్లోరింగ్ శుభ్రం చేయడం (మాపింగ్, గార్డెనింగ్) వంటి పనులను నిటారుగా నిలబడే చేసేలా చూసుకోవాలి. అంతేగానీ చాలాసేపు వంగిపోయేలా ఉంచడం, తద్వారా వెన్నెముకపై భారాన్ని మోపడం కూడదు.

## సరిగా కూర్చోవడం ఎలా?




ఇప్పుడు కూర్చొని పనిచేసే ఉద్యోగాలే ఎక్కువగా ఉంటున్నాయి. నిజానికి మన పని ప్రదేశంలో (వర్క్‌ప్లేస్‌లో) సరిగా కూర్చోకపోవడమే చాలా రకాల సమస్యలకు మూలం. కంప్యూటర్‌పై పనిచేసేవారు మొదలుకొని బల్లపై కూర్చొని రాసే అనేకమందిలో సరిగా కూర్చోకపోవడం వల్లనే నడుమునొప్పి, కండరాల నొప్పులు, మెడ బిగుసుకుపోవడం (స్టిఫ్‌నెక్), పాదాలకు తిమ్మిరి పట్టడం వంటి సమస్యలు వస్తున్నాయి. ఇలా సుదీర్ఘంగా కూర్చోవడం వల్ల భవిష్యత్తులో డయాబెటిస్, గుండెజబ్బులు, కొన్ని మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మన కండరాలు, ఎముకలపై వీలైనంత తక్కువ భారం పడేలా కూర్చోవడం ఎలాగో చూద్దాం.

- కుర్చీలో వీలైనంత నిటారుగా కూర్చోవాలి. అంతేతప్ప భుజాలను వేలాడేసి లేదా ఒంగిపోయి కూర్చోవడం సరికాదు. దానివల్ల వెన్నుపై అనవసరమైన భారం పడుతుంది.
- మన ఎదురుగా ఉన్న బల్లపై మనం తరచు ఉపయోగించే వస్తువులను మూడు అంచెల్లో పెట్టుకోవచ్చు. మొదటి అంచెలో మనం నిత్యం అందుకునే వస్తువులు/పుస్తకాలు/ఉపకరణాలు ఉంచాలి. రెండో అంచెలో తరచూ ఉపయోగించేవి ఉంచుకోవాలి. ఎప్పుడోగాని ఉపయోగించని వాటిని మన డెస్క్/టేబుల్‌కు అటు చివర ఉంచాలి. ఇలా మన వస్తువుల అమరిక ఉండటం వల్ల... వస్తువులను అందుకునే సమయంలో వెన్నుపై భారం తగ్గుతుంది.
- మన కంప్యూటర్ సరిగ్గా మన కళ్లకు ఎదురుగా ఉండేలా చూడాలి. అంతే తప్ప మన మెడను బాగా ఎత్తిగానీ లేదా మరీ మెడను వంచిగానీ చూసేలా అమర్చుకోకూడదు.
- కీబోర్డు సౌకర్యంగా చేతులకు, వేళ్లకు అందేలా ఉండాలి. కీబోర్డుపై పనిచేసే పమయంలో మోచేతులకు సపోర్ట్ ఉండేలా కుర్చీ హాండ్‌రెస్ట్‌లను అమర్చుకోవడం వల్ల చేతులు అలసిపోకుండా చాలాసేపు పని చేయడానికి వీలవుతుంది.
- కంప్యూటర్‌పై పనిచేస్తున్నప్పుడు వీపు కుర్చీ బాక్ రెస్ట్‌కు ఆనించాలి. అలాగని కుర్చీ బ్యాక్‌రెస్ట్ వెనక్కువాలి ఉండకూడదు. పనిచేసే సమయంలో వెనక్కు ఆనకపోవడం వల్ల భుజాలు, మెడ, వెన్ను సమస్యలు వస్తాయి. నడుం కండరాలకు ఎక్కువ శ్రమ కలుగుతుంది. పని చేసే సమయంలో కుర్చీ బ్యాక్‌రెస్ట్‌ను నిటారుగానే ఉంచి, వీపును దానికి ఆనించి ఉంచాలి. అప్పుడు వీపుకు తగినంత సపోర్ట్ దొరికి, వెన్నుపై భారం తగ్గుతుంది.
- కూర్చొని ఉన్నప్పుడు కాళ్లను ఫుట్‌రెస్ట్‌పై కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. దాంతో వెన్ను/నడుము నొప్పి రాదు.
- కంప్యూటర్‌పై గంటసేపు పని తర్వాత 10 నిమిషాలు రెస్ట్ ఇవ్వాలి. ఆ 10 నిమిషాలు కూర్చుని ఉండకుండా లేచి అటు ఇటు తిరగడం మంచిది.

## మీ పాదరక్షలు ఎలా ఉండాలంటే...



మీరు నిలబడి పనిచేస్తున్నా లేదా కూర్చున్నా మీ పాదరక్షలు (షూస్ / చెప్పులు) ఎలా ఉండాలో తెలుసుకోండి. ఎందుకంటే మీ సరైన పోశ్చర్ కోసం అవి కూడా సరిగానే ఉండాలి.

- మీ పాదరక్షలు రెండూ సమానంగా ఉండి, అవి రెండు కాళ్లకు సరిగ్గా అమరేలా ఉండాలి.
- మీరు పాదరక్ష తొడిగాక అది మీ పాదాలతో మంచి గ్రిప్‌లో ఉండాలి. షూస్ లాంటివి మీ మడమ దగ్గర చాలా వదులుగా ఉంటే, అవి తేలిగ్గా పాదం నుంచి విడివడతాయి. అవి అలా ఉండకూడదు. అలాగని మరీ పాదాన్ని గట్టిగా కరచిపట్టుకొని కూడా ఉండకూడదు. గ్రిప్ ఉండాలి... దాంతోపాటు సౌకర్యమూ ఉండాలి.
- మీ పాదంలో నేలకు అంటకుండా ఆర్చ్ ఉండే భాగానికి సపోర్ట్ దొరికేలా మీ పాదరక్షలు/షూస్ ఉండాలి. పాదం నేలకు అంటని ఆర్చ్ వంటి భాగానికి సపోర్ట్ లేకపోతే మీ అచిలిస్ టెండన్‌పై భారం పడి మీ నడక/పని అసౌకర్యంగా మారుతుంది.
- మీరు షూస్‌కు లేస్ బిగిస్తుంటే, అవి మరీ బిగుతుగా ఉండకుండా చూసుకోవాలి. మరీ వదులుగా కూడా ఉండకూడదు. అప్పుడవి పాదం నుంచి ఊడిపోవచ్చు.
- మీ పాదరక్ష సోల్ (కింది భాగం) షాక్ అబ్జార్బింగ్ పని చేసేలా మరీ గట్టిగా కాకుండా, ఒకింత మెత్తగా ఉండాలి.
- మీ పాదరక్షలను హడావుడిగా కొనకండి. తొడిగాక తాపీగా, నింపాదిగా కాసేపు ఉంచి, షాపులోనే కాస్తంత నడచి చూసుకున్న తర్వాతే కొనండి.
- బాగా ఎత్తుగా హీల్ (మడమ) ఉన్న పాదరక్షలు/షూస్ వద్దు.

## కార్ డ్రైవింగ్‌లో పాటించాల్సిన పోశ్చర్ జాగ్రత్తలు




డ్రైవింగ్ సమయంలో కూర్చునే పోశ్చర్ సరిగా లేకపోతే వెన్నుకు, మెడకు, నడుముకు సంబంధించిన చాలా సమస్యలు వస్తాయి. డ్రైవింగ్ పోశ్చర్ సరిగా లేకపోవడం వల్ల 'రిపిటీటివ్ డ్రైవింగ్ ఇంజ్యూరీస్' (ఆర్‌డీఐ) అని పిలుచుకునే సమస్యలు వస్తాయి. అందులో మెడ బిగుసుకుపోవడం (స్టిఫ్‌నెక్), పాదాలు, కాళ్లకు తిమ్మిర్లు రావడం, భుజాలు నొప్పి పెట్టడం, మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురికావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే కార్‌డ్రైవింగ్ చేసేవారు పోశ్చర్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఫోర్‌వీలర్ డ్రైవింగ్‌లో మీ వెన్నుపైన సాధ్యమైనంత తక్కువ భారం పడేందుకు ఈ సూచనలు పాటించండి.

- మీరు సౌకర్యంగా కూర్చునేలా డ్రైవింగ్ సీట్ ఉండాలి. డ్రైవింగ్ చేసే సమయంలో స్టీరింగ్‌పై చేతులు పెట్టే పద్ధతి ఎలా ఉండాలంటే... మన డెస్క్‌పై చేతులు ఉంచినప్పటి కంటే... స్టీరింగ్‌పై చేతులు ఒకింత ఎత్తుగానే ఉండాలి. స్టీరింగ్ వీల్‌కూ, డ్రైవర్ ఛాతీకి మధ్య 25 – 30 సెం.మీ. (10 – 12 అంగుళాల) స్థలం ఉండాలి. స్టీరింగ్ ఎట్టిపరిస్థితుల్లో కాళ్లకు ఆనకుండా ఉండేలా డ్రైవ్ చేసేవారు కూర్చోవాలి. ఇంత స్థలం ఉన్నప్పుడు అటు స్టీరింగ్‌ను సౌకర్యంగా తిప్పడానికీ, ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్ తెరచుకోడానికీ వీలుగా ఉండి, ప్రమాదం వల్ల డ్రైవర్‌పై పడే ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా డ్రైవర్‌కు అత్యంత ఎక్కువ (మాక్సిమమ్) భద్రత లభిస్తుంది. (ఇలా ప్రమాదం జరిగినప్పుడు తెరచుకునే ఎయిర్‌బ్యాగ్స్ ఇటు మీ ముఖం మీదనో లేదా అటు పొట్ట మీదనో కాకుండా... సరిగ్గా ఛాతీ దగ్గరే తెరచుకునేందుకు సైతం ఈ సూచనలు ఉపయోగపడతాయి).
- కారు కుదుపుల్లో సైతం కాళ్ల స్టీరింగ్‌కు ఆనకూడదు. ఆగినప్పుడు సైతం చాలా సౌకర్యంగా దిగగలిగే విధంగా కారు సీట్ ఉండాలి. డ్రైవ్ చేసే వ్యక్తి అలా దిగేందుకు అనువుగా ఉండేంత స్థలం... స్టీరింగ్‌కూ, సీట్‌కూ మధ్య ఉండాలి.
- మీరు కూర్చున్న తర్వాత మీ మోకాళ్ల వెనక భాగానికీ, సీట్ అంచుకూ మధ్య కనీసం 3 – 6 సెంటీమీటర్లు ( ఒకటింబావు అంగుళాల నుంచి 2 3/8 అంగుళాల) దూరం ఉండాలి.
- మీరు మరీ 90 డిగ్రీలు నిటారుగా కూర్చొని డ్రైవ్ చేయడమూ సరికాదు. కాస్తంత వెనక్కువాలి సౌకర్యంగా డ్రైవ్ చేయాలి. అయితే డ్రైవింగ్ సీట్‌లో అలా వెనక్కి వాలినప్పుడు ఆ కోణం 120 డిగ్రీలకు మించకూడదు. ఆ డ్రైవింగ్ సీట్ మీ వర్టికల్‌గా వెన్నుకూ, కింద మీ తొడలకు మంచి సపోర్ట్ ఇవ్వాలి. అలా సపోర్ట్ ఇచ్చేలా మీ సీట్ కుషన్ ఉండాలి.
- డ్రైవ్ చేసేప్పుడు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోండి.
- బ్రేక్, క్లచ్ వంటి పెడల్స్ కాళ్లకు సౌకర్యంగా అందేలా డ్రైవింగ్ సీట్ అమర్చుకోవాలి.

## సెల్‌ఫోన్ వాడకంలో జాగ్రత్తలు...

మీరు టూ వీలర్ డ్రైవ్ చేస్తున్నా... లేదా మీ డెస్క్ మీద కంప్యూటర్‌పై పని చేస్తూనే మీ భుజానికీ చెవికీ మధ్య సెల్‌ఫోన్‌ను ఇరికించుకుని, మెడ వంచి మాట్లాడటం సరికాదు. ఇంతకంటే ఇయర్‌ఫోన్స్ వాడటం మెడకూ, వెన్నుకూ మంచిది.

- సెల్‌ఫోన్‌ను ఉపయోగించే సమయంలో బొటన వేలిని అధికంగా వాడటం వల్ల బొటనవేలి వెనక ఉండే టెండన్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాపు వస్తుంది. ఆ తర్వాత కూడా అదేపనిగా దాన్ని ఉపయోగించడం వల్ల ఆ గాయం మానక తిరగ బెడుతుంది. దీన్నే బ్లాక్‌బెర్రీ థంబ్ లేదా గేమర్స్ థంబ్ అంటారు. అందుకే వీలైనంత వరకు అత్యవసర పరిస్థితుల్లోనే సెల్‌ఫోన్ వినియోగించండి.
- ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడటం కన్నా మెసేజ్‌లనే అలవాటు చేసుకోండి. అయితే ఈ మెసేజ్‌లు ఇచ్చేటప్పుడు మెడను వంచకండి. మెడను ఎంతగా ఒంచితే వెన్నుపై పడే భారం అంతగా పెరుగుతుంది.
- మీ సెల్‌ఫోన్ నెంబరును సన్నిహితులకు మాత్రమే ఇవ్వండి. ఇలా చేయడం ద్వారా అనవసరమైన కాల్స్‌ను తగ్గించుకోవచ్చు.
- పొద్దున్న లేవడానికి అలారం మొదలుకొని... రిమైండర్లు, ఆటలు, పాటలు, కాలిక్యులేటర్... ఇలా ప్రతిదానికీ సెల్‌ఫోన్ మీదే ఆధారపడిపోతే వెన్నుకు చేటు చేయడం మాత్రమే కాకుండా అడిక్షన్‌గా కూడా పరిణమించవచ్చు.
- సెల్‌ఫోన్ సంభాషణలు క్లుప్తంగా ఉండాలి.
- రింగ్ చేసిన నెంబరు, కనెక్ట్ అయ్యాకే సెల్‌ఫోన్‌ను చెవి వద్దకు తీసుకెళ్లాలి.

ఇవీ వెన్నునూ, నడుమునూ, ఇతర ఎముకలూ, కండరాలను రక్షించుకునేందుకు ఉపయోగపడే జాగ్రత్తలు. పాటిస్తే ఎముకల అరుగుదల, కండరాల నొప్పులు రాకుండా నివారించుకోవచ్చు. నాణ్యమైన జీవితం గడపవచ్చు.




సెల్‌ఫోన్ వాడే సమయంలో మీరు మీ మెడను ముందుకు ఒంచుతూ పోతుంటే... మెడ ఒంపు కోణం పెరుగుతున్న కొద్దీ మీ మెడపై భారం (ఒత్తిడి) కూడా పెరుగుతూ పోతుంది. ఆ భారమే కేజీల్లో.

## టూవీలర్ (బైక్) నడుపుతున్నప్పుడు...



సాధారణంగా బైక్‌ల తయారీదారులు హ్యాండిల్ బార్స్, ఫుట్‌రెస్ట్ వంటి అంశాల్లో కొన్ని ప్రమాణాలను పాటిస్తుంటారు. వాటిని అనుసరించడం వల్ల చాలా సమస్యలు రావు. అయితే కొంతమంది స్టైల్‌గా ఉండటం కోసం తమ బైక్ హ్యాండిల్ బార్స్‌నూ, సీట్ కోణాన్ని రకరకాలుగా మారుస్తుంటారు. ఉదాహరణకు పొట్టి హ్యాండిల్ బార్స్ వాడటం, సీట్‌ను మరీ ఏటవాలుగా ఉండేలా అమర్చడం వంటివి. మీ బైక్‌లో ఇలాంటి మార్పులు చేసుకోవడం వల్ల నడుమునొప్పి, వెన్నునొప్పి వస్తుంటే... మీ బైక్ సీట్ మీకు సౌకర్యంగా, అనువుగా ఉండేలా కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. అవి...

- బైక్‌ల హ్యాండిల్స్ తగినంత విశాలంగా, రెండు చేతులతో బాగా పట్టుకోవడానికి వీలైనంత నిడివితో ఉండాలి. పొట్టిగా ఉండే షార్ట్‌హ్యాండిల్స్ వల్ల ఒంటిపై భారం పడి శరీరభాగాల్లో నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. హ్యాండిల్ పట్టుకున్నప్పుడు మనం నిటారుగా ఉండేలా చూసుకోవాలి. అయితే ఇటీవల స్పోర్ట్స్ బైక్ వంటి వాటిలో ఉన్నట్లుగా శరీరం బాగా ముందుకు వాలిపోయి ఉండేలా హ్యాండిల్ బార్స్, సీట్ యాంగిల్‌లో మార్పులు చేస్తున్నారు. ఇటీవల వాలిపోయినట్లుగా కూర్చొనేలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల మన వెన్ను నిటారుగా నిలపలేకపోవడంతో వెన్ను నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి హ్యాండిల్ బార్‌నూ, సీట్లను అలా అమర్చుకోవడం సరికాదు.
- మనం కాళ్లు పెట్టుకునే ఫుట్‌రెస్ట్ మన శరీరానికి మరీ దూరంగా ఉండకూడదు. దీనివల్ల కాళ్లు సాగినట్లుగా అయిపోయి నడుముపై భారం ఎక్కువగా పడుతుంది. దాంతో నడుమునొప్పి వచ్చేందుకు అవకాశం ఉంది.
- బైక్‌లపై వెళ్లేవారు వీపుపై ఉండే బ్యాగ్స్ (బ్యాక్‌ప్యాక్స్) పెట్టుకొని వెళ్తుండటం సాధారణం. ఈ భారం నడుంపైనా పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. ఇలాంటివారు ఆ బ్యాగ్ భారం వీపుపై కాకుండా సీట్‌పై పడేలా చూసుకోవాలి.

## సైకియాట్రీ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

# రోజుల తరబడి శిలా విగ్రహంలా!



**మాకు బాగా తెలిసిన, మాకు ఎంతో కావాల్సిన వ్యక్తి ఒకరు రోజుల తరబడి ఒకే భంగిమలో అలా స్థాణువులాగా నిలబడిపోయి ఉన్నాడు. గడ్డాలూ, మీసాలూ బాగా పెరిగిపోయి, బట్టలు మాసిపోయినా అదే భంగిమలో నిలబడి ఉన్నాడు. అచ్చం శిలావిగ్రహంలా రోజుల తరబడి ఆయన ఉండటాన్ని చూసిన కొంతమంది ఆయనకు మహిమలు ఉన్నాయేమోనని అంటున్నారు. ఆయనను బాగు చేసే అవకాశం లేదా?**

**– వి. అరుణ్‌కుమార్, నిజామాబాద్**

ఒక వ్యక్తి శిలావిగ్రహంలా అదేపనిగా అలా నిలబడిపోవడాన్ని సైకియాట్రిక్ పరిభాషలో 'కెటటోనియా' అంటారు. ఇందులో చాలా రకాలు ఉంటాయి. ఉదాహరణకు కెటటోనిక్ రిజిడిటీ అనే కండిషన్‌లో వ్యక్తి కండరాలు బిగుసుకుపోయి చాలాసేపు కదలకుండా ఉంటాయి. వ్యక్తిని ఆ స్థితి నుంచి మరో స్థితికి మార్చడం కష్టమవుతుంది. ఇక పోస్ట్యూరింగ్ అనే స్థితిలో రోగులు అత్యంత కఠినమైన, ఇబ్బందికరమైన భంగిమల్లో గంటలు / రోజుల తరబడి ఉండిపోతారు. అత్యంత సంక్షిప్తంగా, మనం ఊహించడానికే వీల్లేని భంగిమల్లో మనం అతడి శరీరాన్ని గనక ఒంచితే అది మెలితిరిగిపోయి అలాగే గంటల కొద్దీ ఉండిపోతుంది. ఆ సమయంలో ఆ వ్యక్తికి నొప్పి కూడా తెలియదు. దీన్నే 'వ్యాక్సీ ఫ్లెక్సిబిలిటీ' అంటారు. ఇలా కెటటోనియా కండిషన్ అనేక రకాలుగా వ్యక్తమవుతుంది. కెటటోనియాలో గడ్డాలు పెంచకుని, బట్టలు మాసిపోయి, మురికిగా ఉన్నారని రాశారు. అలా అతడి వ్యక్తిగత పరిశుభ్రత పోవడాన్ని బట్టి చూస్తే అతడికి బహుశా 'కెటటోనిక్ స్కిజోఫ్రీనియా' ఉండి ఉండవచ్చు. అయితే కొన్ని యాంటీసైకోటిక్ మందులతో గానీ లేదా 'ఈసీటీ' అనే చికిత్స ప్రక్రియతోగానీ అది పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంది. ఆ వ్యక్తిని మీకు దగ్గర్లోని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లండి.



డా. చంద్రచూడ్
సీనియర్ న్యూరో సైకియాట్రిస్ట్
సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్,
హైదరాబాద్

# రొమ్ము క్యాన్సర్... కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయాలు

వయసు పైబడే కొద్దీ రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు పెరుగుతూ ఉంటుంది. అంతేగాక కొన్ని కుటుంబాల్లో వారికి వాళ్ల జెనెటిక్ కోడ్ మీద ఆధారపడి రొమ్ముక్యాన్సర్ వచ్చే ప్రమాదం మరింత ఎక్కువ. అయితే ఫ్యామిలీ హిస్టరీ లేనివారికి ఈ క్యాన్సర్ రాదు అనుకోడానికి వీల్లేదు. కాబట్టి 30 ఏళ్ల నుంచే ప్రతి మహిళా రొమ్ముక్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి.

### కుటుంబ చరిత్రలో ఈ క్యాన్సర్ ఉంటే..?

జీవనశైలి, పర్యావరణం, హార్మోన్లకు సంబంధించిన అనేక విషయాల మీద ఆధారపడి ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయి. ఫ్యామిలీ హిస్టరీలో రొమ్ము క్యాన్సర్ వచ్చినవారు ఎక్కువగా ఉన్నప్పుడు ముందుగానే దీన్ని పసిగట్టడానికి బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 అనే జెనెటిక్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ జీన్ మ్యూటేషన్ పరీక్షలు పాజిటివ్ అని వస్తే... డాక్టర్ సలహా మేరకు ముందుగానే రొమ్ములను తొలగించుకోవడం లేదా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తగా ఉండవల్సి రావడం అవసరం. ఆ మహిళ వయసు, రిపోర్టుల మీద ఆధారపడి ఏవిధమైన నిర్ణయం తీసుకుంటే వారికి మంచిది అనే విషయాన్ని వైద్యులు నిర్ణయించి, వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

### ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎవరిలో ఎక్కువ?

- దగ్గరి బంధువుల్లో (అమ్మ, అమ్మమ్మలు, అక్కచెల్లెళ్లు, మేనత్తల్లో) ఈ క్యాన్సర్ ఉన్నప్పుడు.
- వారు 40 కంటే చిన్నవయసులోనే వ్యాధికి గురైనప్పుడు.
- రెండు రొమ్ములూ ఈ క్యాన్సర్‌కు గురైన కుటుంబాల్లో.
- ఆ కుటుంబానికి చెందిన పురుషుల్లో కూడా ఈ క్యాన్సర్ బయటపడ్డప్పుడు.
- ఆ కుటుంబ సభ్యులలో ఇతర క్యాన్సర్స్ ఎక్కువగా కనిపించడంగానీ లేదా అండాశయాలకు సంబంధించిన క్యాన్సర్స్ వచ్చినప్పుడు.
- జీన్ మ్యుటేషన్స్ స్ట్రాంగ్‌గా ఉన్నవారిలోనూ... అలాగే పెళ్లి లేటుగా చేసుకోవడం, పిల్లల్ని ఆలస్యంగా కనడం, పిల్లలకు పాలు పట్టకపోవడం, సంతానలేమి సమస్యల పరిష్కారం కోసం అధిక మోతాదుల్లో హార్మోన్ మందుల వాడటం, పదేళ్ల కంటే చిన్నవయసులోనే రజస్వల కావడం, 50 ఏళ్లు పైబడినా నెలసరి ఆగకపోవడంతో పాటు ఈస్ట్రోజెన్ స్థాయులు అధిక మోతాదుల్లో దీర్ఘకాలికంగా ఉన్నప్పుడు... ఇంకా వారికి అధిక బరువు కూడా తోడైతే ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు పెరుగుతుంది.

అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పట్టణాల్లో ఈ క్యాన్సర్‌కు గురయ్యే మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ముప్పై ఏళ్ల వయసులో రెండు లక్షల మందికి ఒకరిలో కనిపించే ఈ క్యాన్సర్... 80 ఏళ్ల వయసులో ప్రతిపదిమందిలో ఒకరిలో కనిపించేంతగా ఎక్కువవుతోంది.

### రొమ్ము క్యాన్సర్ పట్ల పెంపొందించుకోవాల్సిన అవగాహన ఏమిటి?

రొమ్ములో నొప్పిలేని గడ్డను నిర్లక్ష్యం చేయకుండా ఉండటం, అది చిన్న పరిమాణంలో ఉండగానే కనుక్కోగలగడం, 20 ఏళ్ల వయసప్పటి నుంచే స్నానం చేసేటప్పుడు పరీక్షించుకుంటూ రొమ్ములో కదలకుండా గట్టిగా ఉండే గడ్డను పసిగట్టడం, అంతేగాక 30 ఏళ్లు పైబడ్డాక తరచూ అల్ట్రాసౌండ్, డిజిటల్ మామోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండటం అవసరం. ఆ పరీక్షల ఫలితంగా చేతికి కూడా తగలనంత చిన్న సైజులో ఉండే కణితిని కనుగొనడం సాధ్యపడుతుంది. అలాంటప్పుడు కేవలం కణితిని మాత్రమే తీసేసే ప్రక్రియ లంపెక్టమీ సరిపోతుంది. ఫలితంగా క్యాన్సర్ వ్యాపించకముందే దాన్ని తొలగించవచ్చు. ఒకవేళ క్యాన్సర్ గనక రొమ్ములోని మిగతా భాగాలకూ వ్యాపించిన సందర్భాల్లో... రొమ్మును మొత్తంగా తీసివేయాల్సిన మాసెక్టమీ తప్పనిసరి. అందువల్ల కనుగొనడం ఆలస్యమయ్యేకొద్దీ రొమ్మును తొలగించాల్సిన మాసెక్టమీ అనివార్యం అవచ్చు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

### అది అపోహ మాత్రమే

లావుగా ఉన్న మహిళల్లో, రొమ్ములు పెద్దగా ఉండేవారిలో ఈ క్యాన్సర్ వస్తుందనే అభిప్రాయం ఉంది. అయితే ఇది కేవలం అపోహ మాత్రమే. ఈ క్యాన్సర్ ఎవరిలోనైనా రావచ్చు. చివరికి పురుషుల్లో కూడా ఈ క్యాన్సర్ వస్తుంది. కొంత లావుగా ఉన్నవారిలో లేటుగా కనుక్కునే ప్రమాదం ఉన్నా... రొమ్ము పరిమాణం పెద్దగా ఉండటం వల్ల గడ్డను మాత్రమే తీసివేయగలగడం సాధ్యం. ఇక రొమ్ము చిన్నగా ఉన్నవారిలో క్యాన్సర్ త్వరగా మిగతా భాగాలకు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉండటం వల్ల రొమ్ము మొత్తంగా తీసివేయడం సాధారణంగా జరుగుతుంటుంది.

కణితి సైజు మీద ఆధారపడి... ఏ రకమైన చికిత్స ఇవ్వాల్సి ఉంటుందో డాక్టర్లు నిర్ధారణ చేస్తారు. అంతేకాకుండా... ఆ ట్యూమర్ ఏ రకానికి చెందినది అనే అంశం కూడా చికిత్స విధానాల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే అధిక బరువు ఉన్నవారిలో ... ఇతరత్రా సమస్యలు వచ్చే అవకాశాలు ఎలా ఎక్కువో... అదేవిధంగా ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలూ పెరుగుతాయి.

### రొమ్ము క్యాన్సర్ లక్షణాలు ఏంటి?

- రొమ్ములో కణితి చేతికి తగలడం.
- రొమ్ములో, చంకలో గడ్డ లేదా వాపు
- చనుమొన సైజులో మార్పు, అది లోపలికి తిరిగినట్లు ఉండటం.
- రొమ్ముపై చర్మం మందం కావడం, సొట్టపడటం
- రొమ్ము సైజులో, షేపులో, రంగులో మార్పు
- రొమ్ము మీద ఎంతకూ నయంకాని పుండు
- చనుమొన నుంచి రక్తస్రావం.

పైన పేర్కొన్న ఈ లక్షణాలు కనిపించేసరికి రొమ్ము క్యాన్సర్ తొలిదశను దాటిపోయే ప్రమాదం ఉంటుంది. క్యాన్సర్ కణితి రకం, దశ (స్టేజ్), గ్రేడింగ్ వంటి విషయాల మీద ఆధారపడి సర్జరీ, కీమో, రేడియేషన్, హార్మోన్ థెరపీలను నిర్ణయిస్తారు. రొమ్ములోని సన్నటి గొట్టాలు, లోబ్స్‌కు పరిమితమయ్యే క్యాన్సర్లు, ఇతర భాగాలకు త్వరగా వ్యాపించే క్యాన్సర్ల వంటి రకాలు ఉంటాయి. చికిత్స ఆలస్యం అయ్యేకొద్దీ ఈ క్యాన్సర్లు అదుపు తప్పుతాయి. వయసు పైబడ్డ మహిళల్లో కంటే చిన్న వయసులో వచ్చే రొమ్ము క్యాన్సర్లను అదుపు చేయడం కష్టమవుతుంది. చిన్న వయసులో వచ్చే రొమ్ము క్యాన్సర్ కణుతులకు అధికంగా వ్యాపించే గుణం ఉంటుంది. ఈ రోజుల్లో రొమ్ముల్లో ఎలాంటి మార్పులూ బయటకు కనిపించకుండా నిర్వహించే రీ–కన్‌స్ట్రక్టివ్ ఆంకోప్లాస్టిక్ సర్జరీలూ సమర్థంగా నిర్వహించడం సాధ్యమవుతోంది. కాబట్టి మహిళలు తమ అందం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

రొమ్ముల్లో ఏమాత్రం మార్పు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
గురువారం
27-6-2019




బీటెక్..
యువతకు క్రేజీ కోర్సు.
ఇందులో చేరాలంటే ఇంటర్ పాసవ్వాలి.
జేఈఈ/ఎంసెట్‌లో ర్యాంకు సాధించాలి.
కానీ, ఏపీ ట్రిపుల్ ఐటీలు పదో తరగతి అర్హతతోనే..
ఇంజనీరింగ్‌లో చేరే అవకాశం కల్పిస్తున్నాయి.
ప్రస్తుతం రాష్ట్రంలో (ఏపీ) ఉన్న నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో.. 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ ట్రిపుల్ ఐటీల ప్రత్యేకత.. వాటిలో ప్రవేశ విధానం.. కోర్సు తీరుతెన్నులు.. కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం..

# ఏపీ ట్రిపుల్ ఐటీలు..

- పదో తరగతితోనే బీటెక్‌లో చేరేందుకు వేదికలు ట్రిపుల్ ఐటీలు
- మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ మానస పుత్రికలు
- 2019-20 సంవత్సరానికి కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ
- పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక
- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుతో ఉజ్వల అవకాశాలు

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సైతం నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే సమున్నత ఆశయంతో 2008లో నాటి ముఖ్య మంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ట్రిపుల్ ఐటీలకు శ్రీకారం చుట్టారు. వీటి నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ పేరుతో ఒక ప్రత్యేక యూనివర్సిటీని సైతం నెలకొల్పారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో మూడు క్యాంపస్‌ల (ఇడుపులపాయ, నూజివీడు, బాసర)తో ప్రారంభమయ్యాయి. వీటిలో రాష్ట్ర విభజన తర్వాత బాసర తెలంగాణకు వెళ్లింది. ప్రస్తుతం ఏపీలో నాలుగు క్యాంపస్‌లు(ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం) విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.

### ప్రతి క్యాంపస్‌లో వెయ్యి సీట్లు

ప్రస్తుతం ఆర్‌జీయూకేటీ పరిధిలోని నాలుగు ఏపీ ట్రిపుల్ ఐటీల్లో.. ఒక్కో క్యాంపస్‌లో వెయ్యి సీట్లు చొప్పున మొత్తం నాలుగు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశం పదో తరగతిలో పొందిన మెరిట్ ఆధారంగా, కౌన్సెలింగ్ ద్వారా చేపడతారు. అయితే రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం -85 శాతం సీట్లను ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు; పదిహేను శాతం సీట్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థులకు కేటాయించారు.

### ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్

పదో తరగతి అర్హతతోనే ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశం కల్పించడం ఏపీ ట్రిపుల్ ఐటీల ప్రత్యేకత అని చెప్పొచ్చు. తొలి రెండేళ్లు పీయూసీ(ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు) స్థాయిగా.. మూడో సంవత్సరం నుంచి బీటెక్ స్థాయిగా పరిగణిస్తారు. పీయూసీ స్థాయిలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్(ఎంపీసీ+బైపీసీ తరహా) తదితర సబ్జెక్టులను విద్యార్థులు అభ్యసిస్తారు. రెండేళ్ల పీయూసీ పూర్తయ్యాక కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో చేరే వీలుంది. ఒకవేళ బీటెక్ కోర్సులో ప్రవేశించడం ఆసక్తి లేని విద్యార్థులు పీయూసీ సర్టిఫికెట్‌తో బయటికి వచ్చే అవకాశం సైతం అందుబాటులో ఉంది.

### ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు ప్రక్రియ

ఏపీ ట్రిపుల్ ఐటీల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. విద్యార్థులు ముందుగా ఏపీ ఆన్‌లైన్ సర్వీసెస్ ద్వారా నిర్ణీత దరఖాస్తు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ దరఖాస్తు సమయంలోనే నిర్ణీత సర్టిఫికెట్ల సాఫ్ట్‌కాపీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్పెషల్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు(పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) మాత్రం ఆన్‌లైన్ దరఖాస్తును ప్రింట్ తీసుకొని దానికి సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి పోస్ట్ ద్వారా కూడా కన్వీనర్‌కు పంపించాలి.

### పదో తరగతిలో ప్రతిభ ఆధారంగా

ఆన్‌లైన్ విధానంలో అందిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత పదో తరగతిలో సాధించిన జీపీఏ; రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ మెరిట్‌లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో తమకు పేర్కొన్న క్యాంపస్‌లలో కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలి. ఈ సమయంలో మరోసారి అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి సీటు ఖరారు చేస్తారు. మెరిట్ జాబితా రూపకల్పన పూర్తిగా విద్యార్థులు పదో తరగతిలో చూపిన ప్రతిభ ఆధారంగానే ఉంటుంది.

### సూపర్ న్యూమరరీ సీట్లు

ప్రతి క్యాంపస్‌లో ఉన్న వెయ్యి సీట్లకు అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారి పిల్లలకు, ప్రవాస భారతీయుల పిల్లలకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ అయిదు శాతం సూపర్ న్యూమరరీ సీట్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతిలో కనీసం 70 శాతం మార్కులు లేదా ఏడు పాయింట్ల జీపీఏతో ఉత్తీర్ణత పొందాలి.

### ఫీజు.. రీయింబర్స్‌మెంట్

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు.. మొదటి రెండేళ్లు (పీయూసీ స్థాయిలో) ఏడాదికి రూ.36 వేలు; తర్వాత నాలుగేళ్లు(బీటెక్ స్థాయిలో) ఏడాదికి రూ.40 వేలు చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉన్న రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులు; రూ.రెండు లక్షలలోపు ఉన్న ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందొచ్చు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వారి పిల్లలు ఏడాదికి రూ.1.36 లక్షలు; ఇతర ప్రవాస భారతీయుల పిల్లలు ఏడాదికి రూ.మూడు లక్షలు చొప్పున ఫీజు చెల్లించాలి.

### ఎంపికైతే.. ఉజ్వల అవకాశాలు

ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకునే వీలుంది. బీటెక్ కోర్సు సమయంలో మూడో సంవత్సరం నుంచే ప్రముఖ ఐటీ, కోర్ సంస్థల్లో లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. దాదాపు 60 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందుతున్నట్లు సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి. మిగతా విద్యార్థులు గేట్ ఉత్తీర్ణతతో ఎంటెక్ కోర్సుల్లోకి, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడుతున్నారు.





### విద్యార్థులకు సువర్ణావకాశం

"ఏపీ ట్రిపుల్ ఐటీలు గ్రామీణ, పేదప్రాంత విద్యార్థులకు సువర్ణావకాశం కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు. ఇక్కడ బోధన, కరిక్యులం అంతా వినూత్నంగా ఉంటుంది. దీంతో విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన నైపుణ్యాలు అందిపుచ్చుకోగలుగుతున్నారు. ఫలితంగా బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో సగటున 60 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి. మిగతా విద్యార్థులు గేట్‌లో చక్కటి ప్రతిభ చూపుతున్నారు. అంతేకాకుండా మూడో సంవత్సరం నుంచే లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించేలా ఇండస్ట్రీ వర్గాలను ఒప్పించాం. ఫలితంగా విద్యార్థులకు క్షేత్ర నైపుణ్యాలు కూడా అలవడుతున్నాయి.

– ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, డైరెక్టర్, ట్రిపుల్‌ఐటీ-ఆర్‌కే వ్యాలీ (ఇడుపులపాయ).

### ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు.. ముఖ్యాంశాలు

**అర్హతలు**

- పదో తరగతి తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత (2019లోనే).
- **వయో పరిమితి:** డిసెంబర్ 31, 2019 నాటికి 18 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులు 21 సంవత్సరాల లోపు వయసు ఉండాలి.

**దరఖాస్తు విధానం**

- పూర్తిగా ఏపీ ఆన్‌లైన్ సర్వీసెస్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే పూర్తిచేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఏపీ, తెలంగాణ విద్యార్థులకు రూ.150; గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న, ఎన్నారైల పిల్లలకు 25 డాలర్లు.
- **ఆన్‌లైన్ అప్లికేషన్‌కు చివరి తేదీ:** జూలై 1, 2019.
- **స్పెషల్ కేటగిరీ విద్యార్థులు (పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రింటవుట్ పంపడానికి చివరి తేదీ:** జూలై 4, 2019.
- **ప్రొవిజినల్ సెలక్షన్ జాబితా వెల్లడి:** జూలై 23, 2019.

**సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ తేదీలు**

ప్రొవిజినల్ సెలక్షన్ జాబితాలో ఉన్న విద్యార్థులకు నిర్ణీత తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనికి స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఆ వివరాలు..

- **నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లు:** ఆగస్ట్ 5, 6, తేదీల్లో.
- **శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లు:** ఆగస్ట్ 7, 8 తేదీల్లో.
- స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు(పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) మాత్రం సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నూజివీడు క్యాంపస్‌లో మాత్రమే జూలై 19 నుంచి 23 వరకు నిర్వహిస్తారు.

**అవసరమైన ధ్రువపత్రాలు**

- ఆన్‌లైన్ అప్లికేషన్ రశీదు.
- పదో తరగతి హాల్‌టికెట్.
- పదో తరగతి జీపీఏ సర్టిఫికెట్.
- నివాస ధ్రువీకరణ పత్రం.
- కుల ధ్రువీకరణ పత్రం.
- స్పెషల్ కేటగిరీ విద్యార్థులు వాటికి సంబంధించి నిర్ణీత నమూనాలో పేర్కొన్న ధ్రువపత్రాలు
- **తరగతుల ప్రారంభం:** ఆగస్టు 9, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rgukt.in, admissions.rguktn.ac.in/ugadmissions

---

## ఉద్యోగ/రీసెర్చ్ ఫెలోషిప్ సమాచారం

### డీఆర్‌డీవో-15 జేఆర్‌ఎఫ్ ఖాళీలు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో పరిశోధనా కేంద్రమైన రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ).. తాత్కాలిక ప్రాతిపదికన 15 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **ఒప్పంద కాలం:** ప్రాథమికంగా రెండేళ్లు.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఈసీఈ-4, ఈఈఈ-4, మెకానికల్-4, సీఎస్ఈ-2, కెమికల్ ఇంజనీరింగ్-1.
- **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/బీటెక్‌తో పాటు స్లెట్/నెట్/గేట్ లేదా ఎంఈ/ఎంటెక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, జూలై 10 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 10, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rcilab.in

### బార్క్-25 జేఆర్‌ఎఫ్ ఖాళీలు

ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 25 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, లైఫ్ సెన్సెస్.
- **కాల వ్యవధి:** గరిష్టంగా అయిదేళ్లు.
- **స్టైపెండ్:** నెలకు రూ.31 వేలు+హెచ్ఆర్ఏ+కంటింజెన్సీ గ్రాంటు.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఉత్తీర్ణత. యూజీసీ- సీఎస్ఐఆర్-నెట్, జెస్ట్, ఐసీఎంఆర్-జేఆర్‌ఎఫ్, డీబీటీ-జేఆర్‌బీ బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్టులకు హాజరై ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, అర్హత పరీక్షల స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 12, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

### బీపీఆర్‌డీలో 15 ఖాళీలు

న్యూఢిల్లీలోని హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ).. 15 పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-1, డేటా అనలిస్ట్-1, సైబర్ క్రైమ్ థ్రెట్ ఇంటెలిజెన్స్ ప్రొఫెషనల్స్-2, సొల్యూషన్ ఆర్కిటెక్ట్-2, ప్రోగ్రామ్ మేనేజర్-2, లీగల్ అసిస్టెంట్-1, బిజినెస్/రీసెర్చ్ అనలిస్ట్-6.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టులో బీఈ/బీటెక్, బీసీఏ, ఎంసీఏ, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.250).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.becil.com

---




# క్రీడల కోర్సులకు నెలవు.. ఎన్ఎస్‌యూ

దేశంలో ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఏరోస్పేస్ వంటి కోర్సులకు సంబంధిత విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్స్ కోర్సులు అందిస్తున్నాయి. కానీ, స్పోర్ట్స్ విభాగంలో కోర్సులు అందిస్తున్న యూనివర్సిటీలు లేవనే చెప్పొచ్చు. ఈ లోటును భర్తీచేసేందుకు కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 2018లో మణిపూర్‌లోని ఇంఫాల్‌లో దేశంలోనే తొలి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఈ వర్సిటీ ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతోంది. మరోవైపు 325 ఎకరాల్లో శాశ్వత క్యాంపస్ నిర్మాణం జరుగుతోంది. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ 2019-20 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ చేపట్టింది. ఈ నేపథ్యంలో నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రత్యేకతలు.. అందిస్తున్న కోర్సులు.. ప్రవేశ ప్రక్రియ, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

- దేశ తొలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం
- జూలై మొదటి వారంలో ప్రవేశ పరీక్షల నిర్వహణ
- స్పోర్ట్స్ కోర్సులతో ఉజ్వల కెరీర్‌కు మార్గం

### ఎన్ఎస్‌యూ ప్రత్యేకత

నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ(ఎన్ఎస్‌యూ) అకడెమిక్స్, రీసెర్చ్, అథ్లెటిక్ పెర్ఫార్మెన్స్, ఇతర సేవలపై ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తోంది. అకడెమిక్స్‌లో భాగంగా స్పోర్ట్స్ కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది. స్పోర్ట్స్ కోచింగ్, అథ్లెట్ల ప్రతిభను మెరుగుపరిచేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ, విదేశీ పరిశోధకులతో కలిసి పనిచేస్తోంది.

### అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

**బీఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్**

- **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- **సీట్లు:** 50.
- **అర్హత:** 10+2 లేదా తత్సమానం.
- **స్పోర్ట్స్:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్.
- **కోర్సు స్వరూపం:** కోర్సులో భాగంగా కోచింగ్ పద్ధతులు, స్పోర్ట్స్ టెక్నిక్స్, ఎక్సర్‌సైజ్ ఫిజియాలజీ, టీచింగ్ మెథడ్స్‌కు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తారు. దీన్ని పూర్తిచేసిన వారికి స్పోర్ట్స్ కోచింగ్‌కు సంబంధించి అత్యుత్తమ పరిజ్ఞానం, నైపుణ్యం సొంతమవుతుంది.

**బీపీఈఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్)**

- **సీట్లు:** 50.
- **కోర్సు వ్యవధి:** మూడేళ్లు.
- **అర్హత:** 10+2 తత్సమానం.
- **కోర్సు స్వరూపం:** బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ అండ్ స్పోర్ట్స్ ప్రోగ్రామ్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్‌లో ప్రత్యేక నైపుణ్యాలు అందించేలా రూపొందించారు. దీన్ని పూర్తిచేసిన వారికి స్పోర్ట్స్, ఫిట్‌నెస్, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్, ఫిట్‌నెస్ హెల్త్‌క్లబ్స్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్, హాస్పిటాలిటీ, ఎడ్యుకేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఉంటాయి.

### పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు

**ఎంఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్**

- **స్పోర్ట్స్:** అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్.
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **సీట్లు:** 30
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ.
- **కోర్సు స్వరూపం:** ఈ ప్రోగ్రామ్ ద్వారా స్పోర్ట్స్ కోచింగ్ సిద్ధాంతాలు, పద్ధతులు, పని-పరిశోధనలు, విలువలకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తారు. దీన్ని పూర్తిచేయడం ద్వారా ప్రపంచస్థాయి స్పోర్ట్స్ కోచింగ్ స్కిల్స్ అలవడతాయి. అన్ని క్రీడా విభాగాల్లో అర్హత, వినూత్నత కలిగిన శిక్షకులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీ డిమాండ్ నెలకొంది.

**ఎంఏ స్పోర్ట్స్ సైకాలజీ**

- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **సీట్లు:** 20.
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
- **కోర్సు స్వరూపం:** మనసు మానవ ప్రవర్తనపై ఎలా ప్రభావం చూపుతుంది.. స్పోర్ట్స్‌లో ప్రదర్శనపై దాని ప్రభావంపై తదితర అంశాల గురించి ఈ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తారు. అంతేకాకుండా వేర్వేరు క్రీడల్లో మానసిక ప్రభావాలను అంచనా వేసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి టీచింగ్, రీసెర్చర్, కౌన్సెలర్, థెరఫిస్టుగా కెరీర్ అవకాశాలు లభిస్తాయి.
- **ఎంపిక ప్రక్రియ:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

### ప్లేస్‌మెంట్ సెల్

సంప్రదాయ యూనివర్సిటీల తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ సైతం ప్లేస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేసింది. ఇది వివిధ పరిశ్రమలు, స్పోర్ట్స్ ఆర్గనైజేషన్స్, స్పోర్ట్స్ క్లబ్స్, స్పోర్ట్స్ లీగ్స్, గవర్నమెంట్, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్-స్కూల్స్‌తో యూనివర్సిటీని అనుసంధానించి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాలు అందించేందుకు కృషిచేస్తోంది.

**ముఖ్య తేదీలు**

- **యూజీ కోర్సులకు ప్రవేశ పరీక్ష తేదీ:** జూలై 4, 5, 6.
- **పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్ష తేదీ:** జూలై 8, 9
- **పూర్తి వివరాలకు:** www.nsu.ac.in

**50**
హార్దిక్ పాండ్యాకు ఇది 50వ మ్యాచ్. మరో 2 వికెట్లు తీస్తే అతని 50 వికెట్లు పూర్తవుతాయి.

**59**
గేల్ మరో 59 పరుగులు చేస్తే విండీస్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా లారాను అధిగమిస్తాడు.



# జైత్రయాత్ర కొనసాగాలని...

ప్రపంచ కప్‌లో ఓటమి లేకుండా అజేయంగా సాగుతున్న భారత జట్టు ద్వితీయార్ధ పోరుకు సన్నద్ధమైంది. టోర్నీ ఆరంభం నుంచి 28 రోజుల వ్యవధిలో ఐదు మ్యాచ్‌లే పూర్తి చేసుకున్న టీమిండియా... రాబోయే పది రోజుల్లో నాలుగు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగబోతోంది. ఈ క్రమంలో వెస్టిండీస్ తొలి ప్రత్యర్థిగా భారత్ ముందు నిలిచింది. బలాబలాలు, ఫామ్ దృష్ట్యా విండీస్‌కంటే టీమిండియా ఎంతో మెరుగ్గా కనిపిస్తుండగా... తమదైన రోజున చెలరేగితే ఆ జట్టు నుంచి కూడా గట్టి పోటీ తప్పకపోవచ్చు. మిగిలిన మూడు మ్యాచ్‌లు గెలిస్తే తప్ప వరల్డ్‌కప్‌లో ముందుకెళ్లడంపై ఆశలు పెట్టుకోలేని స్థితిలో విండీస్ ఉండగా... ఈ మ్యాచ్‌లో గెలిస్తే కోహ్లి సేన సెమీస్‌కు దాదాపుగా చేరువవుతుంది.

### ఐదో విజయంపై భారత్ దృష్టి

- నేడు వెస్టిండీస్‌తో పోరు
- ఆత్మవిశ్వాసంతో కోహ్లి సేన
- సంచలనం ఆశిస్తున్న కరీబియన్లు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

**మాంచెస్టర్:** మెగా టోర్నీలో దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, ఆస్ట్రేలియాలపై సాధించిన సాధికారిక విజయాలు భారత్ ఆధిపత్యాన్ని చూపాయి. అయితే అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ ఒక్కసారిగా జట్టులో కొత్త లోపాలను చూపించింది. వాటిని సరిదిద్దుకొని ముందుకెళ్లే క్రమంలో మరో కీలక మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇక్కడి ఓల్డ్‌ట్రఫోర్డ్ మైదానంలో నేడు జరిగే తమ ఆరో లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో టీమిండియా తలపడుతుంది. టోర్నీలో ఇప్పటి వరకు ఒకే మ్యాచ్ గెలిచిన విండీస్ ఈ సారైనా మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని భావిస్తోంది.

### ధోని ఎలా ఆడతాడో!

సాధారణంగా వ్యక్తిగతంగా ఆటగాళ్లను విమర్శించడాన్ని ఇష్టపడని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా అఫ్గాన్‌తో మ్యాచ్‌లో ధోని బ్యాటింగ్‌ను తప్పు పట్టాడు. వాస్తవంగా కూడా గత మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ మిడిలార్డర్‌లో ఆడిన తీరు జట్టును ఆందోళన కలిగించేదే. ఈ నేపథ్యంలో అందరి దృష్టి ధోని బ్యాటింగ్‌పైనే ఉంటుందనడంలో సందేహం లేదు. ఇది మినహా టీమిండియా జట్టు కూర్పు విషయంలో పెద్దగా ఆలోచించాల్సిన అవసరం కనిపించడం లేదు. రోహిత్, రాహుల్, కోహ్లిలతో టాపార్డర్ పటిష్టంగా ఉండగా... విజయ్ శంకర్ మరోసారి నాలుగో స్థానంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. అఫ్గాన్‌పై అర్ధ సెంచరీ సాధించిన కేదార్ జాదవ్ కూడా కీలక పాత్ర పోషించాల్సి ఉంది. నలుగురు రెగ్యులర్ బౌలర్లతో గత పోరులో భారత బ్యాటింగ్ కొంత బలహీనంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఇద్దరు స్పిన్నర్లలో జడేజాను ఆడించే అవకాశం కూడా కనిపిస్తోంది. భువనేశ్వర్ గాయం కారణంగా జట్టులోకి వచ్చిన షమీ హ్యాట్రిక్ ప్రదర్శనతో తన చోటు ఖాయం చేసుకున్నాడు. గాయం నుంచి కోలుకొని భువీ ఈ మ్యాచ్ కోసం సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేసినా... ఇప్పటికిప్పుడు షమీని తప్పించకపోవచ్చు. బుమ్రా మరోసారి పదునైన ఆరంభం ఇస్తే విండీస్‌ను దెబ్బ తీయడం భారత్‌కు కష్టం కాదు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్, రాహుల్, విజయ్ శంకర్, ధోని, జాదవ్, పాండ్యా, కుల్దీప్, చహల్/జడేజా, షమీ, బుమ్రా.

**వెస్టిండీస్:** హోల్డర్ (కెప్టెన్), గేల్, లూయిస్, హోప్, పూరన్, హెట్‌మైర్, బ్రాత్‌వైట్, నర్స్, రోచ్, కాట్రెల్, థామస్.

### పిచ్, వాతావరణం

ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానం బ్యాటింగ్‌కు అనుకూలం. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. భారత్ ఇదే వేదికపై ఇప్పటికే పాక్‌తో ఆడగా... విండీస్ కూడా న్యూజిలాండ్‌ను ఇక్కడే ఎదుర్కొంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.



### బ్రాత్‌వైట్ మళ్లీ చెలరేగితే...

కివీస్‌తో మ్యాచ్‌లో విండీస్ దురదృష్టవశాత్తూ మంచి విజయావకాశాన్ని చేజార్చుకుంది. అయితే విండీస్ బ్యాటింగ్ లోతు ఎలాంటిదో ఈ మ్యాచ్ చూపించింది. వరుసగా విధ్వంసక ఆటగాళ్లు ఉన్న ఆ జట్టు సమష్టిగా చెలరేగితే ఆపడం ఎవరి తరం కాదు. మధ్యలో కొన్ని మ్యాచ్‌లు విఫలమైనా... గేల్ దూకుడు గురించి భారత్‌కు కొత్తగా చెప్పాల్సిన పని లేదు. హోప్, హెట్‌మైర్ తమపై ఉన్న అంచనాలకు తగినట్లుగా రాణించాల్సి ఉంది. హెట్‌మైర్‌కు స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోగల నైపుణ్యం ఉంది. గత మ్యాచ్ హీరో బ్రాత్‌వైట్ తన జోరు కొనసాగిస్తే టీమిండియాకు కష్టాలు తప్పవు. ఈ ప్రపంచకప్‌లో వెస్టిండీస్ పదునైన పేస్ బౌలింగ్ కూడా చెప్పుకోదగ్గ అంశం. ముఖ్యంగా కాట్రెల్ ప్రతీ జట్టుపై చెలరేగిపోయాడు. ఆరంభంలో అతని లెఫ్టార్మ్ పేస్‌ను ఎదుర్కోవడం భారత ఓపెనర్లకు అంత సులువు కాదు. ఈ విషయంలో రోహిత్ తరచుగా విఫలమయ్యాడు.



ప్రాక్టీస్‌లో విండీస్ ఆటగాళ్లు

### ముఖాముఖి రికార్డు

భారత్, వెస్టిండీస్ జట్లు ఇప్పటివరకు 126 వన్డేల్లో తలపడ్డాయి. 59 మ్యాచ్‌ల్లో భారత్... 62 మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ విజయం సాధించాయి. రెండు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. మూడు మ్యాచ్‌లు రద్దయ్యాయి. ప్రపంచ కప్‌లో ఈ రెండు జట్లు ఎనిమిది మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఐదు మ్యాచ్‌ల్లో భారత్, మూడు మ్యాచ్‌ల్లో విండీస్ గెలిచాయి. ప్రపంచకప్‌లో చివరిసారి 1992లో భారత్‌పై విండీస్ గెలిచింది. 1996, 2011, 2015 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో భారత్‌ను విజయం వరించింది.

## ఎమ్మెస్కే కీపింగ్ చేయగా...

విండీస్‌తో మ్యాచ్‌కు ముందు రోజు భారత ఆటగాళ్ల ప్రాక్టీస్ జోరుగా సాగింది. ముఖ్యంగా గాయం నుంచి కోలుకున్న పేసర్ భువనేశ్వర్ కుమార్ నిర్విరామంగా బౌలింగ్ చేస్తూ ఫిట్‌గా కనిపించాడు. అతను 'సింగిల్ వికెట్' బౌలింగ్ చేస్తున్న సమయంలో భారత మాజీ కీపర్, సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ కీపర్‌గా వ్యవహరించడం విశేషం. ఆ తర్వాత కూడా భారత ఆటగాళ్లతో ప్రసాద్ ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేయించడం విశేషం. రిజర్వ్ కీపర్ పంత్ కూడా చాలా సేపు ఫీల్డింగ్ చేశాడు. మరో వైపు ఎమ్మెస్ ధోని స్పిన్నర్ల బౌలింగ్‌లో ప్రాక్టీస్ చేశాడు. ముఖ్యంగా అతను స్వీప్ షాట్లు ఆడటంపైనే ఎక్కువగా దృష్టి పెట్టాడు. గత మ్యాచ్‌లో అఫ్గాన్ స్పిన్‌ను ఎదుర్కోవడంలోనే ధోని బాగా ఇబ్బంది పడిన విషయం గమనార్హం.



కోహ్లి అన్ని ఫార్మాట్‌లలో వరల్డ్ నంబర్‌వన్ బ్యాట్స్‌మన్. ధోని స్ట్రయిక్‌రేట్‌ను కోహ్లితో పోల్చడం సరైంది కాదు. కాబట్టి ధోని ఆటను మరెవరితోనూ పోల్చవద్దు. మేం ఆ మ్యాచ్‌లో స్వల్ప లక్ష్యాన్ని కూడా కాపాడుకున్నాం. ధోని పరిస్థితులను బట్టి ఆడతాడు. కాబట్టి అతని బ్యాటింగ్ గురించి ఆందోళన అనవసరం. ధోని ఒక్కడితోనే కాదు కోచ్‌లు, సహాయక సిబ్బంది ఇతర బ్యాట్స్‌మెన్ అందరితో కూడా వారి ఆటపై చర్చిస్తూనే ఉంటాం.

**- భరత్ అరుణ్,**
**భారత బౌలింగ్ కోచ్**



## ప్రపంచకప్ తర్వాతా ఆడతా: గేల్

**మాంచెస్టర్:** వన్డే వరల్డ్ కప్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతానని గతంలో ప్రకటించిన విండీస్ స్టార్ క్రిస్ గేల్ మనసు మార్చుకున్నాడు. మెగా టోర్నీ తర్వాత సొంతగడ్డపై భారత్‌తో జరిగే సిరీస్‌లో ఆడాలనుకుంటున్నట్లు అతను వెల్లడించాడు. ఆ తర్వాతే గేల్ రిటైర్ అయ్యే అవకాశాలున్నాయి. 'నా ఆట ఇంకా ముగింపునకు రాలేదు. ఇంకా కొన్ని మ్యాచ్‌లు కచ్చితంగా ఆడగలను. మరో సిరీస్ ఆడతానేమో. ప్రపంచ కప్ తర్వాత సొంతగడ్డపై భారత్‌తో ఒక టెస్టు మ్యాచ్, వన్డే సిరీస్ కూడా ఆడతాను. టి20లు మాత్రం ఆడను' అని గేల్ స్పష్టం చేశాడు. భారత్‌తో జరిగే సిరీసే గేల్‌కు చివరిది కానుందని విండీస్ మేనేజర్ స్పూనర్ కూడా నిర్ధారించాడు. ఆగస్టు 3నుంచి వెస్టిండీస్‌లో భారత్ పర్యటన ప్రారంభమవుతుంది. గేల్ 2014లో ఆఖరిసారిగా విండీస్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడాడు. అయితే ఇప్పుడు తన సొంత మైదానం జమైకాలోని కింగ్‌స్టన్‌లో చివరి టెస్టు మ్యాచ్ ఆడాలనుకుంటున్న అతని కోరికను విండీస్ బోర్డు మన్నించినట్లుగా కనిపిస్తోంది. ఆగస్టు 30నుంచి జమైకాలో భారత్, విండీస్ మధ్య టెస్టు మ్యాచ్ జరుగుతుంది.

### ఆస్పత్రి నుంచి లారా డిశ్చార్జి



**ముంబై:** వెస్టిండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారా బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. అతను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. కానీ... అతని అస్వస్థతకు సంబంధించిన వివరాలను మాత్రం ఆస్పత్రి వర్గాలు వెల్లడించలేదు. మధ్యాహ్నం 12.20 గంటలకు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అతను బసచేసిన హోటల్ గదికి వెళ్లిపోయాడు. ఈ విండీస్ లెజెండ్ ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ముంబై స్టూడియోలో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్యం సహకరిస్తే నేడు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు వ్యాఖ్యానం చేసే అవకాశముంది.

### అంకిత, రామ్‌కుమార్ ఓటమి



అంకిత

**లండన్:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్... మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. బుధవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రామ్‌కుమార్ 6–7 (5/7), 3–6తో కామిల్ (పోలాండ్) చేతిలో... అంకిత 1–6, 6–7 (4/7)తో లిసికి (జర్మనీ) చేతిలో ఓడిపోయారు. మరోవైపు లండన్‌లోనే జరుగుతున్న ఈస్ట్‌బోర్న్ ఏటీపీ–250 టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)–పాబ్లో క్యువాస్ (ఉరుగ్వే) జంట క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. బోపన్న–క్యువాస్ ద్వయం 3–6, 3–6తో రెండో సీడ్ మాక్సిమో–జెబలాస్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడింది.



బాబర్ ఆజమ్ సెంచరీ సంబరం

సొహైల్

షాహిన్

# పాక్ రేసులోకొచ్చింది

### కివీస్‌పై ఘనవిజయం

- బాబర్ ఆజమ్ అజేయ శతకం
- రాణించిన సొహైల్, షాహిన్
- విలియమ్సన్ బృందానికి తొలి పరాజయం

**బర్మింగ్‌హామ్:** ప్రపంచకప్ రేసు రసవత్తరమవుతోంది. రోజు వ్యవధిలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ ఓటమి పాలవడంతో మిగతా జట్లను సెమీస్ చాన్స్ ఊరిస్తోంది. ఇప్పుడు అలాంటి చాన్స్‌నే పాకిస్తాన్ కొట్టేసింది. బుధవారం జరిగిన పోరులో పాక్ 6 వికెట్ల తేడాతో జోరుమీదున్న కివీస్‌కు షాకిచ్చింది. ముందుగా న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. నీషమ్ (112 బంతుల్లో 97 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడగా... గ్రాండ్‌హోమ్ (71 బంతుల్లో 64; 6 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచాడు. పాక్ బౌలర్ షాహిన్ అఫ్రిది 3 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 49.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి గెలిచింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బాబర్ ఆజమ్ (127 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు) అజేయ శతకం సాధించగా, హారిస్ సొహైల్ (76 బంతుల్లో 68; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అతనికి అండగా నిలిచాడు.

**కష్టాలతో మొదలైందిలా...**

టాస్ నెగ్గిన న్యూజిలాండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఈ నిర్ణయం తప్పని తెలిసేందుకు ఎంతోసేపు పట్టలేదు. పిచ్‌పై తేమ, ఔట్ ఫీల్డ్ మందకొడిగా ఉండటం పాక్‌కు కలిసొచ్చింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్ వేసిన ఆమిర్ గప్టిల్ (5)ను బౌల్డ్ చేయగా... రెండు బౌండరీలతో ఊపుమీదున్న మున్రో (12)ను, రాస్ టేలర్ (3)ను షాహిన్ అఫ్రిది తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. అప్పటికీ జట్టు స్కోరు 38/3. కాసేపటికే లాథమ్ (1)ను కూడా షాహినే ఔట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ విలియమ్సన్, నీషమ్ జోడీ నింపాదిగా ఆడింది. కానీ జట్టు కుదురుకుంటున్న దశలో విలియమ్సన్ (69 బంతుల్లో 41; 4 ఫోర్లు) ఔట్ కావడంతో వందలోపే కివీస్ సగం వికెట్లను చేజార్చుకుంది. అనంతరం నీషమ్, గ్రాండ్‌హోమ్ పట్టుదలతో ఆడారు. ఆరో వికెట్‌కు 132 పరుగులు జోడించాక గ్రాండ్‌హోమ్ రనౌటై వెనుదిరిగాడు. నీషమ్ సెంచరీకి చేరువగా వచ్చి 3 పరుగుల దూరంలో నిలిచాడు.

**బాబర్ అజేయంగా...**

లక్ష్యం మోస్తరుగానే ఉండటంతో పాక్‌కు ఎక్కడా ఇబ్బందులు ఎదురవలేదు. మూడో ఓవర్లోనే ఫఖర్ జమాన్ (9) నిష్క్రమించినా... కాసేపటికి ఇమామ్ ఉల్ హక్ (19) ఔటయినా... బాబర్ ఆజమ్, హఫీజ్ (50 బంతుల్లో 32; 5 ఫోర్లు) సమన్వయంతో ఆడటంతో పాక్ లక్ష్యానికి అవసరమైన ఒక్కో పరుగును జత చేసుకుంటూ వెళ్లింది. మరో వికెట్ పడకుండా 22.5 ఓవర్లలో పాకిస్తాన్ 100 పరుగులు చేసింది. ఈ జోడీ బలపడిన దశలో కెప్టెన్ విలియమ్సన్ బౌలింగ్‌కు దిగి హఫీజ్ వికెట్‌ను పడగొట్టాడు. అలా పాక్ 110 పరుగుల వద్ద మూడో వికెట్‌ను కోల్పోగా సొహైల్... బాబర్‌కు జతయ్యాడు. సొహైల్ కూడా చక్కగా ఆడటంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. అతని అండతో బాబర్ 65 బంతుల్లో తన అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. గతితప్పిన బంతిని బౌండరీ దాటిస్తూ సొహైల్ వేగం పెంచాడు. 36వ ఓవర్లో జట్టు స్కోరు 150కి చేరింది. హారిస్ 61 బంతుల్లో అర్ధసెంచరీ చేస్తే... బాబర్ 124 బంతుల్లో శతకం సాధించాడు. లక్ష్యానికి 2 పరుగుల దూరంలో సొహైల్ రనౌటవ్వగా మిగతా లాంఛనాన్ని సర్ఫరాజ్ (5 నాటౌట్) పూర్తి చేశాడు. పాక్ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో అఫ్గానిస్తాన్ (జూన్ 29న)తో, బంగ్లాదేశ్ (జూలై 5న)తో ఆడుతుంది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 7 | 6 | 1 | 0 | 0.906 | 12 |
| న్యూజిలాండ్ | 7 | 5 | 1 | 1 | 1.028 | 11 |
| భారత్ | 5 | 4 | 0 | 1 | 0.809 | 9 |
| ఇంగ్లండ్ | 7 | 4 | 3 | 0 | 1.051 | 8 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.133 | 7 |
| పాకిస్తాన్ | 7 | 3 | 3 | 1 | -0.976 | 7 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.119 | 6 |
| వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | 0.190 | 3 |
| దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.324 | 3 |
| అఫ్గానిస్తాన్ | 7 | 0 | 7 | 0 | -1.634 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

### స్కోరు వివరాలు

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ (బి) ఆమిర్ 5; మున్రో (సి) హారిస్ సొహైల్ (బి) షాహిన్ అఫ్రిది 12; విలియమ్సన్ (సి) సర్ఫరాజ్ (బి) షాదాబ్ ఖాన్ 41; టేలర్ (సి) సర్ఫరాజ్ (బి) షాహిన్ అఫ్రిది 3; లాథమ్ (సి) సర్ఫరాజ్ (బి) షాహిన్ అఫ్రిది 1; జిమ్మీ నీషమ్ (నాటౌట్) 97; కొలిన్ గ్రాండ్‌హోమ్ (రనౌట్) 64; సాన్‌ట్నర్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 237.**

**వికెట్ల పతనం:** 1–5, 2–24, 3–38, 4–46, 5–83, 6–215.

**బౌలింగ్:** మొహమ్మద్ హఫీజ్ 7–0–22–0, మొహమ్మద్ ఆమిర్ 10–0–67–1, షాహిన్ అఫ్రిది 10–3–28–3, ఇమాద్ 3–0–17–0, షాదాబ్ 10–0–43–1, వహాబ్ రియాజ్ 10–0–55–0.

**పాకిస్తాన్ ఇన్నింగ్స్:** ఇమాముల్ హక్ (సి) గప్టిల్ (బి) ఫెర్గూసన్ 19; ఫఖర్ (సి) గప్టిల్ (బి) బౌల్ట్ 9; బాబర్ ఆజమ్ (నాటౌట్) 101; హఫీజ్ (సి) ఫెర్గూసన్ (బి) విలియమ్సన్ 32; హారిస్ సొహైల్ (రనౌట్) 68; సర్ఫరాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.1 ఓవర్లలో 4 వికెట్లకు) 241.**

**వికెట్ల పతనం:** 1–19, 2–44, 3–110, 4–236.

**బౌలింగ్:** బౌల్ట్ 10–0–48–1, హెన్రీ 7–0–25–0, ఫెర్గూసన్ 8.1–0–50–1, గ్రాండ్‌హోమ్ 2–0–12–0, సాన్‌ట్నర్ 10–0–38–0, నీషమ్ 3–0–20–0, విలియమ్సన్ 8–0–39–1, మున్రో 1–0–9–0.

సాక్షి బిజినెస్
గురువారం
27-6-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 157 ▲ | 51 ▲ |
| 39,592 | 11,848 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,937 | ▲ | 52 |
| డోజోన్స్ | 26,640 | ▲ | 92 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,416 | ▼ | 6 |
| డాక్స్ | 12,245 | ▲ | 17 |
| షాంఘై | 2,976 | ▼ | 6 |
| నికాయ్ | 21,087 | ▼ | 107 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.64 | 70.28 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.56 | 89.71 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.43 | 80.33 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.43 | 65.87 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.33 | 49.51 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.36 | 52.14 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.71 | 19.43 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.14 | 19.65 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.43 | 10.79 |

# ఫేస్‌బుక్ క్రిప్టో కరెన్సీపై జీ-20 దేశాల దృష్టి

**లండన్:** సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్ ప్రతిపాదించిన క్రిప్టో కరెన్సీ లిబ్రా కాయిన్‌పై శక్తిమంతమైన జీ20 కూటమి దేశాల నియంత్రణ సంస్థలు దృష్టి పెట్టాయి. ఫేస్‌బుక్ క్రిప్టో కరెన్సీ వ్యవహారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ చెప్పారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోణంలో ఫేస్‌బుక్ అత్యున్నత ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఫేస్‌బుక్ ప్రాజెక్టు లక్ష్యాలు భారీగానే ఉన్నాయని, అయితే నిబంధనలకు లోబడే అది పనిచేయాల్సి ఉంటుందని బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ గవర్నర్ ఫ్రాంకోయిస్ విల్రాయ్ డి గాల్ చెప్పారు. ఫేస్‌బుక్ క్రిప్టోకరెన్సీకి అనుమతులివ్వడం అంత ఆషామాషీ కాదని, నియంత్రణ సంస్థలతో చర్చించకుండా దీన్ని ప్రవేశపెట్టడం కుదరదని ఇంగ్లండ్‌కి చెందిన ఆర్థిక వ్యవహారాల ప్రాధికార సంస్థ చీఫ్ ఆండ్రూ బెయిలీ పేర్కొన్నారు. ఈ వారాంతంలో జీ20 దేశాల నేతలు జపాన్‌లో సమావేశమవుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బ్యాంకింగ్ వ్యవస్థతో సంబంధం లేకుండా ఆర్థిక లావాదేవీలు జరిపేందుకు ఉపయోగపడే లిబ్రా కాయిన్స్‌ను వచ్చే ఏడాది ప్రవేశపెట్టాలని ఫేస్‌బుక్ యోచిస్తున్న సంగతి తెలిసిందే. వీటితో లావాదేవీల వ్యయాలు గణనీయంగా తగ్గుతుం




దని, మరిన్ని సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవొచ్చని ఫేస్‌బుక్ చెబుతోంది. కంపెనీకి రెండు వందల కోట్ల పైగా యూజర్లు ఉండటంతో ఆర్థిక లావాదేవీలపై ఇది గణనీయ ప్రభావం చూపించవచ్చన్న అంచనాలున్నాయి. అయితే, క్రిప్టో కరెన్సీల భద్రతపై సందేహాలుండటం, పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వీటిని నిషేధించడం కారణంగా ఫేస్‌బుక్ లిబ్రా కాయిన్ చర్చనీయాంశమైంది.

# గూగుల్‌పై ఫ్రాన్స్‌లో దావా

**డేటా భద్రత చట్టాలు ఉల్లంఘించినందుకే..!**

**ప్యారిస్:** అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్‌కు ఫ్రాన్స్‌లో షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా క్లాస్ యాక్షన్ దావా నమోదైంది. కఠినతరమైన యూరోపియన్ యూనియన్ డేటా భద్రత చట్టాలను ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలపై వినియోగదారుల హక్కుల సంస్థ యూఎఫ్‌సీ–క్యూ కొయిసర్ గ్రూప్ ఈ దావా వేసింది. ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సాఫ్ట్‌వేర్ ఆధారిత ఫోన్లు, ట్యాబ్‌లు మొదలైన డివైజ్‌లను ఉపయోగించే యూజర్ల వ్యక్తిగత డేటాను గూగుల్ మోసపూరితంగా దొంగిలిస్తోందని, దీన్ని అరికట్టే లక్ష్యంతోనే క్లాస్ యాక్షన్ సూట్ వేశామని యూఎఫ్‌సీ గ్రూప్ ప్రెసిడెంట్ అలెయిన్ బెజోట్ తెలిపారు. ఒకవేళ తమకు అనుకూలంగా తీర్పు వచ్చిన పక్షంలో ఫ్రాన్స్‌లో 2.8 కోట్ల మంది ఆండ్రాయిడ్ యూజర్లు ఒక్కొక్కరికీ 1,000 యూరోల దాకా పరిహారం లభించే అవకాశా




లున్నట్లు వివరించారు. ఇప్పటిదాకా 200 మంది పైగా ఈ దావాలో చేరినట్లు బెజోట్ చెప్పారు. ఈ ఏడాది జనవరిలోనే ఫ్రాన్స్‌కి చెందిన డేటా నియంత్రణ సంస్థ సీఎన్ఐఎల్.. గూగుల్‌పై 50 మిలియన్ యూరోల జరిమానా విధించింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో వినియోగదారులకు విధించే అభ్యంతరకరమైన నిబంధనలు తొలగించాలంటూ ప్యారిస్ జిల్లా స్థాయి కోర్టు కూడా గూగుల్‌ను ఆదేశించింది.

**గూగుల్ మ్యాప్స్‌లో మరో భద్రతా ఫీచర్ ..**

గూగుల్ మ్యాప్స్ తాజాగా భారత్‌లో 'స్టే సేఫర్' కొత్త ఫీచర్ ప్రవేశపెట్టింది. ట్యాక్సీలు, ఆటోల్లో ప్రయాణిస్తున్నప్పుడు.. వాహనం దారి తప్పితే వెంటనే యూజర్లను హెచ్చరించడం ఇందులో ప్రత్యేకత. ఈ ఫీచర్ ద్వారా.. ప్రయాణికులు తమ ట్రిప్ గురించిన వివరాలు ఎప్పటికప్పుడు కుటుంబసభ్యులు, మిత్రులకు లైవ్‌లో అందజేయొచ్చని గూగుల్ పేర్కొంది. గూగుల్ మ్యాప్స్ యాప్‌లో వెళ్లాల్సిన గమ్యస్థానం, మార్గం గురించి సెర్చి చేసిన తర్వాత 'గెట్ ఆఫ్–రూట్ అలర్ట్స్' ఆప్షన్‌ను యాక్టివేట్ చేయడం ద్వారా ఈ సేవలు పొందవచ్చని వివరించింది. ఒకవేళ డ్రైవర్ గూగుల్ మ్యాప్ సూచించిన రూటుకు భిన్నంగా దాదాపు అర కిలోమీటరు మేర వాహనాన్ని దారి మళ్లించిన పక్షంలో వెంటనే ప్రయాణికుల ఫోన్‌కు నోటిఫికేషన్ వచ్చేస్తుంది.

# మొండి బండ.. మరింత భారం!

- మూలధన నిధుల కేటాయింపులన్నీ వీటికే...
- బ్యాంక్ లాభాలపైనా తీవ్ర ప్రభావం
- దివాలా చట్టం ఊరట అంతంతే
- ప్రైవేట్ బ్యాంక్‌లకూ పెరుగుతున్న సమస్య

మొండి బకాయిలు... ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సమస్య తీవ్రత తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అవేవీ ఫలించడం లేదు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల మొండి బకాయిల సమస్య మరింత తీవ్రమవుతోంది. ఈ సమస్య కారణంగానే గత ఆర్థిక సంవత్సరం మార్చి క్వార్టర్‌లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల నిర్వహణ నష్టాలు రూ.50,000 కోట్లకు మించాయి. అంతే కాకుండా భారీ కంపెనీల కొన్ని బకాయిలు మొండిగా మారే ప్రమాదమూ పొంచి ఉంది. మార్చి క్వార్టర్ చివరినాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల స్థూల మొండి బకాయిలు రూ.7.7 లక్షల కోట్లకు తగ్గింది. అయితే ఇది ఏమంత ఊరటనిచ్చే విషయం కాదని నిపుణులంటున్నారు.

### దివాలా ప్రక్రియ మంచిదే కానీ...

మొండి బకాయిల రికవరీ కోసం రూపొందించిన దివాలా చట్టం మంచి ఫలితాలనే ఇస్తోంది. అయితే ఈ ప్రక్రియ కారణంగా బ్యాంకులు ఇచ్చిన రుణాల కంటే తక్కువ మొత్తంలోనే రికవరీ కానుండటం ఒకింత ప్రతికూల ప్రభావం చూపించనున్నది. మరోవైపు ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారిపోవడం కూడా బ్యాంక్‌లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. గత ఆర్థిక సంవత్సరం(2018–19) మార్చి క్వార్టర్‌లో జీడీపీ ఐదేళ్ల కనిష్ట స్థాయికి, 5.8 శాతానికి పడిపోయింది. జీడీపీ క్షీణత కారణంగా వ్యవసాయ, రియల్టీ, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగాలకు ఇచ్చిన రుణాలు మొండిగా మారిపోయే ప్రమాదమూ లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ఒత్తిడి ఖాతాల కోసం మూలధన నిధులను కేటాయిస్తున్నాయి. భూషణ్ స్టీల్, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ అండ్ మోనెట్ ఇస్పాత్, జెట్ ఎయిర్‌వేస్, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు...ఇలా ఒత్తిడి ఖాతాలకు నిధులను కేటాయిస్తున్నాయి. ఇది ఆందోళనకరం. ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, అలోక్ ఇండస్ట్రీస్‌లకు సంబంధించిన దివాలా కేసులు పూర్తిగా పరిష్కారమైతే, బ్యాంక్‌లకు మొండి బకాయిల భారం ఒకింత తీరుతుంది. ఈ కేసులన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగం కల్లా పరిష్కారం అవుతాయన్న అంచనాలు నెలకొన్నాయి.

### రెండేళ్లలో రూ.2 లక్షల కోట్లు...

గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు కేంద్ర ప్రభుత్వం రూ.52,000 కోట్ల మేర నిధులందించింది. దీంతో కలుపుకొని మొత్తం రెండేళ్లలో రూ.2 లక్షల కోట్లు అందించినట్లయింది. ఈ నిధుల్లో అధిక మొత్తాలను బ్యాంక్‌లు మొండిబకాయిల 'కేటాయింపులకే' కేటాయించాయి. అయినప్పటికీ, గత క్యూ4లో బ్యాంక్‌ల నష్టాలు తగ్గలేదు. రుణ నాణ్యత తగ్గడంతో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల రుణ మంజూరీలు కూడా తగ్గాయి. ప్రైవేట్ బ్యాంక్‌లు జోరుగా రుణాలిస్తుండగా, ప్రభుత్వ బ్యాంక్‌లు మాత్రం రుణ నాణ్యతను మెరుగుపరచుకోవడంపైననే దృష్టి పెట్టాయి. ఉదాహరణకు చూస్తే, బ్యాంక్ ఆఫ్ బరోడా రుణ–డిపాజిట్ నిష్పత్తి 2017లో 64 శాతం, గతేడాది 72 శాతంగా ఉంది. దీనికి భిన్నంగా ఐసీఐసీఐ బ్యాంక్ రుణ–డిపాజిట్ నిష్పత్తి 95, 91 శాతాలుగా నమోదైంది.

### కంపెనీలకు తగ్గుతున్న రుణాలు..

ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.., ఇతర రుణాలతో పోల్చితే కంపెనీలకు బ్యాంక్‌లు ఇచ్చిన రుణాలు ఈ ఏడాది ఏప్రిల్‌లో తగ్గాయి. కంపెనీలకు బ్యాంక్‌లు ఇచ్చిన రుణాలు 12 శాతం తగ్గాయి. మరోవైపు వాహన కొనుగోళ్ల రుణాలు 5 శాతం, ఇతర వ్యక్తిగత రుణాలు 21 శాతం, సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థల రుణాలు 1 శాతం మేర పెరిగాయి. మధ్య స్థాయి సంస్థలకు ఇచ్చిన రుణాలు 4 శాతం ఎగిశాయి.

### మెరుగుపడుతున్న రుణ నాణ్యత

ఇక రుణ నాణ్యత మెరుగుదల అన్ని బ్యాంక్‌ల్లో ఒకేలా లేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) స్థూల మొండి బకాయిలు 23 శాతం తగ్గి రూ.1.73 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. తాజా మొండి బకాయిలపై నియంత్రణ సాధించామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార వ్యాఖ్యానించారు. రుణ నాణ్యత మరింతగా మెరుగుపడిందని, ఒత్తిడి ఖాతాలకు తగిన కేటాయింపులు జరిపామని పేర్కొన్నారు.

దాదాపు ఏడు క్వార్టర్ల పాటు నష్టాలు ప్రకటిస్తూ వచ్చిన యునైటెట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత క్యూ4లో లాభాల బాట పట్టింది. ఈ బ్యాంక్ స్థూల మొండి బకాయిలు 27 శాతం తగ్గి రూ.12,053 కోట్లకు తగ్గాయి. రుణ నాణ్యత మెరుగుదల పరంగా చూస్తే, ప్రభుత్వ బ్యాంక్‌ల కంటే ప్రైవేట్ బ్యాంక్‌లదే పై చేయిగా ఉంది. ఈ విషయంలో ఐసీఐసీఐ బ్యాంక్ ముందు వరుసలో ఉంది. ఈ బ్యాంక్ స్థూల మొండి బకాయిలు 14 శాతం తగ్గి రూ.46,292 కోట్లకు చేరాయి.



### ప్రైవేట్ బ్యాంక్‌లకూ పాకుతున్న సమస్య...

మొండి బకాయిల విషయంలో కొన్ని ప్రైవేట్ బ్యాంక్‌లు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లతో పోటీ పడుతున్నాయి. స్థూల మొండి బకాయిల పెరుగుదల విషయంలో యస్‌బ్యాంక్‌ను చెప్పుకోవాలి. గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఈ బ్యాంక్ స్థూల మొండి బకాయిలు 200 శాతం ఎగసి రూ.7,883 కోట్లకు పెరిగాయి. ఒక విమానయాన సంస్థ(జెట్ ఎయిర్‌వేస్ కావచ్చు), మౌలిక రంగ దిగ్గజం(ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్) బకాయిలను మొండి బకాయిలుగా గుర్తించామని, అందుకే గత క్యూ4లో మొండి బకాయిలు భారీగా పెరిగాయని యస్ బ్యాంక్ యాజమాన్యం వెల్లడించింది. ఇక ఇండస్‌ఇండ్ బ్యాంక్ స్థూల మొండి బకాయిలు 131 శాతం పెరిగి రూ.3,947 కోట్లకు చేరాయి. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ కంపెనీల బకాయిలను మొండి బకాయిలుగా గుర్తించడం వల్ల ఈ బ్యాంక్ మొండిబకాయిలు ఇంతగా పెరిగాయి. ఈ బ్యాంక్‌కు మొండి భారం మరింతగా ఉండనున్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ బ్యాంక్ అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు, ఎస్సెల్, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్, ఇతర కొన్ని కంపెనీలకు బాగానే రుణాలిచ్చిందని, ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరంలో వీటి కేటాయింపులు మరింతగా పెరుగుతాయని వారంటున్నారు. మొత్తం మీద ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లను మొండి బకాయిల సమస్య ఇప్పట్లో వదిలేలా లేదు.

## హైదరాబాద్‌లో హోగర్ కంట్రోల్స్ కేంద్రం



ఉత్పత్తులతో కరణ్ కుమార్, విష్ణురెడ్డి (కుడి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్ హోం, బిల్డింగ్ ఆటోమేషన్ రంగంలో ఉన్న యూఎస్ కంపెనీ హోగర్ కంట్రోల్స్ హైదరాబాద్‌లో తయారీ కేంద్రంతో పాటు ఆర్‌అండ్‌డీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఉప్పల్‌లో నెలకొల్పిన ఈ ఫెసిలిటీకి ఏటా ఆరు లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం ఉంది. ఇప్పటి వరకు కంపెనీ సుమారు రూ.34 కోట్ల వరకు వ్యయం చేసింది. రానున్న మూడేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడి ఉంటుందని హోగర్ కంట్రోల్స్ సీఈవో విష్ణురెడ్డి తెలిపారు. కో– ఫౌండర్ కరణ్ కుమార్‌తో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పలు ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశాం. కంపెనీలో ప్రస్తుతం 70 మంది ఉద్యోగులున్నారు. 2020 చివరికల్లా ఈ సంఖ్య 200కు చేరుకోనుంది. 10 దేశాల్లో సేవలను విస్తరించనున్నాం. మాడ్యులర్ స్విచ్‌లకై రెండు పేటెంట్లను దాఖలు చేశాం' అని వివరించారు.

## అమితాబ్‌కాంత్ బాధ్యతలు మరోసారి పొడిగింపు



**న్యూఢిల్లీ:** నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (నీతి ఆయోగ్) సీఈఓ అమితాబ్ కాంత్ బాధ్యతలను కేంద్రం రెండేళ్లు పొడిగించింది. 2019 జూన్ 30వ తేదీతో ఆయన పదవీకాలం పూర్తవనుండగా, దీనిని 2021 జూన్ 30 వరకూ పొడిగిస్తూ, కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఒక నిర్ణయం తీసుకున్నట్లు సిబ్బంది వ్యవహారాలశాఖ ఉత్తర్వులు తెలిపాయి. 2016 ఫిబ్రవరి 17న రెండు సంవత్సరాల కాలానికి అమితాబ్ కాంత్ నీతి ఆయోగ్ సీఈఓగా నియమితులయ్యారు. తరువాత ఆయన పదవీకాలాన్ని కేంద్రం 2019 జూన్ 30వ తేదీ వరకూ పొడిగించింది. నీతి ఆయోగ్ సీఈఓగా బాధ్యతలను స్వీకరించే ముందు పారిశ్రామిక విధానం, అభివృద్ధి విభాగం కార్యదర్శిగా పనిచేశారు.

# పెట్టుబడులు, టెండర్లు ఆపేయండి

- బీఎస్ఎన్ఎల్‌కు టెలికం శాఖ ఆదేశం
- కంపెనీ ఆర్థిక సమస్యలే కారణం

**న్యూఢిల్లీ:** ముందస్తు కొనుగోళ్ల ఆర్డర్లు, ఇప్పటికే ఖరారైన టెండర్లను తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా నిలిపివేయాలంటూ ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్‌ను టెలికం శాఖ (డాట్) ఆదేశించింది. దీంతో పెట్టుబడి వ్యయాలకు సంబంధించి కొత్త టెండర్లు ప్రకటించాలంటే ముందుగా ఢిల్లీలోని కార్పొరేట్ ఆఫీసర్ అనుమతులు తీసుకోవాలంటూ అన్ని సర్కిల్స్ హెడ్స్‌కు బీఎస్ఎన్ఎల్ ఆర్థిక విభాగం ఆదేశాలు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బీఎస్ఎన్ఎల్ తీవ్ర ఆర్థిక సవాళ్లతో సతమతమవుతున్న నేపథ్యంలో తాజా ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'బీఎస్ఎన్ఎల్ తాత్కాలికంగా ఆర్థిక ఒత్తిళ్లు ఎదుర్కొంటోందని, ఇప్పటికే పేరుకుపోయిన రుణ భారాలను తీర్చే పరిస్థితుల్లో లేదని సర్కిల్ హెడ్స్‌కు పంపిన ఆర్డరులో కంపెనీ పేర్కొంది' అని బీఎస్ఎన్ఎల్ వర్గాలు తెలిపాయి. పెట్టుబడి వ్యయాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ డాట్ నుంచి




ఆదేశాలు రావడంతో బీఎస్ఎన్ఎల్ ఈ మేరకు ఆర్డరు జారీ చేసినట్లు వివరించాయి. ప్రైవేట్ టెలికం సంస్థలు ఓవైపున వేల కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేస్తుండగా.. వాటితో పోటీపడేందుకు 4జీ స్పెక్ట్రం కేటాయింపుల కోసం బీఎస్ఎన్ఎల్ ఇంకా ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూస్తోంది. హై స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అనువుగా భారీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ అందుకు అవసరమైన పరికరాలు ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది. నిధుల సమీకరణ కోసం రియల్ ఎస్టేట్ ఆస్తులను విక్రయించే ప్రతిపాదనను పంపినప్పటికీ కేంద్రం దానిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టింది. ఇవన్నీ బీఎస్ఎన్ఎల్ కార్యకలాపాల విస్తరణకు అడ్డంకులుగా మారాయి.

2014–15లో రూ. 672 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించిన బీఎస్ఎన్ఎల్ ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో రూ. 3,885 కోట్లు, 2016–17లో రూ. 1,684 కోట్ల నిర్వహణ లాభాలు ఆర్జించింది. రిలయన్స్ జియో రాకతో మిగతా టెల్కోల తరహాలోనే బీఎస్ఎన్ఎల్‌పై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడిన సంగతి తెలిసిందే. టెలికం రంగంలో గతంలో ఎన్నడూ లేనంత భీకరమైన పోటీ నెలకొందంటూ కంపెనీ ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎస్‌కే గుప్తా గత నెలలో చీఫ్ జనరల్ మేనేజర్స్‌కు రాసిన లేఖలో వ్యాఖ్యానించారు. పోటీ సంస్థలు ఆఫర్ చేస్తున్న అత్యంత చౌకైన టారిఫ్‌ల కారణంగా కంపెనీ ఆదాయం గణనీయంగా పడిపోయిందని అందులో ఆయన పేర్కొన్నారు.

# ఎల్‌జీ 'డబ్ల్యూ' సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

- ప్రారంభ ధర రూ. 8,999
- జూలై 3న అమెజాన్‌లో ఫ్లాష్ సేల్

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం ఎల్‌జీ.. 'డబ్ల్యూ' సిరీస్ పేరుతో అధునాతన స్మార్ట్‌ఫోన్లను బుధవారం భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. డబ్ల్యూ10, డబ్ల్యూ30, డబ్ల్యూ30 ప్రో పేరిట మూడు వేరియంట్లను ఆవిష్కరించింది. జూలై 3న అమెజాన్ డాట్ ఇన్‌లో ఫ్లాష్ సేల్ ద్వారా వీటిని విక్రయించనున్నట్లు ప్రకటించింది. 3జీబీ ర్యామ్, 32జీబీ స్టోరేజీ కలిగిన డబ్ల్యూ10 ధర రూ.8,999 కాగా.. 6.19 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, 8 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా, 13 మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సార్ (పీడీఏఎఫ్ లెన్స్), 5 మెగాపిక్సెల్ సెన్సార్ ఫిక్స్‌డ్ ఫోకస్ లెన్స్ కెమెరాలు ఉన్నాయి. ఇక 3జీబీ ర్యామ్, 32జీబీ స్టోరేజీ కలిగిన 'డబ్ల్యూ30' ధర రూ.9,999 కాగా.. ఇందులో 6.26 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, 16 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా, 13 మెగాపిక్సెల్ ఆటోఫోకస్ వైడ్ యాంగిల్ లెన్స్, 12 మెగాపిక్సెల్ సెన్సార్ కెమెరాలు ఉన్నాయి. మరో ఫోన్ 'డబ్ల్యూ30 ప్రో' వేరియంట్‌లో 4జీబీ ర్యామ్,



64జీబీ స్టోరేజీ ఉండగా.. దీని పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. ఈ మూడు వేరియంట్లలోనూ 4,000 ఎంఏహెచ్ లి–పాలిమర్ బ్యాటరీ ఉన్నట్లు కంపెనీ తెలిపింది. ఆండ్రాయిడ్ 9 ఆధారంగా ఇవి పనిచేస్తాయి.

**10 లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యం..**

డబ్ల్యూ సిరీస్‌లోని స్మార్ట్‌ఫోన్ల సంఖ్యను త్వరలోనే ఐదుకు చేర్చనున్నట్లు కంపెనీ తెలిపింది. డిసెంబర్ చివరినాటికి 10 లక్షల యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా బిజినెస్ హెడ్ (మొబైల్ కమ్యూనికేషన్) అద్వైత్ వైద్య అన్నారు.

# చెల్లింపుల డేటా భారత్‌లోనే ఉండాలి

**ఆర్‌బీఐ వివరణ**

**ముంబై:** డేటా లోకలైజేషన్ నిబంధనలపై రిజర్వ్ బ్యాంక్ స్పష్టతనిచ్చింది. పేమెంట్ సిస్టమ్ ఆపరేటింగ్ సంస్థలు (పీఎస్‌వో) చెల్లింపుల లావాదేవీల డేటా మొత్తం భారత్‌లోని సిస్టమ్స్‌లోనే భద్రపర్చాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అవసరమైతే డేటాను విదేశాల్లో ప్రాసెస్ చేయొచ్చని... కానీ దాన్ని 24 గంటల్లోగా భారత్‌కు మార్చాల్సి ఉంటుందని, విదేశీ




సర్వర్ల నుంచి తొలగించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. చెల్లింపుల డేటాను భారత్‌లోనే భద్రపర్చాలన్న (డేటా లోకలైజేషన్) నిబంధనల మీద పీఎస్‌వోలు లేవనెత్తిన సందేహాలు నివృత్తి చేస్తూ ఆర్‌బీఐ ఈ మేరకు వివరణ ఇచ్చింది.

# డిఫాల్టర్ల ఆస్తుల వివరాలు బ్యాంకులకివ్వండి

**న్యూఢిల్లీ:** రుణాల ఎగవేతదారుల నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేసేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు కోరిన పక్షంలో.. ఎగవేతదారుల ఆస్తులు, ఖాతాల వివరాలను వాటికి అందించాలంటూ ఆదాయ పన్ను (ఐటీ) విభాగానికి కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదేశాలు జారీ చేసింది. అసెసీలు ఏటా సమర్పించే ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) నుంచి ఇందుకు సంబంధించిన వివరాలను క్రోడీకరించాలని సూచించింది. రుణాల రికవరీకి డిఫాల్టర్ల స్థిరాస్తుల వివరాలు ఇవ్వాలంటూ ప్రభుత్వ రంగ బ్యాంకులు పలు



**ఐటీ విభాగానికి సీబీడీటీ ఆదేశాలు**

మార్లు విజ్ఞప్తి చేసిన దరిమిలా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సీబీడీటీ పేర్కొంది. ఆస్తులతో పాటు బ్యాంకుల అభ్యర్థన మేరకు లోన్ డిఫాల్టర్ల బ్యాంకు ఖాతాల వివరాలు, చిన్నా చితకా రుణదాతల వివరాలు కూడా ఇవ్వొచ్చని తెలిపింది. రుణ గ్రహీత, తనఖా ఉంచిన వారు, గ్యారంటార్లుగా ఉన్న వారి సమాచారాన్ని మాత్రమే ఇవ్వాలని, గోప్యనీయత నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించింది. విజయ్ మాల్యా నుంచి నీరవ్ మోదీ దాకా పలువురు కార్పొరేట్లు భారీ స్థాయిలో రుణ మోసాలకు పాల్పడిన నేపథ్యంలో ఎగవేతదారులపై నిబంధనలు ప్రభుత్వం మరింత కఠినం చేస్తుండటం తెలిసిందే.

# హైదరాబాద్ వద్ద వల్లభ డెయిరీ ప్లాంటు

- రూ.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- జనవరికల్లా రాజమండ్రిలో కేంద్రం
- ఈ ఏడాది రూ. 500 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- 'సాక్షి'తో సంస్థ చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పాలు, పాల పదార్థాల రంగంలో ఉన్న వల్లభ డెయిరీ హైదరాబాద్ సమీపంలో అత్యాధునిక ప్లాంటును నెలకొల్పింది. యాదాద్రి – భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్లాంటును బుధవారం ఆరంభించింది. రోజుకు 2 లక్షల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేయగల సామర్థ్యం ఈ కేంద్రానికుంది. మల్కాపూర్ ప్లాంటుకు రూ. 50 కోట్లు వెచ్చించినట్లు వల్లభ డెయిరీ చైర్మన్, వినుకొండ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఇక్కడి ప్లాంటు నుంచి పాలను సరఫరా చేస్తామని తెలిపారు.

**ఏపీలో మరో కేంద్రం..**

కంపెనీ ఏపీలోని రాజమండ్రి దగ్గరున్న ఎర్నగూడెం వద్ద కొత్తగా తయారీ కేంద్రాన్ని నిర్మిస్తోంది. రోజుకు 2 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేయగల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంటుకు రూ.50 కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. 2020 జనవరి కల్లా ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం అవుతుందని కంపెనీ చెబుతోంది. అలాగే 2020 చివరి నాటికి వల్లభ డెయిరీ మహారాష్ట్రలో ఎంట్రీ ఇవ్వనుంది. అక్కడ కూడా రోజుకు 2 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేయగలిగే ప్లాంటును రూ.50 కోట్లతో ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఇప్పటికే సంస్థకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ, చిత్తూరు జిల్లా కాణిపాకంలో ప్లాంట్లున్నాయి. ఒక్కో కేంద్రం సామర్థ్యం రోజుకు 2 లక్షల లీటర్లు. ఈ రెండు యూనిట్ల కోసం సంస్థ రూ.100 కోట్లు ఖర్చు చేసింది.






**ఈ ఏడాది రూ.500 కోట్లు..:** వల్లభ డెయిరీ పాలతోపాటు నెయ్యి, పెరుగు, మజ్జిగ, పాలతో తయారైన స్వీట్లు, పానీయాలను విక్రయిస్తోంది. కంపెనీ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో విస్తరించింది. అటు దక్షిణాదిన చెన్నై, బెంగళూరు నగరాల్లోనూ అడుగు పెట్టింది. ఈ ఏడాది తమిళనాడు, కర్ణాటకలోని ప్రధాన నగరాలు, పట్టణాలను పూర్తిగా కవర్ చేయాలని లక్ష్యంగా చేసుకుంది. ప్రస్తుతం ఏపీ, తెలంగాణలో 50 చిల్లింగ్ సెంటర్లను వల్లభ డెయిరీ నిర్వహిస్తోంది. త్వరలో మరో 25 చిల్లింగ్ కేంద్రాలు తోడవనున్నాయి. 2018–19లో కంపెనీ రూ.250 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.500 కోట్లు సాధించాలని లక్ష్యించుకున్నట్లు బ్రహ్మనాయుడు వెల్లడించారు.



పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కుప్పకూలిన మహ్మద్ అన్వర్



పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు మీర్ రియాసత్ అలీ సజ్

# పేగులు చొక్కాలో దోపుకుని పరుగులు!

- పంజగుట్ట పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో యువకుడి దారుణ హత్య
- స్టేషన్ రిసెప్షన్‌కు వచ్చి కుప్పకూలిపోయిన వైనం..
- కత్తితో ఠాణాకు వచ్చి లొంగిపోయిన నిందితుడు

**హైదరాబాద్:** పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే దారుణ హత్య.. బయటపడిన పేగులను చొక్కాలో దోపుకుని.. బాధితుడు రోడ్డుపై పరుగులు తీయడం.. అలా పరిగెత్తి.. పరిగెత్తి పోలీసు స్టేషన్‌కే వచ్చి కుప్పకూలడం.. ఇలాంటివన్నీ మనం సినిమాల్లో చూసుంటాం.. అయితే, బుధవారం హైదరాబాద్‌లోని పంజగుట్టలో జనం చూస్తుండగా జరిగిన ఈ దృశ్యం కలకలం రేపింది..

పంజగుట్ట ప్రధాన రహదారిపై ఉన్న బడీ మజ్జిద్‌లో నివాసం ఉండే మహ్మద్ అన్వర్ (32), నాగార్జున హిల్స్‌లోని పంజాబ్ పహాడ్ వద్ద నివాసం ఉండే మీర్ రియాసత్‌అలీ సజ్ (35)లు ఆటో డ్రైవర్‌లు. పంజగుట్ట కూడలివద్ద ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఆటో స్టాండ్‌లో తమ ఆటోలు నిలుపుతుంటారు. ఇద్దరూ మంచి స్నేహితులని, అయితే, గత కొంతకాలంగా పడటం లేదని, ఇప్పటికే నాలుగుసార్లు ఆటో స్టాండ్ వద్ద గొడవపడ్డారని స్థానికులు చెబుతున్నారు. వీరిద్దరి మధ్య గొడవలు తారా స్థాయికి చేరడంతో మహ్మద్ అన్వర్‌ను ఎలాగైనా హత్య చేయాలని మీర్ రియాసత్ అలీ పథకం పన్నాడు.. ముందుగానే తన వెంట ఓ కత్తిని తీసుకువచ్చాడు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆటో స్టాండ్‌లో ఉండగానే వారి మధ్య వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన రియాసత్ వెంటతెచ్చుకున్న కత్తితో అన్వర్‌ను పొడిచాడు. పొడవడమే కాకుండా కత్తి కడుపులోకి దిగిన తర్వాత బలంగా చీల్చడంతో అన్వర్ కడుపులోని పేగులు బయటకు వచ్చాయి. దాంతో బయటపడ్డ పేగులు చొక్కాలో దోపుకున్న అన్వర్ పక్కనే ఉన్న పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తి గ్రౌండ్‌ఫ్లోర్‌లోని రిసెప్షన్ టేబుల్ వద్ద కుప్పకూలిపోయాడు.

### కత్తితో పోలీసు స్టేషన్‌కు..

అటు నిందితుడు రియాసత్ అలీ అన్వర్‌ను పొడిచిన కత్తితో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. విధుల్లో ఉన్న అడ్మిన్ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ చేతిలో కత్తి, రక్తం చూసి ఏం జరిగిందని ప్రశ్నించగా, తన భార్యకు, పిల్లలకు హెచ్ఐవీ రక్తం ఎక్కించిన అన్వర్‌ను పొడిచానని చెప్పడంతో వెంటనే అతన్ని లాకప్‌లో వేసి కిందకు దిగాడు. అక్కడ అప్పటికే బాధితుడు కొన ఊపిరితో ఉండటం చూసి.. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆసుపత్రికి తీసుకువెళ్లే లోపే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు.

### భయాందోళన చెందిన వాహనదారులు

పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఘటన జరగడం, బాధితుడు తీవ్ర గాయాలు, రక్తంతో పరిగెత్తడం, నిందితుడు కూడా కత్తితో పరుగులు తీయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళన చెందారు. ఏం జరుగుతోందో తెలియక ఆందోళనకు గురయ్యారు.

# నారాయణపురం ఠాణా.. ది బెస్ట్

- జాతీయ స్థాయి ఉత్తమ ఠాణాల్లో ఒకటిగా గుర్తింపు
- 14వ స్థానం సొంతం.. చింతపల్లి ఠాణాకు 24వ ర్యాంక్
- 'ఉత్తమ ఠాణా'ల జాబితా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని రెండు పోలీసు స్టేషన్లకు అరుదైన గుర్తింపు లభించింది. 2018కి సంబంధించి పనితీరు ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న వాటిలో 86 ఠాణాలను బెస్ట్ అంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) గుర్తించింది. వీటిలో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని సంస్థాన్ నారాయణపురం 14వ స్థానంలో, నలగొండ జిల్లా చింతపల్లి పోలీసుస్టేషన్ 24వ స్థానంలో నిలిచాయి. 2015లో ఎంహెచ్ఏ ఆధ్వర్యంలో జరిగిన వార్షిక డీజీపీల సదస్సులో చేసిన అనేక తీర్మానాల్లో 'ఉత్తమ పోలీసుస్టేషన్ల'గుర్తింపు ఒకటి. మౌలిక వసతులు, పనితీరు, ప్రజల మన్నన తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని దేశంలోని ఉత్తమ ఠాణాలకు అవార్డులు ఇవ్వాలని ఆ సదస్సులో నిర్ణయించారు. దీంతో 2017 నుంచి బెస్ట్ ఠాణాల ఎంపిక మొదలైంది. ఆ ఏడాది హైదరాబాద్ కమిషనరేట్‌లో ఉన్న పంజగుట్ట రెండోస్థానంలో నిలిచింది.

### సమగ్ర అధ్యయనం తర్వాత ఎంపిక...

దేశ వ్యాప్తంగా ఉత్తమ పోలీసుస్టేషన్లను ఎంపిక చేయాల్సిన బాధ్యతల్ని ఎంహెచ్ఏ క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తుంది. కేంద్రం అధీనంలోని ఈ విభాగం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తుంది. 750 కంటే ఎక్కువ ఠాణాలు కలిగిన రాష్ట్రాల నుంచి మూడు, మిగిలిన రాష్ట్రాల నుంచి రెండు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఒకటి చొప్పున ఎంట్రీలను స్వీకరిస్తుంది. తెలంగాణ నుంచి వెళ్లిన ఎంట్రీల్లో నారాయణపురం, చింతపల్లి పోలీసుస్టేషన్లు ఉన్నాయి. క్వాలిటీ కంట్రోల్‌కు చెందిన ఓ ప్రత్యేక బృందం ఈ ప్రాంతాలకు చేరుకుని దాదాపు 2 నెలల పాటు రహస్యంగా వాటి పనితీరు, మౌలిక సదుపాయాలు, నేరాల నిరోధం, కేసుల్ని కొలిక్కి తీసుకురావడం తదితర అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఒక్కో పోలీసుస్టేషన్ పరిధి నుంచి 100 మందిని ఎంపిక చేసుకుని వారి అభిప్రాయాలు తీసుకుంది. వీరిలో ఠాణాకు వచ్చిన బాధితులు, దాని చుట్టుపక్కల నివసించే వారు, పోలీసుస్టేషన్ పరిధిలోని విద్య, వ్యాపార సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థల నుంచి వివరాలు సేకరించింది.



నారాయణపురం పోలీస్ స్టేషన్

### ఇదో అరుదైన గుర్తింపు...



రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని సంస్థాన్ నారాయణపురం ఠాణా జాతీయ స్థాయిలో ఉత్తమ ఠాణాగా ఎంపిక కావడం అరుదైన గుర్తింపుగా భావిస్తున్నాం. కమిషనరేట్‌కే తలమానికమైన రాచకొండ గ్రామం ఇదే పోలీసుస్టేషన్ పరిధిలో ఉండటం గమనార్హం. ఈ గ్రామాభివృద్ధికి పోలీసు విభాగం అనేక రకాలైన సహాయసహకారాలు అందించింది. ఈ పోలీసుస్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సీసీటీఎన్ఎస్ వ్యవస్థ అమలు కూడా పక్కాగా సాగుతోంది. ఈ గుర్తింపు సాధించడంలో సహకరించిన డీజీపీ మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ ఠాణా ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఏసీపీ, డీసీపీని అభినందిస్తున్నా.

– మహేష్ మురళీధర్ భగవత్, రాచకొండ పోలీసు కమిషనర్

### అత్యంత క్లిష్టమైన ఎంపిక విధానం...

క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ఎంపిక విధానం అత్యంత క్లిష్టంగా ఉంటుంది. తొలుత అభిప్రాయాలు సేకరించినప్పుడు కనీసం 80 శాతం మంది పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయాలి. కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, నేరగాళ్లకు శిక్షలు పడుతున్న శాతం, రికవరీలతో పాటు ఠాణా పరిశుభ్రత, పచ్చదనం, అక్కడి పోలీసుల ప్రవర్తన, విధి నిర్వహణ తీరును పరిగణలోకి తీసుకుంటారు. ఈ బృందం పరిశీలించే అంశాల్లో టాయిలెట్స్‌లోని ఫ్లష్‌లు సరిగ్గా పని చేస్తున్నాయా? వంటి చిన్న చిన్నవీ ఉంటాయి. ఇలా చేపట్టిన సమగ్ర అధ్యయనం తర్వాత దేశంలో ఉత్తమంగా నిలిచిన పోలీసు స్టేషన్ల జాబితాను ఎంహెచ్ఏకు అందిస్తుంది.

### డ్యూటీ మీట్‌లో అందించే అవకాశం...

ఈ పోలీసుస్టేషన్ల జాబితాను వివిధ కోణాల్లో పరిశీలించే ఎంహెచ్ఏ అధికారులు వాటినీ మదిస్తారు. ఈ జాబితాను ఓ నిపుణుల కమిటీకి అందిస్తారు. వీరు చేసే మదింపు తర్వాత తుది ఉత్తమ పోలీసుస్టేషన్ల జాబితా విడుదల అవుతుంది. ఈసారి మొత్తం 86 ఠాణాలు బెస్ట్‌గా గుర్తించగా, వీటిలో రెండు తెలంగాణకు చెందినవి ఉన్నాయి. ఈ మేరకు ఎంహెచ్ఏ నుంచి రాష్ట్ర పోలీసు విభాగానికి వర్తమానం అందింది. ఈ ఠాణాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రోల్‌మోడల్‌గా ప్రకటిస్తారు. 2017కు సంబంధించి పంజగుట్ట పోలీసుస్టేషన్ రెండో స్థానం సంపాదించింది. గత ఏడాది గ్వాలియర్‌లో జరిగిన వార్షిక డీజీపీల సదస్సులో అవార్డును అందించారు. ఈసారి అదే సంప్రదాయం కొనసాగుతుందా లేక జాతీయ స్థాయిలో జరిగే ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌లో ఈ అవార్డుల్ని అందిస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు.

# సీరియల్ నటి లలిత అదృశ్యం

**హైదరాబాద్:** తెలుగు టీవీ సీరియల్స్‌లో నటించే లలిత (25) అనే మహిళ కనిపించకుండా పోయింది. అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న లలిత ఈ నెల 17 నుంచి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి వెంకటలక్ష్మి బుధవారం ఎస్సార్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతపురం జిల్లా ధర్మవరం మండలానికి చెందిన లలిత (25)కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమెకు ఏడేళ్ల వయసున్న కుమార్తె కూడా ఉంది. కాగా, లలిత ప్రస్తుతం భర్తతో దూరంగా ఉంటోంది. తన కూతురుని తల్లిదండ్రుల వద్ద ఉంచి నగరానికి వచ్చి టీవీ సీరియల్స్‌లో నటిస్తోంది. రోజూ రాత్రి సమయంలో ఫోన్ చేసి తల్లితో పాటు కుమార్తెతో మాట్లాడేది. ఈ నెల 17న ఫోన్ చేయకపోవడంతో తల్లి లలితకు ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. ఇలా వారం నుంచి లలిత ఫోన్ స్విచాఫ్ అని రావడంతో వెంకటలక్ష్మి మరో కుమార్తె రామాంజనమ్మతో కలిసి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఆరా తీసింది. లలిత రెండు నెలల క్రితమే హాస్టల్ నుంచి వెళ్లిపోయిందని నిర్వాహకులు తెలిపారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ముగిసిన పోలీస్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- లక్షా రెండువేల మందికి 91,000 మంది హాజరు
- వెరిఫికేషన్‌కు 10 వేల మందికి పైగానే డుమ్మా
- స్పోర్ట్స్ కోటాలో ఎలాంటి గందరగోళం లేదన్న టీఎస్ ఎల్పీఆర్‌బీ

**సాక్షి, హైదరాబాద్:** ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీఎస్ ఎల్పీఆర్ బోర్డు) చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. తుదిరాత పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 14న మొదలైన ధ్రువపత్రాల పరిశీలన 22 వరకు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 కేంద్రాల్లో ఎనిమిది పనిదినాల్లో ఈ ప్రక్రియ ముగిసింది. వాస్తవానికి 1,02048 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించగా, వీరిలో కేవలం 91,836 మంది మాత్రమే ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మిగిలిన 10,212 మంది ధ్రువపత్రాల పరిశీలనకు రాలేదు.

### 10 శాతం మంది గైర్హాజరు

తుది రాత పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల్లో 90 శాతం మంది మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలనలో సైబరాబాద్ (95 శాతం), హైదరాబాద్ (94 శాతం), రాచకొండ (94 శాతం), సంగారెడ్డి (94 శాతం), సిద్దిపేట (92 శాతం) ముందంజలో ఉన్నాయి. ఇక అత్యల్పంగా ఖమ్మంలో కేవలం 85 శాతం మాత్రమే అభ్యర్థులు హాజరయ్యారు. ఈ జిల్లాలో మొత్తం 8,274 మంది అభ్యర్థులు అర్హత సాధించగా కేవలం 7,042 మంది మాత్రమే వచ్చారు. తరువాత స్థానాల్లో కొత్తగూడెం (86 శాతం), నల్లగొండ (87 శాతం), సూర్యాపేట (88 శాతం) జిల్లాలున్నాయి.



### స్పోర్ట్స్ కోటాలో గందరగోళం లేదు

మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్ లేదా స్పోర్ట్స్ కోటా కింద అనుమతించడం లేదంటూ పలువురు అభ్యర్థులు చేసిన ఆరోపణలపై టీఎస్ఎల్పీఆర్‌బీ స్పందించింది. ఈ విషయంలో తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని స్పష్టం చేసింది. జీవో నెం74లో పేర్కొన్న 29 క్రీడాంశాల ప్రకారమే అర్హత నిర్ణయించామని స్పష్టం చేసింది.












Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792